# ఇస్కూల్ యాదిలో




డా॥ కేతవరపు రాజ్యశ్రీ

# ఇస్కూల్ యాదిలో

**డా॥ కేతవరపు రాజ్యశ్రీ**

ప్రథమ ముద్రణ : **04-04-2023**

వెల : రూ. **151/-**

కాపీలు : **500**

**ప్రతులకు :**
**డా॥ కె. రాజ్యశ్రీ**
ప్లాట్ నెం. 301, గోకుల్ అపార్ట్‌మెంట్స్,
స్ట్రీట్ నెం. 4, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020.
**సెల్ : 85001 21990**
ఇ-మెయిల్ : rketavarapu@gmail.com
Website : www.rajyasri.com

డి.టి.పి. :
టి. రాజేంద్రప్రసాద్

ముద్రణ :
**అక్షయ గ్రాఫిక్స్**
చిక్కడపల్లి, హైదరాబాద్.
సెల్ : **9989890588**
ఇ-మెయిల్ : rajendratammisetty6@gmail.com

# అంకితం



అంతులేని కబుర్లతో కడుపు నింపుకుంటూ
కష్టసుఖాలు కలబోసుకుంటూ
చిలిపి పోట్లాటలతో / చిట్టిపొట్టి అలకలతో
ప్రేమాభిమానాలతో ఒకరికొకరం అన్నట్టుగా
ఎప్పుడెప్పుడు కలుసుకుందామా అని
ఎదురు చూసే నిత్య చైతన్యశీలురు
స్నేహ బాంధవులు
పెద్దక్క జయశ్రీ,
చిన్నక్క సులోచన
చెల్లెలు విజయశ్రీ,
చిన్న చెల్లెలు లత (బాబాయి కూతురు)

ప్రేమతో
**రాజ్యశ్రీ**



# ఇస్కూల్ యాదిలో

**భారత్ భాషాభూషణ్ శ్రీమతి డా॥ కేతవరపు రాజ్యశ్రీ**

ప్రతి వ్యక్తికీ బాల్య స్మృతులు ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక సందర్భంలో గుర్తుకొస్తుంటాయి. పూర్వకాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండేది. విశాలమైన ఇళ్లు, ముందు వెనుక ఖాళీస్థలం, లేదా నడివాకిలి గల ఇళ్ళుండేవి. రాత్రి భోజనాలవంగానే ఆరు బయట నింగిలో చంద్రుణ్ణి చుక్కల్ని చూస్తూ తాత అమ్మమ్మ లేదా నాయనమ్మ మంచం వేసుకొని విసనకర్ర చేత్తో పట్టుకొని నడుం వాల్చేసరికి వారి పక్కలో మనవళ్లు, మనవరాళ్ళు చేరి కథ చెప్పమని మారాంచేసి వారుచెప్పే కథలు వింటూ నిద్రలోకి జారుకునేవారు. ఈ సందర్భంలోనే కొందరు పెద్దలు తమ బాల్య మధుర స్మృతులను చక్కటి కథలుగా రూపొందించి వారికి చెప్పడం కూడా కద్దు.

కాగా నేడు ఈ యాంత్రిక యుగంలో విశాలమైన ఇళ్ళుకాని, ఉమ్మడి కుటుంబాలు కానీ కానరావు. ఇరుకు గదులులలో సర్దుకొని ఉండడమేగాక సాధారణంగా ఎవరూ తమ తల్లిదండ్రులతో ఉండడానికి ఇష్టపడటంలేదు. ఆలుమగలిద్దరూ ఉద్యోగాలు చేస్తేకాని గడవని రోజులు, వారికి పిల్లలతో కూర్చుని కబుర్లు చెప్పుకునే సమయం ఉండదు. పిల్లలు కూడా సెల్ ఫోనుతో లేదా టీవీతో కాలక్షేపం చేస్తున్నారు.

భారత్ భాషాభూషణ్ శ్రీమతి డా॥ కేతవరపు రాజ్యశ్రీ గారు "ఇస్కూల్ యాదిలో" అనే శీర్షికతో మధుర మనోహర బాల్య స్మృతుల హారాన్ని అధ్యాయాలుగా రూపొందించి అందించారు. ఇందులో ప్రాథమిక పాఠశాల తరగతి నుండి 12వ తరగతి వరకు ఒక్కొక్క తరగతిలో ఒక్కొక్క సబ్జెక్ట్ తీసుకొని ఆయా తరగతి ఉపాధ్యాయుని విద్యాబోధన, ఆయన క్రమశిక్షణ వగైరాలు హృద్యమంగా అందించారు.

ఇదొక వ్యక్తిగత దినచర్య డైరీగా కాక, "ఇస్కూల్ యాదిలో" అనే చక్కటి కథానికామాల. రచయిత్రి తన రచనా శిల్ప చాతుర్యంతో పాఠకులలో ఉత్సుకతను రేకెత్తించి ఏకబిగిని చదివించే విధంగా రూపొందించి అందించడం విశేషం!

కథాసం విధాన చక్రవర్తి

**రావి. ఎన్. అవధాని**

# జ్ఞాపకాల పూలజల్లు

సరిగ్గా పన్నెండేండ్ల క్రితం "అక్షరాలు పరిమితం అవి వెదజల్లే జ్ఞాన పరిమళాలు విశ్వవ్యాప్తం" అంటూ అక్షరకేతనాన్ని ఎగుర వేసి హృదయాన్ని కదిలించిన కవితలు సాహిత్య లోకంలో రాజ్యశ్రీ గారి "చిరు సవ్వడులు, గుండె చప్పుళ్ళు, ఊహాల వసంతం, సిసింద్రీలు, వెన్నెల మెట్లు, నీలోకి నువ్వు, తృప్తీ నీవెక్కడ బొమ్మ-బొరుసు, అక్షరకేతనం, ఆధ్యాత్మకత, వృద్ధులకేనా, రెక్కల్లో గీతామృతం మొదలైన రచనల ద్వారా సమకాలీన సాహితీవేత్తలు, దేశస్థాయి, రాష్ట్రస్థాయి సాహితీవేత్తలు, మహానటులు, దర్శకులు, గాయనీ గాయకులు, సంఘసేవా సంస్థల అధినేతలు హైదరాబాద్ నగరమే కాదు, ఉభయ తెలుగు రాష్ట్రాలు, విదేశాల్లో తెలుగు ప్రోత్సాహక సంస్థల ప్రశంసలందుకున్న సంగతి ఇప్పుడు చెప్పవలసిన పనిలేదు. ఉదహరించాలని ఎందుకు అనిపించిందంటే – తెలుగులో అక్షరాలు – 'అ' నుండి 'ఱ' వరకు ఏభై ఆరే అని, పెద్ద బాలశిక్ష నుండి భగవద్గీత వరకు సాహిత్య గ్రంథాల రచనల ప్రయోజనం – సమాజ హితమేనని అందరికీ తెలిసిందే అయినా రాజ్యశ్రీ గారు ప్రాచీన ఆధునిక సాహిత్యాలను అధ్యయనం చేసి క్షీరసాగరమధనంలో వెలువడిన అమృతప్రాయ అక్షర సముదాయాన్ని పాఠకుల ముందుంచి ప్రశంసలందు కోవడం, సామాజిక ప్రయోజనాన్ని చేకూర్చడం ప్రత్యేకతగా చెప్పవలసి వచ్చింది.

అసలు విషయానికొస్తే..

నేటి బాలలే రేపటి పౌరులు, మరి నేటి పౌరులు, నిన్నటి బాలలే కదా! "పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు", బాల్యదశలోనే భావిజీవితపు ఉన్నతి ప్రస్ఫుటమౌతుందని, మొక్కై వంగనిది మానై వంగునా? అంటే బాల్యదశలో విద్యాబుద్ధులు, సంస్కారం నేర్పించవలసిక ఆవశ్యకత, బాధ్యత తల్లిదండ్రుల మీద, గురువుల మీద ఎంతగా వున్నదో? అలాగే మహానాయకుల, సంఘసంస్కర్తల, రచయితల, చిత్రకారుల, కళాకారుల, పరిపాలనాదక్షుల, క్రీడాకారుల, సైన్యాధికారుల, సాహసోపేతుల, శాస్త్రవేత్తల, వైద్యుల, శాంతిదూతల ప్రవచకుల ప్రఖ్యాత రచయితుల బాల్యం విశిష్టమైనది. అయితే మనకు ఎలా తెలుస్తాయి? వారికి వారుగా చెప్పకపోతే!

స్వీయ చరిత్రలు తెలుపకపోతే?

ఈ ప్రశ్నలకు సమాధానాలు మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా ప్రియదర్శిని, లాల్ బహుదూర్ శాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణన్, డా॥ బి.ఆర్. అంబేద్కర్, పి.వి. నరసింహారావు, ఏ.పి.జె. అబ్దుల్ కలాం, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, సుధామూర్తి, ఆచార్య ఆత్రేయ, ఆరుద్ర, సి. నారాయణరెడ్డి, దాశరథి, వారి వారి జీవిత చరిత్రలోని 'బాల్యదశ' అధ్యాయాలు చెబుతాయి.

అయితే ఆ స్థాయి మహానుభావులు, మహారచయిత్రులు అందరూ కాకపోవచ్చు. కాని సమాజాన్ని తన అక్షర ఆయుధాలతో చైతన్యపరిచి, సామాజిక శ్రేయస్సుకై నిరంతరం తపించే డా॥ కేతవరపు రాజశ్రీ గారి బాల్య "యి స్కూల్ యాదిలో" అప్పటి కుటుంబ వ్యవస్థ, విద్యా వ్యవస్థ, సంఘ నిర్మాణం, సాంఘిక బాధ్యతలు, విలువల పరిరక్షణకు తపన, శిక్షణ, శిక్షలు – ఫలితాలు, జ్ఞాపకాలు – చిరు వాక్యాలతో వచన రచనలో మహా అద్భుతాలు పసి మనస్సులు, అద్భుత, ఆవేదన, కోపతాపాలు, అసూయ, ఈర్ష్యాద్వేషాలు అన్ని గుప్పిట విప్పి నిజాలను నిర్భయంగా వెల్లడించడం చదువుతుంటే – పాఠకుడు యువకుడైతే కొద్దిగా వెనక్కి, మధ్య వయస్కుడైతే,ఇంకొద్ది వెనక్కి, వృద్ధుడైతే ముసి ముసి నవ్వులతో మరీ వెనక్క వెళ్ళి – తన జీవిత బాల్యాన్ని నెమరు వేసుకుని, పోల్చుకుని – బాల్యదశలోని మధుర జ్ఞాపకాలకు ఇంత చక్కని అక్షరరూపమివ్వవచ్చా! అని ఆశ్చర్యపోక తప్పదు. డా॥ కేతవరపు రాజ్యశ్రీ గారిని అభినందించకుండా వుండలేరు – అక్కినేని అంతటివారే ఆమె "ఊహల వసంతం" పుస్తకావిష్కరణ సభలో ఉక్కిరిబిక్కిరై 'అత్తగారూ!' అంటూ సంబోధిస్తూ మీ కవితా కన్యను నాకు అంకితమిచ్చి – నాకు అత్తగారయ్యారని చమత్కరించి రవీంద్రభారతిలో 'రాజ్యశ్రీ' గారి మీద మనసులతోనే పూలవానను వర్షింప చేశారు.

"యి స్కూల్ యాదిలో" మీ మనసుల్లో ఖచ్చితంగా మీ మీ బాల్యదశ మధుర జ్ఞాపకాల పూలజల్లు కురిపిస్తుందని ఆశిస్తూ... రచయిత్రికి గౌరవాభివందనములతో...

సాహితీమిత్రులు

**– నూలు శ్రీరామచంద్రరావు**

అకౌంట్స్ ఆఫీసర్, టాక్స్ కన్సల్‌టెంట్



# సంక్షిప్తంగా

నా సాహితీ ప్రస్థానం 1997 సంవత్సరం జూన్ నెలలో "తేజో ప్రభ" మాసపత్రికలో ప్రచురితమైన "మేఘమాల" కవిత నన్ను కవయిత్రిగా పాఠక లోకానికి పరిచయం చేయడంతో ప్రారంభమైంది. అప్పటి నుండీ తెలుగు సాహిత్యంలో వెలువడుతున్న దిన, వార, పక్ష, మాస పత్రికలలో నా కవితలూ, రచనలూ ప్రచురితమవుతున్నాయి.

ఆధునిక తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలోనూ దాదాపుగా రచనలు చేస్తున్నాను. శతక పద్యాలు, కవితలు, కథలు, కథానికలు, లలిత గీతాలు, ఆధ్యాత్మిక వ్యాసాలు, పుస్తక సమీక్షలు, ముందు మాటలు, పాటలు, యాత్రా విశేషాలు, ప్రముఖుల పరిచయాలు ప్రచురితమయ్యాయి.

అలాగే ఆధ్యాత్మికపరంగా, హేరంబ అష్టోత్తర శతనామావళి, శ్రీమాత అష్టోత్తర శతనామావళి, శ్రీ సూర్య అష్టోత్తర శతనామావళి, ఆదిత్య చాలీసా, శ్రీ శివ చాలీసా రాసి యూ ట్యూబ్ ద్వారా విడుదల చేశాను. భక్తి టి.వి. వారు శ్రీ సూర్య అష్టోత్తర శతనామావళి, ఆదిత్య చాలీసా వారి ఛానల్‌లో ప్రసారం చేస్తున్నారు.

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌గారి "స్ట్రేబర్డ్స్" కవితా సంకలాన్ని, "వెన్నెల పక్షులు" పేరుతో తెలుగులో అనుసృజన చేశాను.

భగవద్గీతను సామాన్యుడికి అర్థమయ్యేలా 108 శ్లోకాలు తీసుకుని తెలుగులో "గీతామృతం" అన్న పుస్తకం రాశాను. ఇది ఇంగ్లీషు, హిందీ, కన్నడ భాషల్లో తర్జుమా చేయబడినది.

నేను రాసిన కథా సంకలనం "మార్నింగ్ కాఫీ" ఇంగ్లీషులోకి, అక్షర కేతనం కవితా సంకలనం హిందీలోకి తర్జుమా చేయబడ్డాయి.

ఆకాశవాణి, హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం ద్వారానూ జెమినీ, భక్తి టి.వి. ఛానల్స్ ద్వారా నా కవితలు, సాహిత్య ప్రసంగాలు, 'ముఖాముఖీ' కార్యక్రమాలు ప్రసారమయ్యాయి, అవుతున్నాయి.

ఇంతవరకూ పుస్తక రూపంలో 40 కవితా సంకలనాలు 2 కథా సంపుటాలు, 4 ఆధ్యాత్మిక వ్యాస సంపుటాలు, 4 యాత్రా విశేషాల పుస్తకాలు, సాహిత్య వ్యాసాలు వెలువడినాయి.

ఉత్తమ గ్రంథ పురస్కారాలుగా "ఊహల వసంతం", "వెన్నెల పక్షులు", గీతామృతం పుస్తకాలను వరించాయి.

భారత్ భాషా భూషణ్, ప్రజ్ఞాశ్రీ సాహిత్యశ్రీ, వేదాంతవక్త, మొదలైన బిరుదులు, అక్కినేని స్వర్ణపతక పురస్కారం, ఎన్.టి.ఆర్. సాహిత్య సేవా పురస్కారం, జీవన సాఫల్య పురస్కారాలు, గౌరవ డాక్టరేట్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారి షష్టిపూర్తి కలాలకు "మాతృ వందనం" పురస్కారం మొదలైనవి పొందాను.

అమెరికా, లండన్, సింగపూర్, మలేసియా, హైదరాబాద్, విజయవాడ, తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొని కవితాగానం, సాహితీ ప్రసంగాలు చేయడం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా జరిగే జూమ్ మీటింగ్‌ల్లో సాహితీగోష్ఠులు, కవి సమ్మేళనాలు, ముఖాముఖీ కార్యక్రమాల్లో పాల్గొంటూ సాహితీఆర్తిని కొనసాగిస్తున్నాను.

**– కె. రాజ్యశ్రీ**

# కృతజ్ఞతలు

"ఇస్కూల్ అనుభవాల పరంపరకు" ముందు మాట రాసిన ప్రముఖ సాహితీవేత్త కథా సంవిధాన చక్రవర్తి రావి.ఎన్. అవధాని గారికి నమస్సులు. వారితో మాట్లాడిన తరువాత, తెలిసింది మాడపాటి హనుమంతరావు హై స్కూల్‌లో తెలుగు టీచర్ గౌరీ నాగేశ్వరిగారు, వీరికి మేనత్త అవుతారని చెప్పారు. చాలా సంతోషమనిపించింది. వారి వయస్సు 88 సంవత్సరాలైనా ఎంతో వుత్సాహంగా ఒక్క రోజులో ముందుమాట తనే కంప్యూటర్‌లో టైప్ చేసి పంపించారు. వారితో పరిచయం నాకు సంతోషకరంగా ఉత్తేజంగా అనిపించింది.

నూలు శ్రీరామచంద్రరావు గారిని ముందు మాట రాయమని అడిగినప్పుడు, నేను చాలా చిన్నవాడిని మేడమ్, మీ పుస్తకానికి నేను రాయడం ఏమిటి అన్నారు. అసలు నాకు "ఇస్కూల్ యాది"లో నా స్కూల్ అనుభవాలు ఇలా రాయాలని అనుకుంటున్నాను. అనగానే చాలా మంచి ఐడియా మేడమ్ తప్పక రాయండి అంటూ ఉత్సాహపరచడమే కాకుండా, "మహిళా విజయం" మాసపత్రిక సంపాదకులు శ్రీమతి వాసిరెడ్డి కాశీరత్నంగారితో నాకు పరిచయం చేయడం, వారితో మాట్లాడి ఈ ఇస్కూల్ అనుభవాలు సీరియల్‌గా పత్రికలో ప్రచురించడం వెనుక వున్నది శ్రీరామచంద్రమూర్తిగారే. అందుకే మీరే రాయాలి అన్నాను. ఆయన "జ్ఞాపకాల పూలజల్లు" అంటూ రాసి తన అభిప్రాయం పంపించడం సంతోషకరం.

నిజానికి శ్రీమతి వాసిరెడ్డి కాశీరత్నంగారు మహిళలందరికీ ఆదర్శమూర్తులు. 90 ఏళ్ల వయసులో చాలా ఉత్సాహంగా పత్రికా సంపాదకురాలిగా, రచయిత్రిగా ఎంతోమంది రచయితలనూ, కవులనూ ప్రోత్సహిస్తూ స్ఫూర్తిమంతంగా వుంటున్నారు. నా స్కూల్ అనుభవాలను తన పత్రిక ద్వారా పాఠకులకు అందచేసిన కాశీరత్నం గారికి కృతజ్ఞతలు.

చిన్నప్పటి నుంచీ, ఏ పని చేసినా, కలిసికట్టుగా వుండే అక్కచెల్లెళ్లు జయశ్రీ, సులోచన, విజయశ్రీ లకు కృతజ్ఞతలు.

చక్కగా డిటిపి చేసి ముద్రించి, కవర్ పేజీ మీద నా మనుమడిని, మనుమరాలి చిత్రాలతో చక్కగా డిజైన్ చేసి, పుస్తకాన్ని అందంగా అందించిన రాజేంద్రప్రసాద్‌కి కృతజ్ఞతలు.

అలాగే నన్ను ఇంత వున్నత స్థితికి తీసుకువచ్చిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకీ, మాడపాటి హనుమంతరావు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకీ పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు.

నా సాహిత్యకృషికి వెన్నూదన్నూ అయిన శ్రీవారు మాధవరావు గారికి సర్వదా కృతజ్ఞతలు. కుమారుడు ఫణీంద్ర, కుమార్తె ప్రియాంక, నా ఈ ఇస్కూల్ యాదికి ప్రేరణగా నిలిచిన మనవడు అక్షర్, మనవరాలు ఆకాంక్షకు ఆశీస్సులు.

నా అనుభవాలను చదివి, ఎంతోమంది పాఠకులు, తమ చిన్ననాటి సంగతులు మీ “ఇస్కూల్ యాది” విశేషాలు అంటూ వుత్తరాలు రాశారు. వారందరికీ కూడా ధన్యవాదాలు.

**– రచయిత్రి**



**15-05-2023 ప్రపంచ కుటుంబ దినోత్సవ సందర్భంగా మనవడు అక్షర్ మనుమరాలు ఆకాంక్షలకు ప్రత్యేక కానుక**




ప్రాథమిక విద్యాభ్యాసం




ఉన్నత విద్యాభ్యాసం

# ఇస్కూల్ యాదిలో

*"వాడు గదిలోకి వస్తూనే / అన్ని వస్తువులకూ ప్రాణం పోస్తాడు*
*నిష్క్రమిస్తూ / ప్రాణాలెత్తుకుపోతాడు –*
*అపరదైవం / బాల్యం"*
**– సుగమ్‌బాబు**

నా మనవడుని స్కూల్‌లో వేసినపుడు ఒక వారం రోజులు ఏడుస్తూనే ఉన్నాడు. నేను వాడిని ఒళ్ళో కూర్చో పెట్టుకుని, ఒరేయ్ కన్నా, నువ్వు రోజూ స్కూలుకు వెళ్లడానికి ఏడుస్తున్నావు కదా! నేను మాత్రం నా చిన్నప్పుడు ఒక్కరోజు కూడా ఏడవ లేదు తెలుసా అన్నాను. అవునా! అమ్మమ్మా! నువ్వు కూడా స్కూలుకు వెళ్ళావా? అంటూ ఆశ్చర్య పోతూ అడిగాడు. నేనేమిటి, మీ తాత, మీ అమ్మ. మీ నాన్న అందరం స్కూలుకు వెళ్ళాము అన్నాను.

వాడు చాలా కుతూహలంగా అమ్మమ్మా నువ్వు ఏ స్కూలుకు వెళ్ళావు?' అంటూ చాలా ఉత్సాహముగా అడిగాడు. నేను హైదరాబాద్‌లో గవర్నమెంట్ స్కూల్‌లో చదువుకున్నాను అని చెబుతూ వుంటే మనసు బాల్యంలోకి వురకలేసింది.

నేను హైదరాబాద్, వివేక్‌నగర్‌లో వున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి వరకు, తరువాత మాడపాటి హనుమంతరావు గారి స్కూల్‌లో 8 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నాను. మా ప్రభుత్వ పాఠశాలకు హెడ్మాస్టర్ అప్పట్లో జగన్ మోహన్‌రెడ్డి గారు. చాలా ఉన్నత ఆశయాలు కలిగిన వ్యక్తి.. ప్రతి రోజూ మొదటి బెల్లు కొట్టగానే అన్ని క్లాసులకి ఒకసారి రౌండ్ కొట్టి వెళ్లే వారు. ఆ రోజుల్లో మాకు స్కూల్ డ్రెస్ లేదు. అందుకని అందరూ శుభ్రమైన బట్టలు కట్టుకుని తల దువ్వుకున్నారా? చేతి గోళ్లు సరిగ్గా కత్తిరించుకున్నారా లాంటి చిన్న చిన్న విషయాలను కూడా పరిశీలించి మందలించే వారు.

మాకు మొదటి పీరియడ్ తెలుగు; మా తెలుగు మాష్టారు సూర్యనారాయణ మూర్తి గారు. ఆయన నుదుటన విభూది, దాని మధ్యలో కుంకుమ బొట్టు, పంచె కట్టుకుని అచ్చమైన తెలుగు మాస్టారిలా ఉండేవారు. క్లాసుకి రాగానే అందరిని ఒకసారి చూసి 5 నిమిషాలు తను కళ్ళు మూసుకుని మమ్మల్ని కూచోమనేవారు. అసలే పిల్ల కోతులం. 5 నిమిషాలు కళ్ళు మూసుకుని. ఉండగలమా! క్లాసులో నేను కొంచెము అల్లరి ఎక్కువ చేసే దాన్ని. మా తాత గారు మహాకాళి వెంకటేశ్వరరావు గారు తెలుగు పండితులు. ఎన్నో గ్రంధాలు వ్రాసారు. అందుకని ఏ చెట్టూ లేని చోట ఆముదం చెట్టు గొప్ప అన్నట్టు, నాకు తెలుగు కొంచము బాగా వచ్చని, అందరూ నాకు స్నేహితులుగా ఉండేవారు.

మా తాత గారు అక్కడి టీచర్లందరికి బాగా తెలిసిన వారని నాకు గొప్పగా ఉండేది. సరే మా తెలుగు మాష్టారు కళ్ళు మూసుకుని ఉండగానే, ఇంకా 5 నిమిషాలు అయిందో లేదోనని, మేము కళ్ళు మూస్తూ, తెరుస్తూ, దొంగ దొంగగా ఆయన్ని చూసేవాళ్ళం. నేనూ, నా దోస్తు పద్మ సుందరి నెమ్మదిగా ఒక కన్ను తెరచి ఒకళ్ళనొకళ్ళు చూసుకుని శబ్దం చేయకుండా నవ్వుకున్నాం. 5 నిమిషాలు కాగానే మాష్టారు కళ్ళు తెరిచి అరచేతులు చూసుకుని, కళ్ళకద్దుకుని, శుక్లాంబరధరం శ్లోకం చదివేవారు. మేమందరం కూడా కళ్ళు తెరచి చాలా ఆనందముగా ఏన్నాళ్లయిందో ఒకరినొకరు చూసుకుని అన్నట్లుగా చూసుకునేవాళ్ళం.

అప్పట్లో మాకు ఇది ధ్యానం అని తెలియదు. రోజూ రాగానే కళ్ళు మూసుకోమంటారు ఇదేమిటో అని నవ్వుకునే వాళ్ళం. ఇదంతా మా జీవితానికి పునాది అని మాకు తెలియదు. సూర్యనారాయణ మూర్తి మాష్టారు పాఠం మొదలు పెడతారు. అనుకుంటూ ఉండగా, తాను ధ్యానములో వున్నప్పుడు ఎవరెవరు కళ్ళు తెరచి మూసుకున్నారో, ఎవరు నవ్వారో వాళ్ళనందరిని లైనుగా పిలిచేవారు. ఒక్కొక్కరిని ఒంగో బెట్టి వీపు మీద ఒక్కో గుద్దు గుద్ది పంపేవారు. మగ పిల్లల వంతు కాగానే, నా వైపు, పద్మ సుందరి వైపు వేలు చూపించి రమ్మని పిలిచారు. ఆమ్మో నన్ను కూడా చూసారా అని భయం భయం గా దగ్గర కెళ్ళాను. నన్ను చేయి చాపమని బెత్తముతో ఒక్కదెబ్బ వేశారు. పై ప్రాణాలు పైనే పోయినాయి. ఎప్పుడు ఎవ్వరి దగ్గర దెబ్బలు తినని నాకు అభిమానం దెబ్బ తిన్నది. ఇంటికి వెళ్లి మా తాతకు ఫిర్యాదు చేశాను.

నన్ను ఇంత దెబ్బ ఎందుకు కొట్టారో వచ్చి మాస్టారిని అడగండి అని . మా తాత "ఆయన ధ్యానములో వున్నప్పుడు నువ్వు నవ్వడము తప్పు కదా, చీటికీ మాటికీ నిన్ను వెనకేసుకొస్తే బావుండదు. ఆయన చాలా మంచి వారు. ఇవాళ చూడు, నువ్వు బాగా ఉంటే మెచ్చుకుంటారు" అంటూ బుజ్జగించి స్కూలుకు పంపారు.

అదే ఈ రోజుల్లో అయితే, మా అమ్మాయినే కొడతావా అంటూ మాస్టారుని సస్పెండ్ కూడా చేయించే వారు.

# దేవుడు ఎక్కడెక్కడ వుంటాడు?

మా తెలుగు మాస్టారు సూర్యనారాయణమూర్తి గారు. ఆ రోజు ప్రహ్లాదచరిత్ర చెబుతున్నారు. అందులో హిరణ్యకశిపుడు తన కొడుకు ప్రహ్లాదుడిని "నువ్వెప్పుడూ శ్రీ హరి నామ జపం చేస్తున్నావు. ఆ శ్రీహరి ఎక్కడున్నాడు చూపించు. ఇప్పుడే అతడిని సంహరిస్తాను" అంటాడు. దానికి ప్రహ్లాదుడు తన తండ్రితో:

తండ్రీ :
**ఇందుగలడందు లేదు చక్రి**
**సర్వోపగతుండు ఎందెందు**
**వెదకి జూచిన అందందే కలడు**
**దానవాగ్రణి కంటే!**

అంటే శ్రీహరి ఎక్కడ చూస్తే అక్కడే కనపడతాడు అని ప్రహ్లాదుడు చెప్పిన ఈ పద్యానికి అర్థం చెప్పి, రేపు ఈ పద్యం దాని తాత్పర్యం, ప్రశ్నలు జవాబులు నేను ఇచ్చిన నోట్స్ నుంచి చదువుకుని రండి అని చెప్పారు.

మర్నాడు మేమందరం చదువుకుని వచ్చాము. మాస్టారు. వస్తూనే ఐదు నిమిషాలు మా అందరి చేత ధ్యానం చేయించి, అందరూ నిన్నటి పద్యం, తాత్పర్యం నేర్చుకుని వచ్చారా అని అడిగారు.

ఓ అంటూ అందరం తలలూపాము. కేశవ అనే అబ్బాయి ఒక్కడూ మౌనంగా వున్నాడు. అది గమనించిన మాస్టారు ఆ అబ్బాయినే ముందుగా లేపి ప్రశ్నించారు. నిజానికి కేశవ ముందు రోజు స్కూల్‌కి రాలేదు. అతనికి ఈ పద్యం, దాని అర్థం. గురించి తెలీదు. అతను రాలేదన్న విషయం మాస్టారుకి తెలియదు. అంతమందిలో గుర్తు ఉండదు కదా!

"కేశవా చెప్పు దేవుడు ఎక్కడెక్కడ ఉంటాడు" అని అడిగారు. మాస్టారు. కేశవకి అర్థం కాలేదు. దేవుడు ఎక్కడ ఉంటాడు అని నన్ను అడుగుతాడు ఏమిటి? ఆయనకి తెలియదా అనుకుని మిడి గుడ్లు వేసుకుని చూస్తూ నిలబడ్డాడు. "ఏరా చదువుకుని రాలేదా? మాట్లాడవ్ ఏమిటి? చెప్పు దేవుడు ఎక్కడెక్కడ ఉంటాడు" అని గద్దించారు మాస్టారు.

నిన్న తను రాలేదని చెబితే, ఎందుకు రాలేదని కొడతారేమోనని, భయంతో చేతులు కట్టుకుని, చూపుడు వేలు పైకి చూపిస్తూ "దేవుడు పైన ఆకాశంలో వుండును" అని చెప్పాడు.

క్లాసులో అందరం గొల్లుమని నవ్వాము. "ఇందుగలడందులేడని "పద్యంలో ప్రహ్లాదుడు ఏం చెప్పాడు. అంటూ బెత్తం తీసి కొట్టబోయి, మాతో పాటు ఫక్కున నవ్వేశారు సూర్యనారాయణ మూర్తి మాస్టారు.

# హిందీ క్లాసు

మా వివేకనగర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఫస్ట్ లాంగ్వేజ్, హిందీ సెకండ్ లాంగ్వేజ్, ఇంగ్లీష్ మూడవ లాంగ్వేజ్ ఉండేది. త్రీ లాంగ్వేజ్ ఫార్ములా.

మేము నాలుగవ తరగతి తెలుగులోనే చదువుకున్నాము. ఐదవ తరగతి నుంచి హిందీ నేర్పించడం మొదలుపెట్టారు. నిజానికి మాలో చాలా మంది పిల్లలకి తెలుగులోనే ఒత్తులు, దీర్ఘాలు, గుణింతాలే సరిగ్గా వచ్చేవి కావు. ఒక ప్రశ్నకి జవాబు రాస్తే అందులో చాలా తప్పులు ఉండేవి. దానికి తోడూ కొత్తగా ఈ హిందీ అక్షరాలు అదనంగా నేర్చుకోవాలంటే కొంత కష్టంగానే ఉండేది. హిందీలో (అ ఆ ఇ ఈ) లు నేర్పించారు. ఎవరికి వచ్చినా రాకపోయినా సిలబస్ కంప్లీట్ అవ్వాలి కదా! ఆరు నెలల పరీక్షలు పెట్టారు. 'ఆ ఆ' లే కదా హిందీ పరీక్ష బానే రాసాము. తరువాత చిన్న చిన్న రెండు అక్షరాల పదాలు గుణింతాలు, వాటితో వచ్చే పదాలు నేర్పించడం మొదలు పెట్టారు. 'క' గుణింతంతో 'కాలా' అనే పదం నేర్పించారు. 'కాలా' అంటే నలుపు అని అర్థం అంటూ బోర్డు మీద రాసి చూపించారు మాస్టారు. ఆ రోజు క్లాసులో మగపిల్లలు నల్లగా ఉన్న అమ్మాయిలను చూసి కాలా పిల్లా, కాలా పిల్లా అంటూ ఏడిపిస్తూ అల్లరి చేసేవారు. నల్లగా వున్న ఆడపిల్లలు చాలా బాధపడ్డారు. క్లాసులో అమ్మాయిలు అందరూ కలిసి హిందీ మాస్టారుకి, మగ పిల్లలంతా చేరి ఆడపిల్లల్ని ఏడిపిస్తున్నారు అని ఫిర్యాదు చేశారు. దాంతో మాస్టారు అమ్మాయిలను ఏడిపిస్తార్రా అంటూ వాళ్ళని అరిచేతులు చాపమని బెత్తంతో కొట్టారు. "వాళ్ళ చేతులు ఎర్రగా కందిపోయి వాళ్ళు వద్దు సార్! కొట్టకండి సార్! ఇంకెప్పుడూ ఏడిపించము సార్" అంటూ అరిచేతులు రాసుకుంటూ ఏడుస్తున్నారు. వాళ్ళని మాస్టారు అలా కొడుతుంటే, మా అమ్మాయిలందరికి కూడా కళ్ళ నీళ్ళు వచ్చాయి. అయ్యో అనవసరంగా ఫిర్యాదు చేశామే అని బాధ పడ్డాము.

బుద్ధి వచ్చిందా ఇంకొకసారి అమ్మాయిలను ఏడిపిస్తే ఏకంగా సస్పెండ్ చేస్తాం అని వాళ్ళని బెదిరించారు మాస్టారు.

అప్పటి నుంచి చాలా రోజులు అమ్మాయిలను చూసి తలవంచుకుని తిరిగేవారు అబ్బాయిలందరూ.

మరునాడు క్లాస్ లో 'ల' అక్షరంతో పదాలు నేర్పిస్తూ 'లజ్జ' అనే పదం బోర్డ్ మీద రాసి అందరిచేత చెప్పిస్తున్నారు. నా పక్కన కూర్చున్న గిరిజకి ఈ 'లజ్జ' అనే పదం కొంచెం అయోమయంగా, తిట్టులా అనిపించింది. నా చెవిలో రహస్యంగా 'లజ్జా' నా లేక ల మధ్యలో ం సున్నా కూడా ఉందా అని అడిగింది. ఎందుకంటే ఆ రోజుల్లో అది ఒక పాపులర్ తిట్టు. మగపిల్లలకు లం... కొడకా అనేది వూత పదంగా ఉండేది. నాకు మటుకూ ఏం తెలుసు గిరిజా ఇప్పుడేగా వింటున్నాను అన్నాను అమాయకంగా.

ఇంతలో రవి అనే అబ్బాయి లేచి దాని అర్థం ఏమిటండి మాస్టారు అని అడిగాడు కొంటెగా. బహుశా గిరిజాకి వచ్చిన అనుమానమే, అందరి మనసుల్లో మెదులుతున్నట్టు వుంది. దానికి మా హిందీ మాస్టారు చెబుతా! అంత తొందర అయితే ఎలా అని 'లజ్జా' అంటే సిగ్గు అని అర్థం. నేను ఏదైనా ప్రశ్న వేస్తే దానికి జవాబు తెలియకపోతే సిగ్గుపడుతూ మీరు గోళ్ళు కొరుకుతూ వుంటారు కదా! దానినే హిందీ "లజ్జ" అంటారు అంటూ కొంచెం వ్యంగ్యం మిళితం చేస్తూ అర్థం చెప్పారు.

నేనూ, గిరిజ ఒకరి ముఖం ఒకరు చూసుకొని చిన్నగా నవ్వుకున్నాము. ఇంకా నయం గిరిజ లేచి ఈ ప్రశ్న అడగలేదు, పరువు పోయేది అనుకున్నా. ఈ విషయం ఎప్పుడెప్పుడు ఫ్రెండ్స్‌కి చెప్పాలా అని మనసు ఉగ్గబట్టుకుని కూర్చున్నా.

అన్నం గంట కొట్టగానే పరుగు పరుగున దోస్తులను కలిసి అందరికీ ఈ విషయం అదే పద్మకి వచ్చిన డౌట్ గురించి చెప్పాను. అందరూ పొట్టచెక్కలయ్యేలా పడీ పడీ నవ్వారు. అందరూ గిరిజాతో ఇంకా నయం గిరిజా నువ్వు సార్‌ను అడగలే, లేకుంటే మగపిల్లల ముందు మన ఇజ్జత్ పోయేది అన్నారు. పాపం గిరిజ సిగ్గుతో అదే లజ్జతో తల వంచుకుని, తను కూడా నవ్వడం మొదలుపెట్టింది.

అలా క్లాసులో మాస్టార్లకు భయపడుతూ, మళ్ళీ అంతలోనే నవ్వుకుంటూ, తిట్టుకుంటూ గడిపేసేవాళ్ళం.

# లెక్కల మాస్టారు

ఇప్పటిదాకా మా హిందీ క్లాసు గురించి మాట్లాడుకున్నాము కదా. ఇప్పుడు మా పాఠశాలలో లెక్కల మాస్టర్ గురించి తెలుసుకుందాం. మాకు సత్యనారాయణ రెడ్డి సారు లెక్కలు చెప్పేవారు. లెక్కలు అసలు అర్థం అయ్యేవి కాదు. ఆయన క్లాస్ అనగానే అందరికీ హడలు. లెక్క సరిగ్గా చేయకపోతే మగ పిల్లలని అరచేతులను వెనక్కు పెట్టమని చెప్పి వేళ్ళ మక్కెలమీద బెత్తంతో కొట్టేవారు. నొప్పితో గోల పెడుతుంటే మళ్లీ అరచేతుల మీద కొట్టేవారు. అరచేతిలో బొబ్బలెక్కేవి. మగ పిల్లలంతా కలిసి రోజు ఇలా కొట్టి చంపుతున్నారు ఎలా ఆయన నుంచి తప్పించుకోవడం అని ఆలోచన చేశారు. ఎలాగైనా సారుకి బుద్ధి చెప్పాలి అనుకున్నారు. మరునాడు, స్కూలుకి వచ్చేటప్పుడు నిమ్మకాయ చెక్కలు తెచ్చుకున్నారు. మాస్టారు లెక్కలు చెబుతున్నారు. అవి ఎవరికీ అంతగా అర్థం కావడం లేదు. ఎందుకు అంటే ఆయనను చూస్తేనే అందరికీ భయం, దానికి తోడు ఆయన ప్రశ్నలు వేస్తే మాకు తెలిసినా కూడా చెప్పలేక పోయే వాళ్ళం. ఆ రోజు ఆయన మాకు భాగహారాలు (divisions) చెబుతున్నారు. ఈ సంఖ్యను దీనితో భాగిస్తే ఎంత అని అడిగేసరికి భయంతో గుడ్లు మిటకరించి చూస్తున్నాము. మీకు ఎక్కాలన్నీ నేర్పించాను కదా! ఈ చిన్న భాగహారం చెప్పలేరా? అంటూ బెదిరించారు. ఏది 9వ ఎక్కం చెప్పండి అంటూ ముందు వరసలో కూర్చున్న మగపిల్లల్ని లేపి అడిగారు. ముందుగా వెంకట్ అనే విద్యార్థి తొమ్మిది ఒకట్ల తొమ్మిది, తొమ్మిది రెళ్ళ పద్దెనిమిది అంటూ చెప్పుకుంటూ పోతూ, అతను తొమ్మిది ఏళ్లు, తొమ్మిది ఏళ్ళు... అంటూ నసుగుతూ గుర్తురాక భయంతో మిడిగుడ్లు వేసుకుని 'సార్' ని చూస్తూ ఆగిపోయాడు.

ఇంకా, మా సత్యనారాయణ సార్! ఆవేశం వచ్చేసింది. తొమ్మిదో ఎక్కం కూడా చెప్పడంలేదు. ఏమిటి అనుకున్నాడు. వెంకట్‌ని చేయిచాపమని బెత్తంతో పటా పటా బాదాడు. వెంకట్ అరిచేతులను రాసుకుంటూ వద్దు వద్దు సార్ సార్ అంటూ గట్టిగా ఏడుస్తున్నాడు. తరువాత ఆడపిల్లల్ని చూసి మీకన్నా వచ్చా 9వ ఎక్కం అని గర్జించారు. నాకు వచ్చు కానీ, ఆయన్ని చూస్తే చెప్పలేమోనని, తల వంచుకుని గబ గబా చెప్పాను. నన్ను మెచ్చుకుంటారేమో అనుకున్నా. కానీ సీరియస్‌గా చూసి సరే కూర్చో అన్నారు.

ఇంతలో క్లాస్ బెల్లు మోగింది. మగ పిల్లలు అందరూ సార్ బయటికి వెళ్ళగానే ఇంటి నుంచి ముందుగానే తెచ్చుకున్న నిమ్మ చెక్కలను ఎర్రగా కందిపోయిన వాళ్ళ అరచేతికి రుద్దారు. దాంతో అరిచేయి పూరీలా ఎత్తుగా పొంగింది. వెంటనే పరిగెత్తుకుంటూ హెడ్మాస్టర్ దగ్గరకి వెళ్ళి, వాళ్ళ అరిచేతులు చూపించి లెక్కల మాస్టారు మీద ఫిర్యాదు చేశారు. మా హెడ్మాస్టారు "నేను ఆయనను మందలిస్తాను. అయినా మీరు కూడా బాగా చదువుకు రావాలి" అని చెప్పి పంపించారు.

ఆయన మీద కసి తీర్చుకుంటున్నామన్న సంతోషంతో అందరూ క్లాసులోకి వెళ్ళి కూర్చున్నాము. మరునాడు లెక్కల క్లాసు మాస్టారు వచ్చారు. ఈ రోజు ఆయన మొహం చూడాలి ఎలా మాడిపోయి ఉంటుందో ఇక మన జోలికి రాడు అనుకుంటూ అందరూ హుషారుగా ఉన్నాము. కానీ ఆయన గంభీరంగా లెక్కలు సరిగా చేయడం రాదు కానీ, నా మీద ఫిర్యాదు చేస్తారా? అంటూ ఫిర్యాదు చేసిన వాళ్ళందర్నీ క్లాసు బయట ఎండలో చొక్కా విప్పి నిలబెట్టారు. అమ్మాయిలను అందరిని పిలిచి వాళ్ళను చూసి హేళనగా నవ్వమని చెప్పారు. మా అందరికీ వాళ్ళని చూసి కళ్ళవెంబడి నీళ్లు వస్తున్నాయి. కానీ సార్ చెప్పినట్లు చేయకపోతే మళ్ళీ మమ్మల్ని కొడతారేమో అని భయంతో వాళ్ళని చూసి హేళనగా నవ్వి మళ్ళీ క్లాసులో వచ్చి కూర్చున్నాము. క్లాసు అయిపోగానే, వాళ్ళ దగ్గరకి వెళ్లి సారీ ఫ్రెండ్స్, మిమ్మల్ని చూస్తే నిజంగా మా అందరికీ ఏడుపు వచ్చింది కానీ అలా నవ్వకపోతే సార్ మళ్ళీ మమ్మల్ని కొడతారు అన్న భయంతో అలా నవ్వాము. ఏమీ అనుకోవద్దు అని చెప్పాము.

అప్పటి నుంచి లెక్కల మాస్టారుని చూడగానే మాకు అరిచేతులలో చెమటలు పట్టేవి. కాకపోతే మేము ఆడ పిల్లలం కాబట్టి, మమ్మల్ని కొడితే గొడవ అవుతుంది. అని, నెత్తిమీద ఒక మొట్టికాయ వేసి ఏం బొమ్మలూ మబ్బులెక్కువయినాయా? అని కళ్ళలోకి ఉరిమి చూసే వాడు. ఇలా భయపడుతూనే క్లాసుకి వెళ్లి కూర్చునే వాళ్ళం.

ఒకరోజు స్కూల్‌కి రాగానే అందరికి ఒక శుభవార్త చెప్పారు. ఏమిటి అంటే మా లెక్కల మాస్టారు సత్యనారాయణగారు తనకి ఆరోగ్యం బాగా లేదని, అందుకే మూడు నెలలు సెలవు తీసుకుంటున్నాను అని, ఇప్పుడు ఏడాది పరీక్షలు వస్తున్నాయి కాబట్టి

ఇంకొక లెక్కల మాస్టారు వస్తారు అని చెప్పారు. పరీక్షలు బాగా రాసి నాకు పేరు తీసుకురావాలి అని చెప్పారు. మేము అందరం బయటికి మామూలుగానే ఉన్నా లోపల చాలా సంతోషంగా ఉన్నాము. ఎప్పుడెప్పుడు సార్ బయటికి వెళ్తారా సంతోషంతో చప్పట్లు కొట్టుకుందామని అనుకుంటున్నాము. ఇంతలో ఆయనే మళ్లీ మీలాంటి మంచి స్టూడెంట్స్‌ని వదలి వెళ్లడం నాకు కష్టంగానే ఉంది. నాకు మీ మీదేమీ కోపం లేదు. మీరంతా పిల్లలు, ఈ వయసులో అల్లరి చెయ్యకపోతే ఎలా? చెయ్యాలి. కానీ మీరు చదువు మీద కూడా శ్రద్ధ పెట్టాలి. లెక్కలు బాగా చేసి, అల్లరి చేస్తే నేను కూడా బాగా సంతోషించేవాడిని కానీ మీరు చదువు మీద శ్రద్ధ కంటే అల్లరి మీద ఎక్కువ శ్రద్ధ కనబరుస్తున్నారు. అందుకే మిమ్మల్ని కొట్టేవాడిని. మిమ్మల్ని దారిలో పెట్టవలసిన బాధ్యత నా మీద ఉంది. కదా! మీమీద ప్రేమతోనే కానీ, కోపంతో కాదు. మీరంతా నా పిల్లలు. నా పిల్లల్ని దండించి నట్టే, మిమ్మల్ని కూడా దండించాను. మీరు లెక్కలు బాగా చేసి మంచి మార్కులతో పాస్ అవుతారు కదూ! అంటూ కన్నీళ్లు పెట్టుకుంటూ సెలవు తీసుకున్నారు. ఎప్పుడూ గంభీరంగా వుండే సత్యనారాయణ సార్ ఇలా కళ్ళనీళ్ళు పెట్టుకోవడం చూసి మా అందరికి ఆశ్చర్యం వేసింది.

# ఆగష్టు 15 - స్వాతంత్ర్య దినోత్సవం

ఆగస్టు 15 జెండా వందనం పండుగకు వారం రోజుల ముందు నుంచి, మా స్కూల్లో ఒకటే హడావిడి. అందరికీ ఆటపాటల పోటీలు పెట్టారు. గెలిచిన వాళ్ళకి ఆ రోజు ముఖ్య అతిధి చేత బహుమతులు ఇస్తారు. మా క్లాస్‌కి ఆటల మాస్టారు, డ్రిల్ మాస్టారు ఒకరే. రమేష్ మాస్టారు. స్కూల్లో బాగా పరిగెత్తే వాళ్ళని 11 మందిని తీసుకుని, రన్నింగ్ రేస్‌తో పాటు, కోకో ఆట కూడా బాగా నేర్పించారు. "కోకో" ఆట అంటే మామూలుగా మేమందరం ఇళ్ళ దగ్గర ఆడుకోవడం మాత్రమే మాకు తెలుసు. మా రమేష్ మాస్టారు గారు వచ్చిన తరువాత, దానిలోని మెలకువలు, ఎలా గెలవాలి, సమయ స్ఫూర్తితో ఎలా ఆడాలి అనే విషయాలను చెప్పి. బాగా ప్రాక్టీస్ చేయించారు. అలా పెట్టిన కాంపిటీషన్లో మా బ్యాచ్ "కోకో" ఆటలో గెలిచింది. మీ అందరికీ జెండా వందనం రోజు బహుమనాలు ఇస్తాము అని మా హెడ్ మాస్టారు చెప్పారు. మా అందరికీ ఎంత సంతోషమో! కోకోలో ఇంటర్ స్కూల్ కాంపిటీషన్‌లో ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. మా హెడ్ మాస్టర్ మా బ్యాచ్‌లోని ఆడపిల్లల అందరిని పిలిచి అభినందించారు. మాకు పాటలు, డాన్సులు నేర్పించే క్లాస్ లేకపోయినా, "స్కూల్ డే రోజున, జెండా వందనానికి, పాటలు నేర్పించడానికి ప్రత్యేకంగా కొన్ని రోజులు ఒక శిక్షకుడిని పిలిపించారు. పాటల పోటీల్లో గెలిచిన వాళ్ళు, ఆటల్లో గెలిచిన వాళ్ళు అందరం ఆగస్టు 15 ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురు చూశాము.

మాది ప్రభుత్వ పాఠశాల కదా! అందుకని పెద్ద క్లాసులకి మాత్రమే తరగతి గదులు సిమెంట్‌తో కట్టినవి ఉండేవి. చిన్న క్లాసులు పాకల షెడ్డులో వుండేవి. కాకపోత అవి కూడా శుభ్రంగా ఉండేవి. ఈ పాకల్లో వుండే క్లాసులు కూడా అందంగా ఉండేటట్టు అందరినీ ఉత్సాహ పరచాలని, మా హెడ్ మాస్టారు జగన్ మోహన్ రెడ్డి గారు, మా క్లాసులకి వచ్చి చూసి "ఇదిగో పిల్లలూ మీ అందరూ మీ తరగతి గదులను శుభ్రంగా తీర్చి దిద్దుకోవాలి " ఈ జెండావందనం పండుగకి మీ టీచర్ మీకు చెబుతారు ఎలా పెట్టుకోవాలి అని. ఎవరి తరగతి గది బాగా అందంగా తయారు చేస్తారో, తనిఖీ చేసి వాళ్ళకి, ఫస్ట్, సెకండ్ మరియు మూడవ బహుమతులు ఇస్తాము. సరేనా? అని అందరిని ఉత్సాహపరిచి వెళ్లారు.

సరే ఇక మా క్లాసు టీచర్ ఇచ్చిన సూచనల ప్రకారం, ఆడపిల్లల మందరం క్లాసులో మట్టిని శుభ్రంగా ఊడ్చి, పేడతో అలికి, ముగ్గులు పెట్టాము. వాటి మధ్యలో రంగులు వేసి అలంకరించాము. లోపల చుక్కల ముగ్గులు, క్లాసు బయట జెండా వేసి, సైనికులు సెల్యూట్ చేస్తున్నట్లు ముగ్గు వేసి రంగులు వేసాము. మొగపిల్లలు రంగు రంగుల కాగితాలతో గదిని అలంకరించారు. తగరం కాగితాలతో తోరణాలు లాగా కట్టి, తెల్ల కాగితం మీద చేతితో వేసిన మూడు రంగుల జెండాలను తోరణాలకు, గుండు సూదులతో గుచ్చి అలంకరించారు. రేపు జెండా వందనం అనగా, ముందు రోజు హెడ్ మాస్టారు అన్నీ క్లాసులు తిరిగి ఏవి బావున్నాయి అని తనిఖీ చేశారు.

మా ఏడవ తరగతికి రెండో బహుమతి వచ్చింది. మొదటి బహుమతి 8వ క్లాసుకి వచ్చింది అని ఆయన చెప్పగానే అందరం చాలా సంబరపడ్డాము. ఈ బహుమతి మొత్తం క్లాసుకి వుంటుంది అని చెప్పారు.

ఆగస్టు 15 రేపు అనగా స్నేహితులందరం కలిసి ఆటపాటలతో సంతోషంగా గడిపాము, ఏ గౌను వేసుకుని రావాలి అనుకుని ప్లాన్ చేసుకున్నాము. ఆగస్ట్ 15 సాయంత్రం నాలుగు గంటలకి ప్రోగ్రాం మొదలు అయింది. స్కూల్ మా ఇంటి దగ్గరే కాబట్టి, మైక్‌లో అనౌన్స్‌మెంట్ వినిపిస్తూనే ఉంటాయి. నేను కొత్త గౌను వేసుకుని ప్రైజ్ ఎప్పుడు తీసుకుందామా అని ఉత్సాహంతో బయలుదేరుతుంటే, మా తమ్ముడు 3 ఏళ్లవాడు, ఒక్కటే గొడవ మొదలు పెట్టాడు. తనను ఎత్తుకోమనీ, నాతో కూడా వస్తానని, మా తమ్ముడు అంటే నాకు మహా ప్రాణం. అందుకని కాసేపు వాడిని ఎత్తుకొని బుజ్జగించి ఇప్పుడే వస్తానని పరుగుపరుగున స్కూలుకి వెళ్లాను. కానీ అప్పటికే మా “కోకో” టీం అందరినీ పేరు పేరునా పిలిచి వెండి పతకాలు బహుమతిగా ఇచ్చేశారు. నేను వెళ్ళగానే మా మాస్టారు రమేష్ గారు కోపం చేశారు. ఇంత ఆలస్యంగా రావడం ఏమిటి? నీ పేరు రెండు సార్లు పిలిచారు మీ “కోకో”టీంని, డిఇఓ గారు చాలా మెచ్చుకున్నారు. నువ్వు రాలేదు. ఇప్పుడు ఇంక మళ్లీ ఇవ్వరు. హెడ్మాస్టర్ గారి గదిలోని ప్రైజ్ ఉంచాము. రేపు తీసుకో అని చెప్పారు. నాకు కళ్ళంబడి నీళ్ళు తిరుగుతూ వస్తున్నాయి. మొహం చిన్నబోయింది. జీవితంలో మొదటిసారిగా వచ్చిన బహుమతి స్టేజ్ మీద ముఖ్య అతిథి డిఇవో గారి చేతుల మీదుగా తీసుకోలేదని చాలా బాధ కలిగింది. అయితే ఆ బాధ

మరపించే మరో విషయం వెంటనే జరిగింది. అది ఏమిటంటే క్లాస్ అలంకరణ బాగా చేసినందుకు ఏడవ క్లాస్‌కి, రెండవ బహుమతి వచ్చిందని, ప్రకటించి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ గారి ముఖచిత్ర పటాన్ని ఇచ్చారు. మా రమేష్ సారు, నా దుఃఖాన్ని పోగొట్టాడానికి, నన్ను బహుమతి తీసుకోవడానికి స్టేజ్ మీదకు పంపించారు. అలా నా మనస్తాపానికి కొంత వూరట కలిగించారు మాడ్రిల్ మాస్టారు. అలా నెహ్రూగారి పటాన్ని తీసుకుని, మా తరగతి గదిలో గోడకు మేకు కొట్టి తగిలించుకుని, చాలా సంతోషపడ్డాము. క్లాసులో అందరికీ చాలా గొప్పగా, గర్వంగా వుండేది.

ఆ రోజుల్లో “లెజింస్” అనే ఒక ఆట వుండేది. ఇప్పుడు కోలాటం ఆడే లాంటి ఒక కర్రకి గజ్జెలు, ఒకటి రెండు వేలాడుతూ వుండేవి. వాటిని అడ్డంగా చేతులలో లయబద్ధంగా తిప్పుతూ, పాదాలు కలుపుతూ విన్యాసాలు చేయాలి. ఈ ఆటలో కూడా నేను మంచి నేర్పు సంపాదించాను. మా రమేష్ మాస్టారు, నువ్వు బాగా చేస్తున్నావు. ఇంటర్ స్కూల్ పోటీలకు నిన్ను పంపుతాను అంటూ మెచ్చుకునేవారు. నాకు కొండెక్కినంత సంతోషంగా వుండేది ఆయన మెచ్చు కుంటే. మా రమేష్ మాస్టారు అంటే అందరికీ చాలా ఇష్టంగా వుండేది. ఎప్పుడెప్పుడు ఆయన క్లాస్ వస్తుందా అని ఎదురు చేసే వాళ్ళం అందరం. అందులో ప్రత్యేకించి నాకు ఆయనంటే చాలా ఆరాధనా భావం ఉండేది. ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తెలియదు కానీ, ఇప్పటికీ నాకు ఆనాటి జ్ఞాపకాలన్నీ నిన్న మొన్న జరిగినట్టుగా గుర్తుకు వస్తుంటాయి.

ఇక జెండా వందనం పండుగ జరిగిన మరు నాడు, హెడ్ మాస్టారు గారి గదికి వెళ్ళి నాకు బహు మతిగా వచ్చిన వెండి పతకాన్ని తెచ్చుకుందామని, నేను వెళ్లేసరికి మా హెడ్ మాస్టారు గదిలో కూడా లేరు. స్కూల్లో రౌండ్స్ కొట్టడానికి వెళ్లారు. ఆయన టేబుల్ మీద పెట్టివున్న నా బహుమతిని, స్కూల్ బెల్లు కొట్టే యాదగిరి చూపిస్తే తెచ్చుకున్నాను. కానీ స్టేజ్ మీద అందరి ప్రశంసలతో చప్పట్లతో తీసుకునే ఆనందం పొందలేక పోయాను అన్న బాధ అలానే వుండిపోయింది నా స్మృతిపథంలో.

# ముగ్గుల క్లాసు

మా బడిలో వారంలో ఒక రోజు డ్రాయింగ్ క్లాసు, ఒక రోజు నీతి కథలు, ఒక రోజు డ్రిల్ /ఆటల క్లాసు ఇలా ఉండేది.

మా డ్రాయింగ్ మాస్టారి పేరు హనుమంతరావుగారు, డ్రాయింగ్ బోర్డు మీద బొమ్మ వేసి, తెల్ల కాగితాలతో ఉన్న పొడుగు డ్రాయింగ్ పుస్తకాల్లో మమ్మల్ని వేయమనే వారు. కొంతమంది పిల్లలు బాగా వేసేవారు. కొంత మంది గీస్తే అవి పిల్లుల్లా, కోతుల్లా వుండేవి. నిజానికి అందరికీ బాగా వేయడం రాదు కదా! కానీ, మాస్టారు ఎవరిని కొట్టేవారు కాదు. కోతుల్లా బొమ్మ గీసిన పిల్లల్ని, "ఏమిట్రా మీ బొమ్మలు మీరే వేసుకున్నారు? మీ బొమ్మ మీరే వేసుకుంటే మార్కులు పడవు. నేను బోర్డ్ మీద వేసిన బొమ్మ మాత్రమే వేయాలి. అప్పుడే పడతాయి. బాగా ప్రాక్టీస్ చేయండి వచ్చే వారం కల్లా బాగా వేసుకో రావాలి" అంటూ నవ్వుతూనే వారికి చురక అంటించేవారు.

అమ్మాయిలను చూసి మీరు బొమ్మలల్లే ఉండడం కాదు. నేను వేసిన బొమ్మ సరిగ్గా గీయాలి. అనేవారు. 'అలాగే సార్' అంటూ తలలు వూసేవాళ్ళం. మళ్లీ వచ్చే వారం కదా క్లాస్ అప్పుడు చూసుకుందాంలే అనుకుంటూ డ్రాయింగ్ పరీక్షలో కూడా 100 మార్కు లకు 35 మార్కులు వస్తేనే పాస్ అయినట్టు. కాకపోతే పై 'క్లాస్'కి ప్రమోట్ అవడానికి మెయిన్ సబ్జెక్ట్స్ 'పాస్' అయితే సరిపోతుంది. డ్రాయింగ్ మార్కులు లెక్కలోకి రావు, 35 మార్కుల కన్నా తక్కువ వచ్చినా పర్వాలేదు. అందుకని అంత బాగా ప్రయత్నం చేసే వాళ్ళం కాదు. కానీ కొంతమంది. విద్యార్థులు పుట్టుక తోనే వచ్చిన విద్యలాగా, చాలా నేర్పుగా గీసేవారు. వాళ్లకి నూటికి 80 మార్కులు వచ్చేవి. వాళ్ళని డ్రాయింగ్ మాస్టారు తన దగ్గరకు పిలిచి వాళ్ళ పేరు, మార్కులు చదివి, మా అందరి చేత చప్పట్లు కొట్టించేవారు. మీరు చాలా బాగా వేస్తున్నారు స్పెషల్ ట్రైనింగ్ ఇస్తే, ఇతర స్కూళ్ళ పిల్లలతో పోటీ పడగలుగుతారు. మన స్కూల్కి మంచి పేరు వస్తుంది. సాయంత్రం మా ఇంటికి రండి డ్రాయింగ్‌లో మెళుకువలు నేర్పిస్తాను. నాకేమి ఫీజ్ వద్దు. డ్రాయింగ్ మీద నా కున్నప్రేమతో, ఆసక్తితో చెబుతున్నాను అని పిల్లల్ని ప్రోత్సహించేవారు.

అందుకే డ్రాయింగ్ క్లాస్ అంటే మా అందరికీ చాలా ఉత్సాహంగా ఉండేది. అయితే ఇంకొక నెల రోజుల్లో ఏడాది పరీక్షలు వున్నాయనగా, మా డ్రాయింగ్ మాస్టారు

హనుమంతరావు గారికి పెళ్లి కుదిరిందని సెలవు పెట్టారు. మాస్టారు రాకపోతే పిల్లలంతా అల్లరి చేస్తూ బయట ఆడుకుంటారు అని, మా హెడ్ మాస్టారు. చిన్న క్లాసులకి పాఠాలు చెప్పే సుశీలబాయి టీచర్ ని డ్రాయింగ్ క్లాస్ కూడా చూసుకోమని చెప్పారు. ఎందు కంటే ఇది వారానికి ఒక్క క్లాస్ మాత్రమే కాబట్టి,

సుశీలా టీచర్ క్లాస్‌కి వస్తూనే "నాకు డ్రాయింగ్ రాదు. క్లాసులో అల్లరిచేస్తూ మీరు బయట తిరగకుండా చూడడానికి నన్ను పంపించారు. కానీ, మనం క్లాసులో వుట్టిగా కూర్చుని ఏం చేస్తాం? అందుకని నేను మీకు ముగ్గులు నేర్పిస్తాను. అది కూడా డ్రాయింగే కదా! ఎంతో ఆర్ట్ వుంది ముగ్గుల్లో కూడా, సరేనా?" అన్నారు.

ఆడపిల్లలు అందరూ ఉత్సాహంగా సరే అన్నారు. ముగ్గులు ఆడవాళ్ళు వేస్తారు. కానీ మగ మహా రాజులం మేము నేర్చుకోవడమేమిటి? అన్నట్టు మొగ పిల్లలు మాత్రం ఒకరి మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు. సుశీల టీచర్. వాళ్ళ హావభావాలు గమనించి, ఇష్టంలేని వారు వెనక బెంచీలోకి వెళ్ళి కూర్చుని ఇంతకుముందు డ్రాయింగ్ మాస్టారు నేర్పించిన డ్రాయింగ్ ఇంకొంచెం బాగా వేయడానికి ప్రయత్నించండి. అల్లరి మాత్రం చేయకూడదు అని చెప్పారు.

అలా సుశీలబాయి టీచర్ మాకు మంచి మంచి చుక్కల ముగ్గులు, గీతల ముగ్గులు సంక్రాంతి ముగ్గులు, రథం ముగ్గులు, శివుడి కళ్ళు, అష్టదళ పద్మం, పూల బుట్ట" మొదలైన ముగ్గులు ఆ నెల రోజుల్లో నేర్పించారు. అలా నేను నేర్చుకున్న ముగ్గులతో మా ఇంట్లో ముగ్గుల స్పెషలిస్ట్ అయ్యాను. అప్పట్లో పండగలకి ఇంటి సామానంతా బయట పెట్టి ఇల్లంతా కడిగే వాళ్ళు. అప్పుడు ఇళ్ళల్లో నాపరాతి బండలు ఉండేవి. ఇల్లంతా శుభ్రంగా ఆరిపోయిన తరువాత ఒక్కొక్క గదిలో ఒక్కొక్క రకమైన ముగ్గు, ముందర శుద్ధ ముక్కతో గీసుకుని, తరువాత తెల్ల పెయింట్ దానిమీద దిద్ది, మధ్య పద్మంలో ఎరుపు రంగు, పసుపు రంగు వేసి అందంగా తీర్చిదిద్దే దాన్ని మా చెల్లెలి సహాయం తీసుకుని అలాగే సంక్రాంతి ముగ్గుల పోటీలకు వెళ్లి బహుమతి గెలుచుకున్నాను కూడా. ఇలా ఆనాడు నేర్చుకున్న ముగ్గులు నాకిప్పటికీ గుర్తు వున్నాయి. చిన్నప్పటి విషయాలు మన మనసుకి హత్తుకుపోయి కలకాలం గుర్తుండిపోతాయి అనడానికి ఇది ఒక నిదర్శనం. ఇప్పటికీ ఇంటి ముందు ముగ్గు వేస్తుంటే సుశీలాబాయి టీచర్ గుర్తుకు వస్తారు.

## But బట్ అయితే Put పుట్ ఎలా Pat అనాలి కదా

ఇప్పుడంటే పిల్లలకి ఎల్‌కేజీ నుంచే ఇంగ్లీషు నేర్పిస్తున్నారు. కానీ, మాకు ఆ రోజుల్లో త్రిభాషా సూత్రం అమలులో ఉండేది.

అందుకే మొదట మాతృభాష తెలుగు ఒకటో తరగతి నుంచి.

రెండవ భాష హిందీ–5వ తరగతి నుంచి.

మూడవ భాష ఇంగ్లీషు–6వ తరగతి నుంచీ మొదలు పెట్టారు.

అలా అంచలంచెలుగా భాషలు నేర్పడం వలన, మూడు భాషల్లో మంచి పట్టు వుండేది.

మా గవర్నమెంట్ ఇస్కూల్‌లో 6వ క్లాసు నుంచీ ఇంగ్లీషు నేర్పించినా మేము ఇంగ్లీషు మీడియంలో చదవకపోయినా, మేము రాసే ఇంగ్లీషు కానీ, మాట్లాడే ఇంగ్లీషు కానీ, ఇప్పుడు ఇంగ్లీషు మీడియంలో చదువు కున్న వారి కంటే చాలా గొప్పగా వుంది.

ఇప్పుడు అమెరికన్ ఇంగ్లీషువచ్చి, మేము కష్టపడి నేర్చుకున్న ఇంగ్లీషు స్పెల్లింగులు, అవసరం లేకుండా, పుచ్చారణతో వచ్చే స్పెల్లింగులు వస్తున్నాయి. ఒక రకంగా ఇది కరెక్ట్ పద్ధతి కూడా అప్పట్లో ప్రోగ్రాం స్పెల్లింగ్ "Programme" అని నేర్చుకున్నాము.

ఇప్పుడు అమెరికన్ ఇంగ్లీషులో "Program" అని పుచ్చారణ బట్టి రాస్తున్నాము. అలాగే సైకాలజీ స్పెల్లింగ్ "Psychology" ఇందులో "P" అక్షరం సైలెంట్ అక్షరం. ఇది నిజానికి మనుషుల్ని తికమక పెట్టడానికి తప్పితే ఏమిటి?

పుచ్చారణకు స్పెల్లింగ్ కి వూహించలేనంత మార్పుగా వుంటుంది. అందుకే జ్ఞానపీఠ పురస్కార గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ గారు తాను రాసిన "విష్ణు శర్మ ఇంగ్లీషు చదువు" నవలలో ఇంగ్లీషు భాషను పలికే విధానాన్ని హాస్యంగా విష్ణుశర్మ పాత్ర చేత అనిపిస్తారు. ఇంగ్లీషు నేర్చుకోవడానికి స్వర్గం నుంచి విశ్వనాథ వారి దగ్గరకు వచ్చిన విష్ణుశర్మ, మొదట క్యాపిటల్ అక్షరాలు నేర్చుకుని, ఇంక పదాలు నేర్పించండి అని అడుగుతారు. దానికి విశ్వనాథ వారు అప్పుడేనా ఇంకా మూడు బడులు ఉన్నాయి నేర్చుకోవడానికి అంటారు.

క్యాపిటల్ అక్షరాలు, చిన్న అక్షరాలు, కలిపి రాసే అక్షరాలు ఇలాగ ఇంకా నేర్చుకోవాలి అని చెబుతారు.

అంటే ఒకే అక్షరాలకి నాలుగు బడులు ఎందుకు? ఉచ్ఛారణలో తేడా లేనప్పుడు అని మౌలికమైన ప్రశ్న వేస్తారు.

అలాగే పదాలు నేర్చుకుంటూ

"బియుటి" బట్ అని అన్నారు కదా మరి

"పియుటి" పుట్ ఎలా అవుతుంది పట్ అని

చదవాలి కదా అంటూ అమాయకంగా అడుగుతాడు. ఇది నిజంగానే నిజం కదా!

సరే! ఇంతకీ ఈ అవస్థలన్నీ మన తెలుగు భాషకు లేవు హాయిగా 56 అక్షరాలతో, గుణింతాలతో కావలసినన్ని పదాలు, వాటి ఉచ్చారణ ఒకటే విధంగా ఉంటాయి.

మన దేశంలోని ఇతర భాషల్లో కూడా కొన్ని అక్షరాలు లేవు. బెంగాల్ వాళ్ళకి "వ" పలకదు.

"వ" ని "బా" అంటారు. మా నాన్నగారి ఆఫీసర్ బెంగాలీ అతను. వెంకటరావు అని పిలిచే బదులు బెంకట్‌రావు అని పిలిచేవాడు. మాకు భలే నవ్వు వచ్చేది.

సరే మన ఇస్కూల్ యాదిలో కొస్తే మాకు 6న క్లాసులో ఎబిసిడిలు నేర్పించడం మొదలుపెట్టారు. మా ఇంగ్లీషు మాస్టారి పేరు కాంతారావుగారు. ఆయన కొంచెం "హైలీక్వాలిఫైడ్, పెద్ద ఉద్యోగం దొరికే వరకు ఇక్కడ ఇంగ్లీషు టీచర్‌గా చేరారు. కానీ పిల్లల కంటే ఎక్కువ డుమ్మాలు కొట్టేవారు. వారానికి రెండు క్లాసులకి వస్తే గొప్ప. పైగా మంత్రిగారికి చుట్టం, దానితో మా హెడ్ మాస్టారు కూడా ఆయనని ఏమీ అనలేకపోయేవారు.

కాంతారావు మాస్టారు మాకు ఇంగ్లీషు అక్షరాలు.. క్యాపిటల్ అక్షరాలు చిన్న అక్షరాలు, కలిపి రాత అక్షరాలు నేర్పించే సరికి ఆరు నెలల పరీక్షలు దగ్గరికి వచ్చేసాయి. పెద్ద ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేసుకుంటూ కొన్ని రోజులు మా క్లాస్‌కి రాలేదు.

నెల తరువాత క్లాస్‌కి వచ్చి, మనం ఎక్కడ దాకా నేర్చుకున్నాము? ఏదీ "ఎలిఫెంట్" స్పెల్లింగ్ చెప్పండి అంటూ అడిగారు. మేమందరం తెల్ల మొహాలు వేసాము. అదేమిటి నేను కొన్ని రోజులు క్లాసుకి రాకపోతే. అన్నీ మర్చిపోతారా? చెప్పండి ఎలిఫెంట్ స్పెల్లింగ్ లేదంటే బెంచ్ ఎక్కండి అంటూ అందరినీ బెంచి ఎక్కించాడు. ఒక్కరినే బెంచి ఎక్కిస్తే కొంచెం అవమానంగా భావించే వాళ్ళం కానీ అందరినీ బెంచిం ఎక్కమన్నారు కదా! దానితో ఏమీ మాట్లాడకుండా అందరం బెంచి ఎక్కి నుంచున్నాము.

ఇంతలో మా హెడ్మాస్టర్ గారు రౌండ్స్‌కి వచ్చారు. అందరం బెంచీలు ఎక్కి నుంచున్నాము కదా! మా కాంతారావు మాస్టారును అడిగారు. ఎందుకు అందరినీ బెంచి ఎక్కించారు అని. దానికి ఆయన నేను కొన్ని రోజులు రాకపోయేసరికి వాళ్ళ ఇష్టం వచ్చినట్లు అల్లరి చేస్తూ సరిగ్గా ఇంగ్లీషు స్పెల్లింగులు చెప్పలేదు. ఎలిఫెంట్ అని అన్న చిన్న పదానికి స్పెల్లింగ్ చెప్పలేదు అందుకే పైన నుంచో పెట్టాను అని మా మీద కంప్లైంట్ ఇచ్చారు.

మా హెడ్మాస్టర్ మా వంక తిరిగి ఎందుకు నేర్చుకుని రాలేదు అని అడిగారు.

మేమందరం ముక్తకంఠంతో అసలు మాకు ఏబిసిడీలు తప్పితే ఇంకేమీ నేర్పించలేదండి అని చెప్పాము.

మాకు కనీసం క్యాట్, రాట్ స్పెల్లింగులు కూడా. నేర్పించలేదు. ఇంకా ఎలిఫెంట్ గురించి అడిగేసరికి. మాకు ఏమి తెలుస్తుంది అని చెప్పాము. ఆయన ఆశ్చర్యపోయి సరే మీ అందరూ బెంచి దిగి కూర్చోండి. ఏడాది పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి. కాంతారావు గారు మీకు అన్నీ నేర్పిస్తారు. బాగా చదివి పరీక్షలు రాయండి. అని చెప్పి కాంతరావు గారి వంక ఒకసారి కొంచెం మందలిస్తున్నట్టుగా చూసి వెళ్ళిపోయారు. ఏడాది పరీక్షలకి సి.ఎ.టి. క్యాట్, ఆర్.ఏ.టి. రాట్. డీ.ఓ.జి అనే పదాలు మాత్రమే నేర్పించారు. అవి రాసి, ఆయనే పరీక్ష పేపరు దిద్దుతారు కాబట్టి, "ర్యాట్ క్యాట్" రాసి కాబట్టి ఆరోక్లాసు పాస్ అయ్యాము.

కానీ 7వ తరగతికి వచ్చేసరికి, ఇంగ్లీషులో పాఠాలు మొదలు పెట్టారు... ఇక మా పాట్లు ఆ భగవంతుడికే ఎరుక.

# మాడపాటి హనుమంతరావు గర్ల్స్ హైస్కూల్

“ఒరేయ్ వెంకట్రావ్” ఆడపిల్లలు పెద్దవాళ్ళు. అయ్యారు. వాళ్లని గరల్స్ స్కూల్లో చేర్పించరా అంటూ ‘మా నాన్న చెవిలో ఒకటే పోరు మా అవ్వ, “అలాగే చూద్దాంలే అమ్మా” అన్నాడు నాన్న. చూద్దాంలే అంటే కాదు రేపు ఏది జరిగినా మనల్ని అంటారు అనేది. ఏం జరిగినా అంటే నాకు అర్థం కాకపోయినా, పెద్ద స్కూల్లో వేయమంటుంది కదా! అక్కడ చక్కగా స్కూల్ యూని ఫామ్, బూట్లు, పుస్తకాల బ్యాగులు, పెద్ద తరగతి గదులు, పెద్ద ఆటస్థలం, సైన్స్ ల్యాబులు, అన్నీ ఉంటాయని సంబరపడ్డాం నేను మా చెల్లి విజయశ్రీ. కానీ నాన్న అక్కడ ఫీజులు కట్టడం కష్టం అమ్మా! ఇప్పటికే వచ్చే జీతంతో ఎలాగో అలా నెట్టుకొస్తున్నాను అన్నారు. నాకు, మా చెల్లికి చాలా నిరాశ అనిపించింది.

మా అవ్వ, మా తాత దగ్గరికి పోయి ఇదిగో కొడుకు ఒక్కడే సంసారం అంతా లాక్కొస్తున్నాడు. కొంచెం ఆ పెద్ద స్కూల్‌కి పోయి ఆ హెడ్మాస్టర్ చెప్పి, ఫీజు లేకుండా పిల్లల్ని చేర్పించు పెద్ద ఉద్యోగం వెలగబెట్టావు కదా తెలుగు పండితుడిగా అంటూ ఆయనకి హుకుం జారీ చేసింది. మేము కూడా తాత దగ్గరకు పోయి తాతా నువ్వు తెలుగు పండితుడివిగా తెలుగు హెడ్మాస్టారుగా చాలా స్కూళ్ళల్లో చేసినవు కదా! మమ్మల్ని మాడపాటి గర్ల్స్ హైస్కూల్లో చేర్పించవా అని అడిగాము.

చూస్తానర్రా నేను రిటైర్ అయినా కదా! మన మాటకి ఇజ్జత్ ఇస్తారో లేదో తెలీదు అన్నాడు. రోజూ ఆయన ఎనక పడే వాళ్ళం నేను మా చెల్లి. మా పోరు పడలేక ఒకరోజు ఆడ్మిషన్స్ టైంకి మా ఇద్దరినీ తీసుకెళ్లారు. మాడపాటి హనుమంతరావు స్కూల్ ఎంత పెద్ద బిల్డింగో అని ఆశ్చర్యంతో సంతోషంగా చూశాను.

భయంతో తాత చేయి పట్టుకున్నాము. అక్కడు ప్రిన్సిపల్ కస్తూరిబాయి గారి ఆఫీసు దగ్గరకి వెళ్లి, తాత అక్కడ బంట్రోతుతో మహాకాళి వెంకటేశ్వరరావు వచ్చారని ప్రిన్సిపల్‌కి చెప్పమన్నారు. బంట్రోతు వెళ్లి చెప్పగానే కస్తూరిబాయ్ గారు బయటకు వచ్చి అయ్యో! మీరు అలా కబురు పెట్టడమేమిటి? రండి అంటూ లోపలికి తీసుకెళ్లి కుర్చీలో కూర్చోబెట్టారు. నన్నూ, మా చెల్లిని బయట నించోమన్నారు.

మా తాత రిటైర్ అయిన తరువాత ఎం.ఏ. చేసి తరువాత తెలుగు పండిట్ కోర్సు చేశారు. దాదాపు చాలా స్కూళ్లలో హెడ్మాస్టర్‌గా, తెలుగు పండిట్ ట్రైనింగ్ కాలేజీకి ప్రిన్సిపల్‌గా చేశారు. తర్వాత బ్యాట్మెంటన్ చాలా బాగా ఆడేవారు. మా ఇంటి నిండా ఆయనకి వచ్చిన బంగారు, వెండి పతకాలు ఉండేవి. మాకు మా తాతని చూస్తే చాలా గర్వంగా ఉండేది.

అయితే ఆయన రిటైర్ అయిన తర్వాత ఆ గౌరవం ఉంటుందో లేదో అని ఆయనకి కొంత భయం. తెలుగుతో పాటు సంస్కృతంలో కూడా మంచి ప్రావీణ్యం ఉన్నది తాతకి. అందుకే ఆయనకు ఉభయ భాషాప్రవీణ అని బిరుదు ఇచ్చారు. అందుకే కస్తూరిబాయ్ గారు తాతకి అంత గౌరవం ఇచ్చారు. కాసేపు వాళ్లు మాట్లాడుకున్న తరువాత, మమ్మల్ని పిలిచి ఆవిడకి పరిచయం చేశారు. వీళ్ళకి ఎనిమిదో క్లాసు, ఆరోక్లాసులో అడ్మిషన్ కావాలి అని చెప్పారు. ఆవిడ “అయ్యో మాస్టారూ సీట్లన్నీ అయిపోయాయి. మీకు తెలుసుగా మా స్కూల్‌కి ఉన్న పేరు ప్రతిష్ఠలు అన్నారు. ఆవిడ సీట్లు లేవండి అనేసరికి నేను, అమాయకంగా సీటు లేకపోతే కింద కూర్చుని చదువుకుంటానండి” అన్నాను. దానికి ఆవిడ చిన్నగా నవ్వింది. మా తాత ఏమీ అనలేక “ఆడపిల్లలు మీ శిక్షణలో ఉంటే బాగుంటుందనీ, మా అబ్బాయి పెద్దగా ఫీజులు అవీ కూడా కట్టలేడు. సరే వీలుగా ఉంటే చూడండి” అంటూ నిట్టూరుస్తూ లేచారు. మేమిద్దరం బిక్కమొహాలు వేసుకొని ఆవిడ వంక చూశాము. చిన్న బోయిన మా మొహాలు చూసి, తనపై ఎక్కువ ఒత్తిడి చేయకుండా వెళ్ళిపోతున్న మా తాతను చూసి కస్తూరిబాయ్ గారు” మిమ్మల్ని నిరుత్సాహపరచడం బాధగా ఉంది. ఒక్క నిమిషం కూర్చోండి అంటూ రిజిస్టర్ తెప్పించారు. కొంచెం సేపు రిజిస్టర్ చూసి సరేనండీ ఎలాగో అలాగా సర్దుబాటు చేస్తాను. కాకపోతే ఇప్పుడు కొత్తగా బిల్డింగ్ కడుతున్నాం. అందుకని అందర దగ్గర బిల్డింగ్ ఫండ్ వంద రూపాయలు కలెక్ట్ చేస్తున్నాము. మీరు కనీసం ఒక్కొక్కరికి 50 రూపాయలు కట్టగలరా? అని అడిగారు. తాత కొంచెం ఇబ్బందిగా అటు ఇటు కదిలి సరే తప్పకుండా ప్రయత్నం చేస్తాను. చాలా సంతోషమండి అంటూ బయటికి వచ్చారు.

ఇంటికి రాగానే నాన్నను పట్టుకుని ప్లీజ్ ఈ ఒక్కసారికి 50 రూపాయలు కట్టండి నాన్న అంటూ వెనకాల పడ్డాం. మా అమ్మ, అవ్వకూడా గట్టిగా చెప్పడంతో సరే ఎలాగో

అలాగా కడతాను ఏడాదికి ఒక్కసారి అన్నారుగా అన్నారు. అలా మాడపాటి హనుమంతరావు గర్ల్స్ హైస్కూల్లో చేరడం జరిగింది. వేసవి సెలవుల తర్వాత స్కూల్ తెరవగానే నేను మా చెల్లెలు ఇద్దరు చక్కగా గులాబీ రంగు స్కర్ట్, దానిమీద తెల్ల జాకెట్ వేసుకుని, దానిమీద బెల్టు పెట్టుకుని, రెండు జడలకి నల్ల రిబ్బన్ కట్టి, సగం పైకి మడిచి కట్టుకొని, తెల్ల బూట్లు, సాక్స్, బ్యాగు వేసుకుని స్కూలుకి వెళ్తే ఎంత సంబరమో!

కొత్త స్కూల్ అని మోజు పడ్డాను కానీ అక్కడికి వెళ్లేసరికి పెద్ద ప్రేయర్ హాల్, అక్కడ పెద్ద స్టేజి, దానిమీద కొంతమంది పెద్ద క్లాస్ పిల్లలు ఎక్కి వందేమాతరం, తరువాత జనగణమన ప్రేయర్ పాడారు. తరువాత డ్రమ్స్ బీటింగ్తో కాసేపు మాతో మార్చి చేయించారు. అది ఎలా చేయాలో మాకు తెలియక మామూలుగా నుంచున్నాం. అయితే ఒక్కొక్క లైన్కి, ఒక్కొక్క లీడర్ని పెట్టారు. మేము సరిగ్గా మార్చి చేస్తున్నామా లేదా అని చూడడానికి. అప్పుడు ఆ లీడర్ వచ్చి ఒకసారి కుడికాలు ఒకసారి ఎడమకాలు కింద కొడుతూ, మార్చి చేయాలి అని చూపించింది. సరే అని చెప్పాను. కానీ ఆ స్కూలు, ఆ కొత్త వాతావరణం, ఈ డ్రమ్స్ బీటింగు ఇది చూసేసరికి నాకు గుండెల్లో ఎవరో ధన్ ధన్ అని కొడుతున్నట్టుగా భయం వేసింది. తర్వాత అలా మార్చి చేసుకుంటునే ఎవరి క్లాసుల్లోకి వాళ్ళు వెళ్లి కూర్చున్నారు. క్లాసులోకి వెళ్లి కూర్చోగానే మొదటి పీరియడ్ సోషల్ స్టడీస్ టీచర్ వచ్చి ఇంగ్లీషులో పాఠం చెప్పింది. పిల్లలందరూ కూడా ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నారు.

నాకు ఒక్క ముక్క అర్థం అయితే ఒట్టు. అతా అయోమయంగా వుంది. పక్కన ఎవరితోనన్నా మాట్లాడదాము అంటే భయం, సిగ్గు. టీచర్ని, అలా గుడ్లు అప్పగించి చూస్తున్నాను అప్పటిదాకా నాకు తెలియదు మా నాన్న నన్ను ఇంగ్లీష్ మీడియంలో చేర్పించారు అని. పాత స్కూల్లో క్యాట్, ర్యాట్ మాత్రమే నేర్చుకున్న నాకు, ఇలా ఏకంగా ఇంగ్లీష్ మాట్లాడే స్కూల్లో చేర్పించడంతో, ఇంటికి రాగానే అమ్మని పట్టుకుని భోరుమని ఏడ్చాను. అలా మొదటి రోజు స్కూల్ అనుభవం ఇంగ్లీషు కష్టాలతో మొదలయ్యింది.

# 5 గిన్నెల క్యారేజ్

నేనూ, నా చెల్లెలు విజయశ్రీ, మా బాబాయి కూతురు లత మాడపాటి పాఠశాలలో చేరిన తరువాత, మా ఇంట్లో విడివిడిగా అందరికీ చిన్న టిఫిన్ డబ్బాలు లేవు. అప్పటికే మా పెద్దక్క జయశ్రీ, చిన్నక్క సులోచన అక్కడే చదువుతున్నారు. కాబట్టి, మా 5 గురికీ కలిపి ఒక 5 గిన్నెల క్యారేజీలో ఒక్కొక్క డబ్బాలో, విడిగా అన్నం కలిపి పెట్టేది మా అమ్మ. ఆ క్యారేజీ స్కూలు దాకా నడుచుకుంటూ, మోసుకెళ్ళాలంటే చాలా బరువుగా వుండేది. అందుకని మా పెద్దక్క జయశ్రీ కొంత దూరం ఒకళ్ళు, కొంత దూరం ఒకళ్ళు అంటూ అందరికీ వంతులు వేసేది. స్కూల్‌కి వెళ్లిన తరువాత, ఆ క్యారేజీని మా పెద్దక్క క్లాసులో ఒక మూలపెట్టి, మా క్లాసులకి వెళ్లేవాళ్లం. లంచ్ బెల్లు కొట్టగానే, మా అక్క ఆ క్యారేజీ తీసుకుని చెట్టు కిందకి తీసుకువచ్చేది. అక్కచెల్లెళ్లలందరం అక్కడికి చేరేవాళ్లం. అందరూ చెట్ల కింద వాళ్ల స్నేహితులతో కలిసి తింటుంటే, మేము అయిదుగురు ఒక జట్టుగా కూర్చుని తినేవాళ్లం. ఇలా కొన్ని రోజులు అయిన తరువాత, మా అందరికీ కూడా, స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూ తినాలనిపించేది. పైగా ఈ పెద్ద క్యారేజీ మోసుకురావటం, నామోషీగా వుండేది.

అందుకని ఇంటికెళ్లి మా అమ్మతో, మాకు కూడా విడివిడిగా టిఫిన్ డబ్బాలు ఇవ్వమని అడిగాము. అందుకు మా అమ్మ, మనింట్లో అలా విడిగా టిఫిన్ డబ్బాలు లేవు కదా! రెండు గిన్నెల క్యారేజీ, మీ నాన్నకి, 5 గిన్నెల క్యారేజీ మీకు ఇస్తున్నాను. ఒక చిన్న డబ్బా వుంది కానీ, ఒక్కళ్లకే వస్తుంది. మరి మిగతా నలుగురికీ ఎలా? కొంచం సర్దుకుపోండి. ఇప్పటికిప్పుడు విడిగా టిఫిన్ డబ్బాలు కావాలంటే ఎలా! అంది.

రెండు రోజులు సర్దుకుపోయాం. మూడో రోజు మళ్లీ అమ్మ దగ్గర మా స్నేహితులందరూ, చక్కగా విడివిడిగా చెట్ల కింద కబుర్లు చెప్పుకుంటూ పంచుకుని తింటుంటే, మేము 5 గురం మాత్రమే కలిసి తింటుంటే, అందరూ నవ్వుతున్నారు. మాకు చిన్న డబ్బాలు కొనమంటూ మొర పెట్టుకున్నాము. అప్పట్లో అందరికీ తలా ఒక టిఫిన్ డబ్బా వుండటం కూడా లగ్జరీ కింద వుండేది.

అప్పుడు అమ్మ సరే చూస్తాను అదేదో ఒక చైన్ స్కీమ్ వుంది. ఒకసారి 3

రూపాయలు కట్టి అందులో చేరాలి. తరువాత ఇంకొక ఇద్దరిని చేరుస్తే, మనకి ప్రమోషన్ వచ్చి ఒక స్టీల్ టిఫిన్ డబ్బా కానీ, గిన్నె కానీ ఏదో ఒకటి ఇస్తారు. వాళ్లు ఇంకెవరినైనా చేరిస్తే వాళ్లకి వస్తుంది. ఇలా మన తరువాత ఎంతమంది చేరితే, మనకి ప్రమోషన్ వస్తూ, 3 నెలలకి ఒక డబ్బా వస్తుంది. ఈసారి మీ నాన్నని అడిగి 3 రూపాయలు కట్టి స్కీములో చేరుతా, కొంతమందేమో, ఇది మోసం, మన తరువాత ఎవరూ చేరకపోతే, మన డబ్బులు తిరిగి రావు అంటున్నారు. దైవాధీనం మరి మీరేమో ఒకటే గోల చేస్తున్నారు అంటూ అమ్మ ఈ పథకం ఆలోచించింది.

ఆ మాట వినగానే మా అందరికీ చాలా సంతోషం వేసింది. నాన్న ఆఫీసు నుంచి రాగానే అమ్మకి సైగ చేశాము. నాన్నని అడగమని. కాఫీ తాగి కాస్త స్థిమిత పడగానే, నాన్నని గదిలోకి తీసుకెళ్లి నెమ్మదిగా నచ్చ చెప్పింది.

గది బయట అందరం పిల్లుల్లా నక్కి వింటున్నాము ఏమి అంటారో అని. “వచ్చే జీతం బటాబటీగా సరిపోతోంది. మళ్లీ నెలలో పండగకి మా చెల్లెళ్లిద్దరూ వస్తారు పిల్లల్ని తీసుకుని వెళ్లేటప్పుడు వాళ్లకి చీరా, సారె పెట్టాలి కదా! పిల్లల కోరిక కూడా చిన్నదే! కాదనలేము. సరేలే! నేను ఒక స్టాపు నడిచి, అక్కడ నుంచి బస్సు ఎక్కితే, బస్‌ఛార్జీ కొంత తగ్గుతుంది. ఎలాగో అలా సర్దుబాటు చేస్తా. పిల్లలతో ఈ విషయం చెప్పకు బాధ పడతారు” అంటూ అమ్మతో చెప్పడం మేము విన్నాము. చాలా బాధ వేసింది. సరేలే నాన్న కష్టపడటం ఎందుకు. మనమే పెద్ద క్యారేజీ మోసుకెల్దాము అనుకుని, శబ్దం చేయకుండా వెనక్కి వచ్చేశాము.

రాత్రి పడుకునేటప్పుడు అమ్మ మాతో చెప్పింది. “మీ నాన్న సర్దుబాబు చేస్తానన్నారు” ఇక పడుకోండి. మన అదృష్టం బాగుంటే, 4, 5 నెలల్లో మీకు 2 టిఫిన్ డబ్బాలు వస్తాయి అని చెప్పింది.

మాకు బాధగానే వున్నా, గది పక్కనే వుండి అన్నీ విన్నాము అని చెబితే, కోప్పడుతుందని, సంతోషం నటిస్తూ పడుకున్నాము. పిచ్చి పిల్లల్లారా! ఇదేమంత గొప్ప విషయం కాదు కానీ. మనది ఉమ్మడి సంసారం. చుట్టాలు వచ్చేపోయే ఇల్లు. మీ నాయనమ్మకి ఆరోగ్యం బావుండటం లేదు. అందుకే కొంచం డబ్బుకి ఇబ్బందిగా వుంది అంటూ సర్ది చెప్పింది.

అలా ఆ చైన్ స్కీమ్‌లో చేరి, దానిలో మా చుట్టాలిద్దరిని చేర్పించింది. అలా ఆ స్కీమ్ ద్వారా రెండు నెలలకి ఒకసారి ఒక స్టీలు టిఫిన్ డబ్బాయి వచ్చాయి. మొత్తానికి ఏడాది తిరిగేసరికి మా అందరికీ, విడివిడిగా స్టీలు టిఫిన్ డబ్బాలు ఏర్పాటు అయ్యాయి.

అలా ఆ పెద్ద టిఫిన్ క్యారేజ్ మోసే బాధ తప్పింది. కొత్త టిఫిన్ డబ్బాలతో కొత్త క్లాసులో, కొత్త స్నేహితులతో లంచ్ బెల్ కొట్టగానే, చెట్ల కింద చేరి, ఒకళ్లది ఒకళ్లు పంచుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ తినడంలో ఉన్న ఆనందం పెరుగన్నంలో ఆవకాయ బద్ద నంచుకుతిన్నంత పరవశం.

ఇప్పటి పిల్లలకి హాట్ ప్యాక్‌లు, చల్లనీళ్ల బాటిళ్లూ, స్కూల్‌కి వెళ్లడానికి కార్లూ, ఆటోలు ఇలా ఎన్నో సదుపాయాలు వున్నా, ఆనాటి ఉమ్మడి కుటుంబాలతో, చిన్న చిన్న అవసరాలకి కూడా, డబ్బు సమకూరక, సర్దుబాటు చేసుకుంటూ చిన్ని చిన్ని ఆనందాలు పొందుతూ, స్కూల్‌కి నడుచుకుంటూ వెళుతూ, దారిలో రేగుపళ్లు, పప్పుండలు కొనుక్కుని కాగి ఎంగిలి చేసుకుని, పంచుకుని తింటూ గడిపిన బాల్యంలోని మధురస్మృతుల ముందు దిగదుడుపే.



**అక్కా, చెల్లెళ్ళతో రచయిత్రి చిన్ననాటి ఫోటో**

# తెలుగు క్లాసు

క్లాసులో అందరూ ఇంగ్లీష్ మాట్లాడుతుంటే అయోమయంగా ఉండే నాకు తెలుగు క్లాసు వస్తే మాత్రం చాలా హాయిగా సంతోషంగా ఉండేది. గౌరీ నాగేశ్వరి టీచర్ తెలుగు పాఠాలు చక్కగా చెప్పేవారు. పాఠాలలో ఉండే సుమతీ శతకం, వేమన శతకంలో పద్యాలు గజేంద్రమోక్షంలో పద్యాలు ఇలా వాటికి అర్థాలు చెప్పి మర్నాడు వాటిని కంఠోపాఠం చేసి చెప్పమనేవారు.

భాగవతంలో పద్యాలు మా అందరికీ ఇప్పటికీ గుర్తు వున్నాయి అంటే అది ఆవిడ చలవే. చిన్ని కృష్ణుడు మన్ను తింటున్నాడని గోప బాలురు, బలరాముడు యశోదకి ఫిర్యాదు చేస్తారు. అప్పుడు యశోద చిన్ని గోపాలుడితో, ఏది నీ నోరు తెరు అని గట్టిగా కోపంగా అంటుంది.

కృష్ణుడు నోరు తెరవగానే ఆ నోటిలో విశ్వమంతా కనపడుతుంది యశోదకి. శ్రీకృష్ణుడి నోటిలో కదిలే విశ్వమంతా చూచి యశోద ఆశ్చర్యపోయి "కలయో వైష్ణవ మాయయో! ఇతర సంకల్పార్థమో! సత్యమో! తలపన్నేరక యున్న దాననో! యశోదా దేవి గానో! పరస్థలమో! బాలకుడెంత? ఈతని ముఖస్థంబై యజాండంబు ప్రజ్వలమై యుండుట కేమి హేతువో! మహాశ్చర్యంబు చింతింపగన్"

అని తలస్తూ స్పృహతప్పి పడిపోతుంది అలా ఆనాడు మా చేత కంఠోపాఠం చేయించిన పద్యం ఇప్పటికీ నాకు గుర్తే, అలాగే వేమన గారి పద్యం ఉప్పుకప్పురంబు నొక్క పోలికనుండు అనేది చాలా బాగా నేర్పించి అర్థం చెప్పారు టీచర్.

తెలుగు పాఠాలు ఎంత బాగా చెప్పినా, గౌరీ నాగేశ్వరి టీచర్ పిల్లలందరినీ ఎప్పుడు ఏదో రకంగా కించపరుస్తూ మాట్లాడేవారు.

టిఫిన్ బాక్సుల్లో అమ్మలు పెట్టిన అన్నంలో సగం మాత్రమే తిని అమ్మ తిడుతుందేమోనని సగం అన్నం చెట్లలో పడేసి టిఫిన్ డబ్బా కడిగి పెట్టుకునే వాళ్ళం మేము అందరం. అలాంటిది మా గౌరీ నాగేశ్వరి టీచర్ మమ్మల్ని అందరినీ ఉద్దేశించి "మనం పెద్ద క్లాసుల్లోకి వస్తున్న కొద్ది అమ్మలతో పోట్లాడి పెద్ద పెద్ద క్యారియర్లో రకరకాల

వంటకాలను తెచ్చుకుని తింటారు. కానీ మీ తెలివితేటలు మాత్రం రోజు రోజుకి తగ్గిపోతున్నాయి తెలుగులో".

"ఓ" అంటే "నా" రాదు అనేవారు. ఆవిడని ఏమి అనలేక అదేమిటి మనం ఓ చిన్న డబ్బాలో లంచ్ తెచ్చుకుంటుంటే ఈవిడ పెద్ద పెద్ద క్యారేజీలు తెచ్చు కుంటారు అంటుంది ఏమిటీ అని చిన్నపుచ్చుకుని ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకునేవాళ్ళం.

ఈవిడ క్లాసులో పాఠాలు చెబుతుంటే పక్క గ్లాసులో పిల్లల్ని బెంచి ఎక్కించేది. అదేమిటి టీచర్ మేమేమి తప్పు చేశాం అంటే "మీ వల్ల నా క్లాస్ పిల్లలు పాఠాలు సరిగ్గా వినపడటం లేదు", మాట్లాడకుండా, నోటిమీద వేలు వేసుకొని బెంచి ఎక్కి నుంచోండి అనేది ప్రతిరోజు ఇదే తంతు.

తెలుగు క్లాసు అయిన తరువాత ఒకరోజు మాకు హిస్టరీ క్లాసు ఉంది. మా తెలుగు టీచర్, మీ తర్వాత టీచర్ వచ్చేవరకు ఆందరూ నోటిమీద వేలు వేసుకొని బెంచి ఎక్కి నుంచోండి. నేను వెళ్లి ఆవిడ వచ్చేలోపల మీ భీభత్సమైన కబుర్లు, అల్లరితో పక్క క్లాసు వాళ్లకి "డిస్ట్రబెన్స్" అవుతుంది అని మమ్మల్ని బెంచి ఎక్కించి వెళ్ళింది.

మా హిస్టరీ టీచర్ హేమలత గారు. ఆవిడ మంచి చీరకట్టుతో హుందాగా ఉండేవారు. పిల్లలు అంటే చాలా అభిమానం ఆవిడకి. క్లాస్ కి రాగానే మేమందరం బెంచీ ఎక్కి నుంచునేసరికి ఆశ్చర్యపోయి ఎందుకు మీరందరూ బెంచి ఎక్కి నుంచున్నారు అని అడిగారు. (ఆంగ్లంలో) దానికి అందరూ ముక్తకంఠంతో మేమేమీ అల్లరి చేయకుండానే గౌరీ నాగేశ్వరి టీచర్ మమ్మల్ని బెంచి ఎక్కించారు అని చెప్పాము. ఆవిడకి కొంచెం కోపం వచ్చి, నా పర్మిషన్ లేకుండా నా క్లాసు పిల్లల్ని ఆవిడ పనిష్ చేయడం ఏమిటి అంటూ అందరూ కూర్చోండి అని చెప్పింది. మేము ఇంకా తెలుగు టీచర్ గురించి ఏమన్నా కంప్లెంట్ చేస్తామేమోనని, కొంచెం తమాయించుకుని అలా అని మీరందరూ ఆవిడని హేళన చేసి మాట్లాడకండి, కొంచెం ఆవిడకి క్రమశిక్షణ ఎక్కువ అంటూ తెలుగు టీచర్ని సమర్థించింది.

ఒకరోజు గౌరీ నాగేశ్వరీ టీచర్ ముందుగా చెప్పా పెట్టకుండా, క్లాసుకి రాగానే నేను ఈసారి మంత్లీ టెస్ట్ టైమ్‌కు ఉండడం లేదు. అందుకని ఇవాళ పరీక్ష పెట్టేస్తాను.

నేను నిన్న చెప్పిన పాఠంలోంచి ప్రశ్నలు ఇస్తాను ఎలాగో మీరందరూ నిన్నటి పాఠం ఇవాళ చదువుకొని వస్తారు. కదా అంటూ ప్రశ్నలు నల్లబల్ల మీద రాశారు. ఇంత సడన్‌గా పరీక్ష పెడతారని ఊహించని మాకు కొంత తడబాటు వచ్చింది ఎలాగో అలాగా రాశాము. మర్నాడు పేపర్లు దిద్ది మార్కులు చదువుతూ ఎవరి పేపర్ వాళ్లకి ఇస్తూ అందరికీ అక్షింతలు వేసింది అదేనండి తిట్లు.

నాకు నా ఫ్రెండ్ రమాకి మాత్రం బాగానే వచ్చి నాయి మార్కులు. కానీ చాలామందికి తక్కువ మార్కులు వచ్చాయి. అందరి వంక కోపంగా చూసి "ఒకళ్ళో ఇద్దరూ బాగా రాశారు వాళ్లు మేము చాలా గొప్ప వాళ్ళమని పొంగిపోకండి. ఏదో కాస్త మన తాతలు గొప్పవాళ్లు కాబట్టి మనకు కాస్త తెలుగు ముక్క వచ్చింది. అంతే!" అంటూ నన్ను హెచ్చరిస్తున్నట్టుగా మాట్లాడింది. నాకు అది నన్నే అని తెలిసి బాగా రాసినా మెచ్చుకో కుండా ఇలా వ్యంగంగా అనడంతో బాధ కలిగింది.

ఆ విషయం వెళ్లి మా తాతకు చెప్పాను. ఇలా మాటిమాటికీ మార్కులు బాగా వచ్చినా "మీ తాత గొప్పవాడు, మరి మనమేమో శుంఠలం" అంటూ దెప్పిపొడుస్తూ మాట్లాడుతోంది. అప్పుడు ఆయన నేను మన ఇంటి అడ్రస్ గురించి ఒక పద్యం చెబుతాను. నేర్చుకొని ఆవిడకు చెప్పు అంటూ మాట మార్చారు. సరే! టీచర్ దగ్గర చెప్పి మెప్పు పొందవచ్చని నేర్చుకున్నాను. అది

**"అష్టోత్తర శతనామ దిష్టంబగు గృహము**
**శ్రేష్టము వివేకనగరము**
**వింశతీ భాగ్యనగర్**
**స్పష్టముగా వ్రాసి పంపుడు లేఖల్**" అంటూ ఆవిడకు అప్పజెప్పాను. సరే బాగుంది అని చెప్పు పెద్దాయనకి అని అన్నారు. అంటే ఇ.నెం. 108, వివేకనగర్, హైదరాబాద్-20 స్పష్టంగా అడ్రస్ రాసి లేఖలు పంపండి అని అర్థం.

తరువాత అందరి వంక చూస్తూ మీరు ఇలాగే ఏడాది పరీక్షలు కూడా రాశారంటే మీ మార్కులు తిరుపతి నుంచి వచ్చే బస్సులా ఉంటాయి. ఇదే క్లాసులో ఉండిపోవాలి అర్థం అయిందా అని అన్నారు. మా మార్కులు తిరుపతి నుంచి వచ్చే బస్సుల్లాగా ఉండడం ఏమిటి అని ఆశ్చర్యంగా చూసాము ఆవిడ వంక.

"మొద్దుల్లారా ఇది కూడా అర్థం కాలేదా? తిరుపతికి వెళ్ళిన వాళ్ళు ఏం చేయించుకుంటారు అన్నారు. గుండు చేయించుకుంటారు అన్నాము. అవును కదా మరి గుండు చేయించుకుని బస్సు ఎక్కి, కిటికీలోంచి బయటికి చూస్తుంటే అన్నీ గుండ్రంగా ఉండే గుండ్లే కనపడతాయి కదా! అందుకని తిరుపతి నుంచి వచ్చే బస్సులా ఉంటాయి అన్నాను అంటే గుండు సున్నాలు అన్నమాట. ఇది కూడా నేనే చెప్పాల్సి వచ్చింది మీకసలు తెలివితేటలు సున్నా. అందుకే 0 సున్నా వేస్తున్నాను అంటూ వచ్చిన మార్కులు కూడా కొట్టేసి కోపంతో సున్నాలు పెట్టారు. ఆ మాటలకి అందరం పడి పడి నవ్వాము. ఆవిడ కూడా నవ్వేసి మళ్ళీ తను టీచర్ అని గుర్తుకు వచ్చిందేమో! గంభీరంగా మారి చాలు చాలు నవ్వులు ఆపండి" అన్నారు. ఆవిడ కొంచెం నవ్వుతూ మాట్లాడేసరికి మా అందరికీ ధైర్యం వచ్చి, అందరం కూడా బలుక్కున్నట్టు లేచి ప్లీజ్ టీచర్ మేము సరిగ్గా చదువుకుని రాలేదు. నెల వారి పరీక్షలు అంటే బాగా చదువుకొని వచ్చేవాళ్ళం.

రేపు మళ్లీ పెట్టండి టీచర్ ప్లీజ్ ఫెయిల్ చేయకండి అంటూ బ్రతిమిలాడాము.

సరే రేపు మళ్లీ పెడతాను కానీ ఇవే ప్రశ్నలు కాదు. ఈసారి ఏ ఒక్కరు సరిగ్గా రాయకపోయినా, అందరికీ సున్నా మార్కులు వేస్తాను అంటూ బెదరిం చారు. సరే టీచర్ అంటూ అందరం ఊపిరి పీల్చుకున్నాము. నాకు మా ఫ్రెండ్ రమాకి, ఇంకా ఇద్దరు ముగ్గురికీ మంచి మార్కులు వచ్చినా, క్లాసులో అందరూ పాస్ అవాలి కదా! అని అందరి కోసం నోరు ఎత్తకుండా మళ్లీ పరీక్ష రాశాను. ఆవిడతో కొన్ని పాట్లు పడ్డా, గౌరీ నాగేశ్వరి టీచర్ తెలుగు పాఠాలు బాగా చెప్పేవారు. ఈ రోజు ఈ మాత్రం తెలుగు రాస్తున్నామంటే ప్రైమరీ స్కూల్లో సూర్యనారాయణమూర్తి మాస్టారూ, హైస్కూల్లో గౌరీ నాగేశ్వరి టీచర్ల తెలుగు బోధనే కారణం.

# మైకాల్ ఈజ్ నెప్పింగ్

నన్ను మానాన్న ఇంగ్లీష్ మీడియంలో చేర్పించడంతో నాకు ఒక్క ముక్క కూడా టీచర్ చెప్పింది అర్థం అయ్యేది కాదు. ఒకరోజు సోషల్ టీచర్ హోమ్‌వర్క్ ఇచ్చింది. అయితే నాకు ఆవిడ హోంవర్క్ ఇచ్చిన విషయం కూడా తెలియదు. ఎందుకంటే నాకు వాళ్ళు చెప్పే దాంట్లో ఒక్కముక్క కూడా అర్థం కాకుండా ఉండడమే దీనికి కారణం. క్లాసుకి వెళ్ళగానే టీచర్ అందరిని హోంవర్క్ చేసుకొచ్చారా అని అడిగారు. అందరూ "ఎస్ టీచర్" అని చెప్పారు.

కానీ నాకు ఆవిడ హోంవర్క్ ఇచ్చిన విషయమే తెలియదు. అసలు అర్థమైతేగా చేయడానికి, హోంవర్క్ చేయనందుకు టీచర్ కొంచెం సేపు క్లాసులో నిలబెట్టి "రేపు చేసుకురా" అంటూ వార్నింగ్ ఇచ్చి కూర్చోబెట్టింది. నాకు కళ్ళవెంబడి నీళ్లు వచ్చినాయి. నిజంగా నాన్న ఎంత పనిచేశారు. నాకు ఒక్క ముక్క కూడా ఇంగ్లీష్ అర్థం కావడంలేదు. అందుకే ఇంటికి వెళ్ళగానే దిగులు గా కూర్చున్న. నాన్న ఆఫీసు నుండి ఎప్పుడు వస్తారని ఎదురుచూసి, రాగానే గట్టిగా కౌగలించుకుని ఏడ్చేశాను. నన్ను ఇంగ్లీష్ మీడియంలోంచి తీసేయండి. నాకు చాలా అవమానంగా ఉంది. క్లాసులో అంటూ బోరుభోరున ఏడ్చాను. అలాగేలే చూద్దాం. ఇప్పుడు ఎలాగో నెల పరీక్షలు వస్తాయికదా! నేను నీకు హెల్ప్ చేస్తాను. వాటిల్లో మార్కులు బాగా రాకపోతే అప్పుడు తెలుగు మీడియంలోకి మారుస్తాను అని చెప్పారు నాన్న. అప్పుడు పిల్లలకు పైచదువులకి ఇంగ్లీష్ అవసరము. ఇప్పటివరకూ తెలుగు మీడియంలో చదివారు కదా! అన్న ఉద్దేశంలో వున్నారనుకుంటా.

తర్వాత నెల పరీక్షలముందర నాకు టీచర్ చెప్పింది. ఏమీ కూడా ఇంగ్లీషులో రాసుకోవడం వచ్చేదికాదు. అందుకని ఎవరికీ తెలియకుండా నోట్‌బుక్‌ని సన్నగా ఎవరికీ కనపడకుండా కొంచం తెరుచుకుని పెన్నుతో టీచర్ చెప్పేది పెదవుల కలయిక చూస్తూ, ఆ ఇంగ్లీష్ పదాన్ని తెలుగులో మొత్తం అంతారాసుకుని ఇంటికి తీసుకెళ్లే దాన్ని.

సాయంత్రం నాన్న ఇంటికి రాగానే కొంచెం తాగడానికి నీళ్లు ఇచ్చి చూడునాన్నా! పాఠాన్ని ఇలా తెలుగులో రాసుకొని వచ్చాను. ఎంత ఇన్సల్టుగా ఉందో అని నేను తెలుగులో రాసుకొచ్చిన పాఠాన్ని చూపించాను. దానికి నాన్న ఉండు నన్ను చూడనీ

అంటూ పాఠాన్ని నాచేత ఇంగ్లీషులో స్పెల్లింగ్లు చెబుతూ రాయించి అర్ధం చెప్పి, కంఠోపాఠం చేయించారు.

అలా ప్రతిరోజు నేను తెలుగులో రాసుకున్నది. నాన్న ఇంగ్లీషులోకి తర్జుమా చేసి నాకు చెప్పడం జరిగింది. ఇలా నెలపరీక్షలు దగ్గరికి వచ్చాయి పరీక్షల్లో అన్ని సబ్జెక్టులలోనూ 35 మార్కులు వచ్చాయి కానీ, ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాను.

ప్రోగ్రెస్ రిపోర్ట్ తీసుకెళ్లి నాన్నకి చూపించాను. చూడండి ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాను. నాకు చాలా బాధగా ఉంది. ఆపాత స్కూల్లో ఎప్పుడు నేను క్లాస్ ఫస్టు వచ్చేదాన్ని. ఇక్కడ నాకు చాలా అవమానంగా ఉంది. అంటూ నాన్నతో మళ్లీ చెప్పాను. ఆయన కాదు నీకు అసలు ఒక్క ముక్క కూడా ఇంగ్లీషు రాకుండానే అన్ని సబ్జెక్టులో 35 మార్కులు వచ్చిపాస్ అయ్యావు. ఒక్క సబ్జెక్టు కొంచెం పోయింది. దాన్ని కూడా ఈసారి బాగా చదివేద్దాం. సరేనా! వచ్చేనెల కూడా అలాగే నీకు చాలా భయంగా ఉంటే అప్పుడు నేను తెలుగు మీడియంలోకి మారుస్తాను అంటూ బుజ్జగించారు.

ఈమధ్యలో మేము ఉండే క్లాసురూం ఇంకొక కొత్త భవంతిలోకి మారింది. ఇంకా అక్కడికి బెంచీలు, అవీ వేయలేదు. అందరం కిందనే కూర్చునేవాళ్ళం. అలా మూడు క్లాసులు వరుసగా కింద కూర్చునేసరికి, ఒకరోజున సైన్స్ స్టడీస్ క్లాసులో నాకు కాలు తిమ్మిరి పట్టింది. నొప్పిగా వుంది. దానితో ఒక్కసారి లేచి నుంచుందామని సడన్ గా లేచి నిలుచున్నా.

టీచర్ నా వంక ఆశ్చర్యంగా చూస్తూ “వాట్ హ్యాపెండ్” అని అడిగింది. నాకు తెలుగులో చెప్తే అందరూ నవ్వుతారు అన్న భయంతో వచ్చిరాని ఇంగ్లీల్లో మైకాల్ ఈజ్ నెప్పింగ్” అని చెప్పాను.

టీచర్‌తో సహా క్లాసులో పిల్లలందరూ గట్టిగా నవ్వేశారు. నాకు ఏం చేయాలో తెలియలేదు. తర్వాత అర్ధమైంది నేను నెప్పింగ్ అనేది తెలుగు కం ఇంగ్లీష్‌లో చెప్పాను అని. పెయినింగ్ అని చెప్పాల్సింది.

అందరూ అలా నవ్వుతుంటే అవమానంతో నా మొహం ఎర్రగా కందిపోయి అలాగే టీచర్ను చూస్తూ నుంచుండిపోయాను. అప్పుడు సైన్స్ టీచర్ హేమలతగారు

కొంచెం తమాయించుకుని “వాట్ ఇస్‌దిస్ ఇంగ్లీష్” అని అడిగారు.

నా పక్కన కూర్చున్న ఫ్రెండ్స్ నా అవస్త చూసి టీచర్‌తో “తను కొత్తగా ఇంగ్లీష్ మీడియంలో చేరింది. తనకు అంత బాగా రాదు ఇంగ్లీషులో మాట్లాడడం” అంటూ ఆవిడకి ఇంగ్లీషులో చెప్పింది. టీచర్ “ఓకే ఓకే ప్లీజ్ లర్న్ టు స్పీక్ ఇంగ్లీష్ క్వికిలీ” అంటూ కూర్చోమని చెప్పింది.

అలా ఇంకో నెల కూడా కొంచెం అక్కడక్కడ ఇంగ్లీషు పదాలు రాస్తూ తెలుగులోనే నోట్స్ వ్రాసుకుని ఇంటికి తీసుకొచ్చి నాన్నకి చూపించి ఆయన సహాయం పొందాను. రెండోనెల పరీక్షలో అన్నిట్లోను 45 మార్కులు వచ్చినాయి.

ఏముంది చూసావా పాస్ అయ్యావు ఏదైనా సరే మొదట కష్టంగానే ఉంటుంది. ఇది నీకు తర్వాత ఉపయోగపడుతుంది. నువ్వు ఇలాగే ఉండు నీకు 45 నుంచి 50కి వస్తాయి అంటూ అలా అలా ఎంకరేజ్ చేశారు. చివరికి ఏడాది పరీక్షల్లో నిజంగానే 50 మార్కు లతో పాస్ అయ్యి 9వ క్లాసుకు వచ్చాను.

కానీ ఎప్పుడు టీచర్ ఏదన్నా ప్రశ్న వేస్తుందేమో ఇంగ్లీషులో అని భయంతో కొంచెం వెనకటి బెంచీలో కూర్చునేదాన్ని. మా అక్క సులోచన వచ్చి నన్ను చూసి ఏమిటి వెనక బెంచీలో కూర్చున్నావు అంటూ మానాన్నగారికి కంప్లైంట్ చేసింది. నాన్నగారు నన్ను అదికాదమ్మా ముందు వరుసలో కూర్చుంటే పాఠాలు శ్రద్ధగా వస్తాయి. వెనుక బెంచీలో కూర్చునేవాళ్ళు మాట్లాడుకోవడానికి కూర్చుంటారు. టీచరు కూర్చోబడితే సరే కానీ నువ్వు అలా వెళ్ళకూడదు అంటూ మా చిన్నక్కకి నువ్వు దాన్ని రేపు క్లాసులో ముందు వరుసలో కూర్చోపెట్టు అంటూ పురమాయించారు. ఇంకేముంది మా అక్క వచ్చి ధైర్యంగా టీచర్తో మాట్లాడి నన్ను ముందు వరుసలో కూర్చోబెట్టి వెళ్ళింది. ఇంక అప్పటినుంచి టీచర్ ఏమి ప్రశ్న వేస్తుందో అన్న భయంతో బిక్కుబిక్కు మంటూ, ప్రతిదీ కూడా రాసుకుంటూ, కొంచెం శ్రద్ధగా పాఠం విని చదవడం అలవాటు చేసుకున్నాను. అలా అలా మా నాన్న పట్టుదల వలన, నా పట్టుదలతోనో మొత్తం ఏడాది పరీక్షలు ఫస్ట్ మార్కులతో పాస్ అయ్యాను.

# ఆర్ట్స్ గ్రూప్

నాకూ మా అక్కకీ, ఒక్క క్లాసు మాత్రమే తేడా అందుకే ప్రతిసారీ నేను పెద్ద తరగతికి వెళ్ళగానే, మా అక్క పాఠ్యపుస్తకాలని నాకు ఇచ్చేవారు. ఒక్కసారి కూడా కొత్తవి కొనలేదు మా నాన్న, మా అక్క తన పుస్తకాలు చాలా నలిపేసేది. ప్రతి పాఠ్యపుస్తకానికి చెవులు మెలేసినట్టు. చివర్ల వంకర తిరిగి ఉండేవి. పైగా లోపల పేజిల్లో కొన్నిచోట్ల ఇంకు పెన్నుతో అండర్ లైన్ చేసేది. దానితో నాకు పెద్ద క్లాసుకి వెళ్ళినా, కొత్త పుస్త కాలు వస్తాయన్న సంతోషం ఉండేది కాదు. నాకు మొదటి నుంచీ అన్ని సిస్టమాటిక్ గా, నీట్‌గా పెట్టుకోవడం అలవాటు. నాన్నతో చెప్పేదాన్ని నాకు అక్క పుస్తకాలు వద్దు నలిగిపోయి పాతగా రోతగా “ఉన్నాయి”. కొత్తవి కొనమని అడిగేదాన్ని. మా నాన్న మా అక్కని ఏమీ అనకుండా, మీ అక్క పుస్తకాల బాగా చదివి నమిలి మింగేస్తుంది. అందుకే పుస్తకం కొనలు చిరిగిపోయాయి అంటూ జోక్ చేస్తూ, ఆ పుస్తకాలన్నీ తీసుకొచ్చి, నలిగిన వాటిని కొంచెం సరిచేసి, కొత్తగా అట్టలు వేసి, వాటికి లేబుల్స్ అంటించి ‘చూడు మళ్ళీ కొత్త పుస్తకాలు కొనాలంటే చాలా డబ్బు ఖర్చు. ఈసారికి సర్దుకుపో, వచ్చే ఏడు కొత్తని కొంటాను’ అంటూ బుజ్జగించేవారు. దాంతో మా అక్క పాత పుస్తకాలతో సర్దుకుపోయేదాన్ని. అయితే మా అక్క కూడా చాలా క్లెవర్ స్టూడెంట్. చాలా ధైర్యస్తురాలు. నాకూ, మా చెల్లెలికి, ఎవరితోనన్నా ఏదన్నా గొడవ. వస్తే, మమ్మల్ని వెనకేసుకొచ్చి, వాళ్ళని బెదిరించి వెళ్ళేది. స్కూల్లో డిబేట్ కాంపిటీషన్‌లో ఎప్పుడూ మొదటి బహుమతి గెలుచుకునేది. కానీ తన నలిగిపోయిన పుస్తకాలతోనే నాకు చాలా బాధగా, కోపంగా వుండేది. అలా తొమ్మిదవ క్లాసు పాస్ అయి 10వ క్లాసుకి వచ్చాను. 10వ క్లాస్‌లో మాకు ఆప్షనల్ సబ్జెక్ట్స్ ఉంటాయి. సైన్స్. ఆర్ట్స్ అని. మనకి 9వ క్లాసులో వచ్చే మార్కులను బట్టి, పదవ క్లాసులో సైన్స్ గ్రూపు లేక ఆర్ట్స్ గ్రూపు ఇచ్చేవారు. ఏడాది పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి పదవ క్లాసులో సైన్స్ గ్రూపు కొంచెం తక్కువ మార్కులు వచ్చిన వారికి ఆర్ట్స్ గ్రూపు ఇచ్చేవారు.

తొమ్మిదవ క్లాసులో నాకు మార్కులు బాగా వచ్చాయి. క్లాసులో ఫస్ట్ ర్యాంక్ వచ్చాను. అందుకని నాకు సైన్స్ గ్రూపు ఇచ్చారు. 10వ క్లాసులో మా అక్క కూడా సైన్స్

చదివింది. 10వ క్లాస్లో మళ్ళీ దాని పాత పుస్తకాలే ఇస్తారు. స్నేహితులందరూ కొత్తకొత్త పుస్తకాలతో సంబరంగా క్లాసుకి వస్తుంటే నేను మాత్రం ఏ ఉత్సాహము లేకుండా, మా అక్క నలిపివేసిన పుస్తకాలకు కొత్త అట్టలు వేసుకుని రావాలి.

ఈ బాధ నుంచి తప్పించుకోవాలని నాకు సైన్స్ గ్రూపు వద్దు ఆర్ట్ గ్రూపులో వేయండి అని టీచర్ కి చెప్పి వేయించుకున్నాను. అందరూ ఆశ్చర్యపోయారు. 'అదేమిటి ఆర్ట్స్ గ్రూపులో వేస్తే అందరూ ఏడుస్తారు నువ్వేమో ఇంత క్లెవర్ స్టూడెంట్ అయికూడా. ఆర్ట్కి వెళ్తున్నావు' అంటూ టీచర్ అడిగింది.

'నాకు ఎకనామిక్స్ అంటే ఇష్టం' అందుకే అని చెప్పి ఆర్ట్స్ గ్రూప్‌లో వేయించుకున్నాను. "ఓ అయితే. "సరే" అంటూ మెచ్చుకున్నారు. తమకు సైన్స్ గ్రూపులో సీటు రాలేదన్న బాధతో ఉన్న మిగతా పిల్లలందరూ నన్ను చూసి ఇన్స్పిరేషన్ తెచ్చుకున్నారు. నన్ను గొప్పగా చూడడం మొదలు పెట్టారు. దాంతో నాకు మరింత వుత్సాహం వచ్చింది.

నేను ఈ ఆర్ట్స్ గ్రూపు తీసుకోవడానికి మరో కారణం, మా అక్క సులోచన ఇంటికొచ్చింది మొదలు డ్రాయింగ్ బుక్ ముందేసుకుని 'అమీబా' లేక బొద్దింకల బొమ్మలు గీస్తూ, చెరుపుతూ, వేస్తూ, వాటి శరీర భాగాలకి పేర్లు రాస్తూ కూర్చునేది. పైగా ప్రాక్టికల్స్ ఒకటి. రాగానే డ్రాయింగ్ బుక్ ముందర వేసుకొని కూర్చునేది. హాయిగా హోంవర్క్ అవగానే ఆడుకోవడానికి లేకుండా ఈ బొమ్మలు గీసుకుంటూ కూర్చోవడం నాకు ఇష్టం ఉండేది కాదు. ఇంకో అసలైన విషయం ఏమిటంటే ఆర్ట్స్ గ్రూప్‌లోకి వెళితే, నలిగిపోయిన మా అక్క పుస్తకాలు కాకుండా కొత్త పుస్తకాలు కొనుక్కోవచ్చు అని అలోచించాను.

పదవ క్లాసులో ఆర్ట్స్ గ్రూప్‌కి సంబంధించిన ఎకనామిక్స్, హిస్టరీ కొత్త కొత్త పుస్తకాలు కొనుక్కుని హాయిగా సంతోషంగా క్లాసుకి వెళ్ళాను. నిజానికి ఎకనామిక్స్ నా ఫేవరేట్ సబ్జెక్టు. అందుకని ఎకనామిక్స్, హిస్టరీలో నాకు చాలా మంచి మార్కులు వచ్చేవి. దాంతో టీచర్లకు కూడా నేను ఫేవరెట్ స్టూడెంట్ అయ్యాను, ఈ ఇష్టమైన సబ్జెక్ట్స్, కొత్త స్నేహితుల మధ్య, అలా సంతోషంగా మంచి మార్కులతో 10వ క్లాస్ పాస్ అయ్యాను.

# ఛీఫ్ గెస్ట్‌గా అక్కినేని నాగేశ్వరరావుగారు

రాబోయే మా స్కూల్ వార్షికోత్సవ సందర్భం విద్యార్థులకు అన్ని రంగాల్లో అంటే ఆటలు, పాటలు, వ్యాసరచన, డిబేట్, లెక్కలు, నీతి కథలు, అలాగే వంటల పోటీలు, లాండ్రీ, కుట్లు అల్లికలు, ముగ్గులు ఇలా అన్ని రంగాల్లో పోటీలు నిర్వహించారు. మా పాఠశాల యాజమాన్యం. పాఠశాల వార్సికోత్సవం రోజున ముఖ్యఅతిథి చేత బహుమతులు ఇప్పించేవారు. వార్షికోత్సవం ముందు ఒక నెల రోజుల నుంచి అన్ని పోటీలు పెట్టేవారు.

నిజానికి వంటలు ముగ్గులు, కుట్లు అల్లికల పోటీలు ఏమిటి అని ఆశ్చర్యపోకండి. ఆ రోజుల్లో మాకు వారానికి ఒకసారి, ఒక క్లాస్ కుట్లు నేర్పించేవారు. తర్వాత యు ఎన్ ఓ పరీక్ష కోసం జనరల్ నాలెడ్జ్ క్లాస్ ఉండేది. మా ఎకనామిక్స్ టీచర్ లక్ష్మీగారు రోజూ పేపర్లో విశేషాలు ఏమున్నాయో ఒక పేజి మీద రాసుకుని, వాటికి ప్రశ్నలు, జవాబులు కూడా మేమే రాసుకుని రమ్మనేవారు. జనరల్ నాలెడ్జ్ క్లాస్ ఉన్న ఆ రోజున, క్లాసుని రెండుగా విభజించేవారు. ఒక గ్రూప్ వాళ్ళు ప్రశ్నలు అడిగితే, రెండవ గ్రూప్ వాళ్ళు దానికి జవాబులు చెప్పడం ఉండేది. అలా మాకు జనరల్ నాలెడ్జ్ క్లాసు కూడా ఉండేది. లక్ష్మీ టీచర్ ఇలా మాకు పేపర్ చదవడం, దానిలోని ముఖ్యమైన అంశాలమీద ప్రశ్నలు తయారు చేసి, జవాబులు రాయిస్తూ మమ్మల్ని యు.ఎన్.ఓ. జనరల్ నాలెడ్జ్ పరీక్షకు తయారు చేశారు.

అంతేకాకుండా కుట్లు, అల్లికలు క్లాసులో, మాకు కాడకుట్టు, ముద్ద కుట్టు, అలాగే జాకెట్లకి హుక్స్ కుట్టడం, తర్వాత ముద్ద కుట్టతో గులాబీపూలు జాకెట్ మీద కుట్టడం ఇలాంటివన్నీ కూడా నేర్పించేవారు.

లెదర్ మీద బొమ్మలు వేయడం, పర్సులు కుట్టడం కూడా నేర్పించేవారు. వారానికి రెండు క్లాసులు కుకరీ, లాండ్రీ తరగతులు వుండేవి. మా క్లాస్‌లో పిల్లల్ని రెండుభాగాలుగా విభజించి 'ఏ' విభాగానికి కుకరి. 'బి' విభాగానికి లాండ్రీ ఇచ్చేవారు. 'కుకరీ' గ్రూప్' వచ్చిన వాళ్ళు చాలా సంతోషంగా ఉండేవాళ్ళు. లాండ్రీ వాళ్ళు ముఖం దిగాలుగా పెట్టుకొని ఉండేవారు. ఒకళ్ళనొకళ్లని సరదాగా ఏడిపించుకునేవాళ్ళం.

వంటల క్లాసులో మాకు స్వీట్స్, రకరకాల బజ్జీలు, వగైరా వండడం నేర్పించారు.

అందులో నాకు ఇప్పటికి బాగా గుర్తు. అలుగడ్డలని ఉడికించి, మెత్తగా చిదిమి, దానిలో చక్కెర వేసి బాగా కలిపి, నెయ్యిలో వేయించి జీడిపప్పు, ఏలకు పొడిలాంటివి వేసి డైమండ్ షేప్ బిళ్లల్లా తయారు చేసి, టీచర్‌కి రుచి చూడడానికి ఇచ్చేవాళ్ళము. అది చూసి ఆవిడ మాకు మార్కులు వేసేవారు. ఈ మార్కులు మొత్తం బ్యాచ్ అందరికీ ఉండేది. దీనికి కావలసిన పదార్థాలు సామాగ్రి అంతా కూడా స్కూల్ వాళ్లే ఇచ్చేవాళ్ళు.

అలాగే లాండ్రీ క్లాస్‌లో, నూలు, సిల్క్, జార్జెట్ లాంటి బట్టలను ఎలా ఉతకాలో, గంజి పెట్టి ఇస్త్రీ చేయడం ఎలాగో నేర్పించేవారు. తర్వాత తలుపులు, కిటికీలు శుభ్రం చేయించేవారు. ఒకపక్క క్లాస్ రూమ్ కిటికీలు, తలుపులు శుభ్రం చేయడంతో పాటు, మాకు నేర్పించడం కూడా అవుతుంది. దీనిలో కూడా రెండు బ్యాచులు ఉండేవి. ఒక బ్యాచ్ తలుపులు తుడవడం, రెండవ బ్యాచి బట్టలు ఉతకడం లాంటివి ఉండేవి. దీనికి కూడా ఎవరు బాగా చేశారో చూసి, ఆ బ్యాచ్‌కి మార్కులు వేసేవారు.

వారానికి ఒక క్లాసులో నీతి కథలు చెప్పేవారు. టీచర్. వాటిని మళ్లీ మనం విని వచ్చే క్లాసులో మనం విద్యార్థులందరికి కూడా అదే కథ చెప్పవలసి ఉంటుంది. మా భావ వ్యక్తీకరణ ఎలా ఉందో, అంటే అందరికీ అర్థమయ్యేలా చెప్పామో, లేదో చూసి, దానిలో బాగా చెప్పిన వాళ్ళకి మొదటి బహుమతి ఇచ్చేవారు.

అలాగే ప్రతి సంవత్సరం యు.ఎస్.ఓ. వాళ్లు పెట్టే జనరల్ నాలెడ్జ్ పరీక్షలో, ఫస్ట్ వచ్చిన వాళ్ళకి బహుమతి ఉండేది. తర్వాత అన్ని 3 రకాల ఆటలపోటీలు హైజంప్, లాంగ్ జంప్, కోకో, కబడ్డి వగైరా ఆటల్లో మొదటి బహుమతి వచ్చినవారికి, అలాగే పాటల పోటీల్లో అంటే క్లాసికల్ లలిత సంగీతం పోటీలలో మొదటి బహుమతులు నిర్ణయించేవారు.

అలా నాకు వార్షిక పరీక్షలో లెక్కల్లో ఫస్ట్ రావడం వలన ఒక బహుమతి, యు.ఎన్.ఓ వారి జనరల్ నాలెడ్జ్ పరీక్షలో, స్కూల్ ఫస్ట్ వచ్చినందుకు ఒక బహు మతి వచ్చినాయి.

ఈసారి ముఖ్య అతిథిగా ఎవరిని పిలుస్తారా. అని అందరం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాం. ఒక రోజు ప్రార్ధన అయిపోగానే, మా ప్రిన్సిపాల్ కస్తూరి ప్రసాద్ గారు స్టేజ్

మీదకు వచ్చి 'ఈసారి మనకు ముఖ్య అతిథిగా ప్రముఖ నటులు అక్కినేని నాగేశ్వర రావుగారు వస్తున్నారు' అని చెప్పారు. ఇక మా ఆనందానికి అవధులు లేవు. అందరం సంతోషంతో గట్టిగా చప్పట్లు కొట్టాము. అక్కినేని అంటే విపరీతమైన ఆరాధన భావం పెద్ద చిన్న తేడా లేకుండా ఉండేది. అందరం ఆరోజు మంచి కలర్ డ్రెస్ వేసుకుందామని ఊహించుకుంటూ గుసగుసలాడుకుంటున్నాము.

అంతలోనే మళ్లీ మా ప్రిన్సిపల్ "ఇంకొక విషయం మీరందరూ ఆ రోజు కూడా స్కూల్ యూనిఫామ్ అంటే ఏకరూపదుస్తులు వేసుకుని రావాలి. మన స్కూల్ గురించి, డిసిప్లిన్ గురించి అందరూ బాగా చెప్పుకుంటారు. అక్కినేని గారు ఒక సినిమా హీరో. కాబట్టి ఆయన ముందు మంచి కలర్ డ్రెస్సులు వేసుకొని, ఓహో ఇది అయిపోతూ తిరగకండి. అందరూ ఆయన మీద పడిపోకుండా డిగ్నిఫైడ్‌గా మన స్కూలు పరువు కాపాడాలి. తెలిసిందా' అన్నారు.

ఇంకేముంది మా అందరి ముఖాలు ఒక్కసారిగా చిన్నబోయినాయి. మా మధురమైన ఊహల మీద నీళ్లు చల్లినట్టు అయింది. అందరం మా ప్రిన్సిపల్ గారి మీద కోపంతో క్లాసులకు వెళ్లి కూర్చున్నాము. వార్షికోత్సవం రోజు ఎప్పుడు వస్తుందా? అక్కినేని గారిని సినిమాల్లో కాకుండా విడిగా ఎలా ఉంటారో చూడాలని అందరం తహతహలాడిపోయాము.

ఆ రోజు రానే వచ్చింది. మేమందరం మా యిస్కూల్ (స్కూల్ డ్రెస్) ఏక రూప దుస్తులైన గులాబీ రంగు స్కర్ట్, పైన తెల్లని జాకెట్, నల్ల బూట్లు తెల్లని సాక్స్, రెండు జడలు వేసి, నల్ల రిబ్బన్‌తో జడలను పైకి మడిచి కట్టుకొని చాలా సంతోషంగా వచ్చాము. స్కూల్ బయట అమ్మే గులాబీ పూల బండి దగ్గర నుంచి పది పైసలకి ఒక గులాబీ కొనుక్కుని జడలో పెట్టుకున్నామందరం.

అక్కినేని గారు వచ్చారు అని సంకేతంగా డ్రమ్స్ బీటింగ్ వినిపించడంతో, అందరం ఒక్కసారిగా లేచి నుంచున్నాము. ఆయన నడిచి వస్తుంటే చూడాలని అందరికీ ఆత్రం అయితే కొంచెం పొడుగ్గా ఉన్న వాళ్ళు ముందర నుంచునే సరికి, కొంచెంపొట్టిగా ఉన్న వాళ్ళకి సరిగ్గా కనబడలేదు. ఆయన వచ్చి ముందు వరుసలో కూర్చున్నారు. మా కస్తూరి ప్రసాద్ గారు, వారిని స్టేజి మీదకి ఆహ్వానించారు. ఆయన వేదిక ఎక్కుతుంటే, ఎంత వుత్సుకతో మా అందరిలో ఆయన హుందాగా స్టేజి మీదకి వచ్చి అందరికీ నమస్కరించి

కూర్చున్నారు. అయితే, ఆయన పంచ లాల్చీలో వచ్చారు. పైగా కొంత బాల్డ్ హెడ్ కూడా ఉంది. ఇదేంటి ఇలా ఉన్నారు నాగేశ్వర్‌రావు గారు అని ఆశ్చర్యపోయాము. ఆయనను మేము చక్కటి క్రాఫ్‌లో, ప్యాంటు షర్టులో వూహించుకున్నాము. ఇలా లాల్చీ పైజామాలో చూసేసరికి మా ఊహలు తారుమారు అయినాయి.

## ముందర ప్రార్థన గీతంతో ప్రారంభమైంది కార్యక్రమం

మా ప్రిన్సిపల్ గారు, ఇతర టీచర్లు అందరూ కూడా మాట్లాడడం అయిపోగానే, ముఖ్య అతిధిని సందేశం ఇవ్వమని చెప్పారు. అక్కినేని గారు లేచి నుంచుని, అందరివంక ఒకసారి నవ్వుతూ చూసి ఈ రోజు నేను ఇక్కడ ఒక పాఠశాల విద్యార్థుల దగ్గరకు వచ్చాను అని అనిపించడం లేదు. బాగా విరిసిన అందమైన గులాబీ తోటలోకి వచ్చినట్టు ఉంది మిమ్మల్ని, అందరిని చూస్తుంటే. మీ స్కూల్ డ్రెస్సు ఈ గులాబీ రంగులో ఏర్పాటు చేసిన మీ ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి ప్రసాద్ గారికి ముందుగా అభినందనలు తెలియజేస్తున్నాను. నిజానికి గులాబీ పూలు కదలలేవు. మనమే వాటి దగ్గరికి వెళ్ళాలి. కానీ మీరందరూ కదులుతున్న గులాబీపూలు. ఎంత చక్కగా ముచ్చటగా ఉన్నారో అంటూ ముందర మమ్మల్ని అభినందించారు. దానితో అప్పటిదాకా మంచిమంచి రంగుల దుస్తులు వేసుకోలేకపోయామని చింతిస్తున్న మా హృదయాలకి ఆయన మాటలు ఒక పన్నీటి జల్లులా అనిపించాయి. అందరం ఒకళ్ళకి ఒకళ్ళు షేక్ హ్యాండ్ ఇచ్చుకుని సంతోషంగా చూసుకున్నాం. ఆయన చాలా చక్కగా అన్ని విషయాల మీద, ముఖ్యంగా పిల్లలు ఎలా వుండాలి. వాళ్ళ మనస్తత్వాలు ఏమిటి అనే విషయాలన్నిటిమీద చక్కటి ప్రసంగం ఇచ్చారు. తర్వాత ఎప్పుడెప్పుడు వస్తుందా అన్న కార్యక్రమం బహుమతి ప్రదానం మొదలయింది. అయితే ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి క్లాస్‌లో ఫస్ట్ వచ్చిన వాళ్ళకి, అలాగే ఆటలు పోటీల వాళ్ళకి, పాటలవాళ్ళకి ఇలా దాదాపు 100 మంది దాకా ఉన్నారు. ముందు చిన్న పిల్లలు అలిసిపోతారని ఒకటో తరగతి నుంచి బహుమతి ఇవ్వడం మొదలు పెట్టారు. కొంత సేపటికి ఇంకా సమయం చాలా పడుతుందన్న ఉద్దేశంతో, పెద్ద క్లాసులవాళ్ళకి మా ప్రిన్సిపల్ కస్తూరి ప్రసాద్ గారు ఇస్తారు అని అనౌన్స్ చేశారు. దాంతో నాకు చాలా నిరుత్సాహం వచ్చేసింది. సరేలే పోని ఆయన ముందర తీసుకుంటున్నాం కదా అని అనుకున్నాం. కానీ నాగేశ్వరరావు గారికి ఒక షూటింగ్ కార్యక్రమం ఉండటం

వలన తొందరగా వెళ్లాల్సి వచ్చింది. అందుకని మాకు మా ప్రిన్సిపల్ మేడం కస్తూరి ప్రసాద్ గారు బహుమతి ప్రదానం చేశారు. నేను రెండు సార్లు స్టేజ్ మీదకు రావడం చూసి మా ప్రిన్సిపాల్ నన్ను అభినందిస్తూ, ఈసారి లెక్కల్లో రాష్ట్రస్థాయిలో బహుమతి తెచ్చుకోవాలని, బాగా కృషి చేయమని చెప్పారు. మా ప్రిన్సిపల్‌గారు అలా చెప్పడం నాకు చాలా సంతోషం అనిపించినా, మనసు మరుమూల అక్కినేని గారి చేతులమీదుగా బహుమతి తీసుకోలేక పోయానని బాధగా ఉంది.

ఆలోటు నేను పెద్దయిన తరువాత, సచివాలయంలో ఉద్యోగం చేసేటప్పుడు, అక్కినేని గారిని మేము ఉగాది కవిసమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిలవడం, కవయిత్రిగా వారి చేతుల మీదుగా సత్కారం అందుకోవడం జరిగింది. అలా అలా వారితో పరిచయం చివరకు నేను రాసిన "ఊహల వసంతం" పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. తరువాత "గుండె చప్పుళ్ళు" కవితా సంకలనం వారికి అంకితమివ్వడం జరిగింది. ఈ సందర్భంగా కూడా వారు నాకు శాలువా కప్పి, జ్ఞాపిక అందచేశారు. ఇలా ఆ రోజు నేను కోల్పోయిన ఆనందం, రెట్టింపుగా నాకు దక్కింది.



**"ఊహల వసంతం" పుస్తక ఆవిష్కరణ కావించిన అక్కినేని నాగేశ్వరరావు, ద్వా.నా. శాస్త్రి, విజయబాబు గార్లతో రచయిత్రి**

# వందకి వంద మార్కులు

మేము 11వ తరగతికి వచ్చేసరికి మాకు లెక్కలు చెప్పడానికి కొత్త టీచర్ వచ్చింది ఆమె పేరు కుప్పమ్మ. పేరే గమ్మత్తుగా ఉంది అనుకుంటే, మనిషి కూడా అలాగే సిటీలో ఉండే అవిడలా కాకుండా, ఊరు నుంచి వచ్చిన ఆవిడ లాగా కట్టు బొట్టు ఉంది. మేము ఈవిడ ఏమి లెక్కలు చెప్తుంది అబ్బా అనుకుని నవ్వుకున్నాం. పైగా పేరు చూసి మరీ నవ్వుకోవడం ఆవిడ వెళ్ళగానే "కుప్పమ్మ" ట. అదేమి పేరో అనుకుంటూ. ఆవిడ లెక్కలు బాగా చెప్పినా కూడా, మాకు ఇంకా ఆవిడ యొక్క వేషభాషలు, అలాగే ఆవిడ పేరు గురించి మింగుడు పడక, ఆమె చెప్పినది మాకు బుర్రలోకి ఎక్కలేదు.

రాత్రి భోజనాలప్పుడు మా నాన్న ఏమ్మా మీ స్కూల్లో కొత్త లెక్కల టీచర్ వచ్చారట కదా అని అడిగారు. అవునండి మీకు ఎలా తెలుసు అని అడిగాను.

ఆవిడ మా ఆఫీసులో కృష్ణారావు అని కొత్తగా ట్రాన్స్‌ఫర్ మీద మా ఆఫీసుకు వచ్చారు. ఆయన భార్య ఇంతకు ముందు చిత్తూరులో లెక్కల టీచర్‌గా పనిచేసింది. ఇప్పుడు ఇక్కడ హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత మీ స్కూల్‌లో జాయిన్ అయ్యారట. ఆవిడ పేరు ఏదో తమాషాగా ఉంది అని అన్నారు. అవును నాన్నా ఆవిడ పేరు కుప్పమ్మ. మాకు కూడా అదే అనిపించి నవ్వొచ్చింది అని అన్నాను. అలా నవ్వకూడదు నిజానికి నాకు గుర్తు రాలేదు. అది చిత్తూరు లో ఒక దేవత పేరు. కానీ ఆవిడా లెక్కల్లో గోల్డ్ మెడలిస్టు. చాలా తెలివి గల అవిడ అని కృష్ణారావు చెప్పాడు.

నువ్వు లెక్కలు అవి బాగా చేస్తూ ఉండు. లేకపోతే ఆవిడ ద్వారా మా కృష్ణారావుకు తెలిసి, మీ అమ్మాయి ఇదేమిటి ఇలా తెలివి తక్కువగా ఉంది అని అనుకునే విధంగా నాకు తలవంపులు తెచ్చి పెట్టొద్దు. ఆఫీసులో నా పరువు పోతుంది అని చెప్పారు.

నేను లెక్కలు బాగానే చేస్తాను కానీ నాన్న అలా హెచ్చరించేసరికి, అమ్మో! ఇది ఎక్కడ గొడవ మధ్యలో. ఈవిడ తెలిసినావిడ కావడం, నాకు తలనొప్పి తెచ్చి పెట్టింది అనుకున్నా.

మర్నాడు లెక్కల క్లాస్లో ఆవిడ అటెండెన్స్ తీసుకుంటూ రాజ్యశ్రీ అని రాగానే,

ఒకసారి నా వంక చూసి నవ్వింది. నేను కూడా నవ్వాను. క్లాస్ అయిన తర్వాత ఒకసారి నువ్వు స్టాఫ్ రూమ్ కి రా అని చెప్పారు ఆవిడ. మా స్నేహితులందరూ ఏమిటో ఆవిడ నిన్ను చూసి నవ్వింది. మల్ల స్టాఫ్ రూమ్ కి రమ్మంటుంది. ఏమిటి విషయం అంటూ అడిగారు. నాకు మటుకు ఏం తెలుసు? కాకపోతే ఈవిడ మా నాన్నగారి ఆఫీస్‌లో పనిచేసే కృష్ణారావు గారి భార్య అని మాత్రం నాకు తెలుసు అని చెప్పాను.

ఓ అయితే నువ్వు లెక్కలు సరిగ్గా చేసినా చేయకపోయినా వందకి వంద మార్కులు వేసేస్తుంది ఆవిడ అని ఏడిపించారు. నాకు వాళ్ళ మాటలు నచ్చలేదు. ఇది ఎక్కడ లొల్లి. ఈమె తెలిసినావిడ అవడం నా ప్రాణం మీదకి వచ్చినట్టు అయింది. ఈ కుప్పమ్మగారు ప్రతిరోజు ఇక నా మీద నిఘా పెట్టి క్లాసులో విషయాలన్నీ వాళ్ళ ఆయనకు చెప్పడం ఆయన నాన్నగారికి చెప్పడం జరుగుతుందేమో అని అనిపించింది.

సరే మధ్యాహ్నం లంచ్ టైంలో ఆవిడ రమ్మన్నారు కదా అని ఒక్కదాన్నే బిక్కుబిక్కుమంటూ స్టాఫ్ రూమ్‌కి వెళ్ళాను. ఆవిడ నన్ను చూసి నవ్వి "మీ నాన్నగారు చెప్పారు నువ్వు లెక్కలు బాగా చేస్తావు అని. నాకు సంతోషం వేసింది. బాగా చేయి తెలిసిందా! ఏమన్నా తెలియకపోతే నేను కావాలంటే మీ అందరికి పర్సనల్‌గా క్లాస్ తీసుకుంటాను. నాకు ఇక్కడ హైదరాబాదు కొత్త. పైగా మీ మాటలు, అవీ కూడా కొంత వేరుగా ఉన్నాయి. కొంచెం క్లాసులో నువ్వే అందరూ గొడవ చేయకుండా చూసుకోవాలి. నాది చిత్తూరు జిల్లా భాష. మీకు అర్థం కాకపోతే నా భాష, మళ్ళీ అడగండి" అని చెప్పి పంపించింది.

క్లాస్ రూమ్‌లోకి వచ్చానో లేదో, నా స్నేహితులందరూ బిలాబిలమంటూ నా చుట్టూ చేరి ఏం చెప్పారు టీచర్ "ఏం చెప్పారు టీచర్" అంటూ అడగడం మొదలు పెట్టారు. నేను మనందరం పాపం ఆవిడ పేరుని, ఆవిడ రూపాన్ని ఇప్పటి నుంచీ ఎగతాళి చెయ్యద్దు. ఆవిడ చిత్తూరు నుంచి వచ్చారట. అవిడ తెలుగు ఉచ్ఛారణ వేరుగా ఉంటుందిట. అందుకే మీకు అర్థం కాకపోతే ఇంకొసారి అడిగి చెప్పించుకొండి అని చెప్పారు అన్నాను. లెక్కల్లో ఆవిడ గోల్డ్ మెడలిస్ట్ అని మా నాన్నగారు చెప్పారు అని చెప్పాను.

సరేలే! ఇప్పటి నుంచి ఆవిడ గురించి ఏమీ అనద్దు. అర్థం కాకపోతే అడగ మన్నారు. అంతేగా! లెక్కలు సరిగ్గా చెయ్యలేదని పనిష్మెంట్ ఇవ్వరు కదా అని సంతోషపడ్డారు అందరూ.

అలా లెక్కలు బాగా చేస్తూ, మా నాన్నగారి పేరు చెడగొట్టకుండా జాగ్రత్తగా మేనేజ్ చేస్తూ వచ్చాను. నిజానికి చెప్పాను కదా నాకు లెక్కలు బాగా వచ్చు. ఒకసారి ఒక తమాషా జరిగింది ఏమిటంటే మా సోషల్ టీచర్ సడన్‌గా ఊరు వెళ్లాల్సి వచ్చింది. అందుకోసమని ఆవిడ పెట్టవలసిన నెలవారి పరీక్ష లెక్కల పరీక్ష రోజున పెట్టి, ఆరోజు ఉండవలసిన సోషల్ క్లాసులో లెక్కల పరీక్ష పెట్టమని అడిగారట. అసలే మా కుప్పమ్మ టీచర్ స్కూల్ కి కొత్త. ఏమీ అనలేక సరే అని ఒప్పుకున్నారు. మేమందరం నిజానికి ఆరోజు సోషల్ పరీక్షకు తయారై వచ్చాము. అయితే కుప్పమ్మ టీచర్ గారు వచ్చి ఈరోజు లెక్కల పరీక్ష పెడుతున్నాను ఎందుకంటే ఇలా జరిగింది అని చెప్పారు. అయ్యో ! టీచర్ మేము ఎవ్వరం ప్రిపేర్ అవలేదు అని గొడవ చేసాము. పర్వాలేదు. మీరు ఎంతవరకు చేస్తే అంతవరకు చేయండి. నేను కూడా మిమ్మల్ని ఇబ్బంది పెట్టను. తేలికగా వుండే ప్రశ్నలే ఇస్తాను" అన్నారు.

అందరం పరీక్ష రాశాం. మర్నాడు లెక్కల క్లాస్‌లో ఆవిడ అందరికీ మార్కులు చెబుతూ, మొదట మీరందరూ క్లాప్స్ కొట్టాలి రాజ్యశ్రీకి. ఎందుకంటే అంత సడన్గా పరీక్ష పెట్టినా కూడా తనకి నూటికి నూరు మార్కులు వచ్చినాయి. చూడండి పేపర్ అని అంటూ చూపించారు అందరికీ. అందరూ చప్పట్లు కొట్టారు. నాకు చాలా సంతోషం వేసింది. అయితే దాంట్లో సగం మంది పరీక్ష ఫెయిల్ అయ్యారు. దానితో మళ్లీ నేను ప్రిన్సిపల్ గారిని అడిగి పరీక్ష పెట్టేటట్టుగా చూస్తాను. మీరు ఎవరు బాధపడకండి అని చెప్పారు.

ఇంటికెళ్లి మా నాన్నతో సంతోషంగా ఈ విషయం చెప్పాను. వెంటనే “వెరీ గుడ్ నా పేరు నిలబెట్టావు” అన్నారు.

అలాగే అన్ని పరీక్షలు అయిపోయిన తర్వాత ఆఖరికి మళ్లీ లెక్కల పరీక్ష పెట్టారు.

అంతకు ముందే కుప్పమ్మ గారు, ఈ విషయం వాళ్ళ స్టాఫ్ రూమ్‌లో డిస్కస్ చేశారట. ఇట్లా సడన్‌గా పరీక్ష పెట్టినా కూడా రాజ్యశ్రీకి వంద మార్కులు వచ్చినాయి. చాలా ఇంటలిజెంట్ స్టూడెంట్ అని చెప్పారట. అయితే ఇప్పుడు మళ్లీ పరీక్ష పెడితే ఆ అమ్మాయికి 100 మార్కులు రాకపోతే మరి తను నష్టపోతుంది కదా అన్నారట ఇతర టీచర్లు. అందుకోసం తనకి ఆప్షన్ ఇవ్వండి, రాయాలా వద్దా అని చెప్పారట.

కుప్పమ్మ టీచర్ క్లాస్‌కి రాగానే పరీక్ష పెడుతూ, నన్ను ప్రత్యేకంగా పిలిచి "నువ్వు ఎగ్జామ్ రాయాలంటే రాయి. లేదు అంటే నీకు పాత మార్కులే ఉంచుతాము నీ ఇష్టం అని చెప్పారు. నాకు ఏం చేయాలో కాసేపు అర్థం కాలేదు. ఒకవేళ ఇవాళ ఇచ్చిన లెక్కల పరీక్షలో, లెక్కలు సరిగా చేయకపోతే మార్కులు తగ్గిపోతాయి కదా అని అనుకున్నా. అయినా కూడా అందరూ పరీక్ష రాస్తుంటే నాకు కూడా రాయాలి అని అనిపించింది. అందుకే టీచర్‌తో చెప్పాను ఇవాళ కూడా నేను ఎగ్జామ్ రాస్తాను. కాకపోతే దీంట్లో తక్కువ వస్తే, పాత ఎగ్జామ్ మార్కులు వేయండి అని అడిగాను. ఆవిడ నవ్వారు. గట్టిదానివే. సరే చూద్దాంలే అలాగే అన్నారు. మళ్లీ లెక్కల పరీక్ష రాశాను. దీంట్లో కూడా 100కి 100 వచ్చినాయి నాకు. కాబట్టి ఆవిడకి ప్రాబ్లం లేకుండా అయిపోయింది. అలా నేను లెక్కల్లో స్కూల్ ఫస్ట్ రావడం ఒక మంచి ప్రైజ్ కూడా తీసుకోవడం జరిగింది.

# ఎకనామిక్స్ టీచర్

లక్ష్మి టీచరు మాకు ఎకనామిక్స్ చెప్పేవారు. చాలా బాగా చెబుతారు . ఎంత బాగా అంటే మళ్ళా మనం పుస్తకం కూడా తీసి చదవక్కర్లేదు. చాలా పెద్ద తరహాగా, డిగ్నిఫైడ్‌గా ఉండేవారు. ఆవిడ అంటే అందరికీ ఒక ఆరాధన భావం ఉండేది క్లాసులో.

ఒకసారి లక్ష్మి టీచర్‌కి ఏదో చిన్న ఆపరేషన్ ఉంది అని చెప్పి కొన్ని రోజులు సెలవు పెట్టారు. ఆ టైంలో వెంటనే ఇంకో టీచర్ దొరకక, వాళ్ళ చెల్లెలు జానకి గారిని మాకు ఎకనామిక్స్ చెప్పడానికి వేశారు, ఆవిడ కూడా B.Ed చేశారు అని. చాలా అందంగా పొడుగాటి జడతోటి చక్కగా వుండేవారు జానకీ టీచర్.

ఆవిడకి పెద్ద జడ ఉండడంతోటి మా అందరికీ చాలా చూడముచ్చటగా ఉండేది. అందుకోసమని మా స్కూలు ముందర, గులాబీ పూలు పెట్టుకొని అమ్మే ఆమె దగ్గర నుంచి, 5 పైసలు పెట్టి ఒక గులాబీ పువ్వు కొని, స్టాఫ్ రూమ్ కి వెళ్ళి గుడ్ మార్నింగ్ టీచర్ అని చెప్పి ఆ గులాబి ఇచ్చే దాన్ని. జానకి టీచర్ దాన్ని ఒక పక్క పిన్నుతో తలలో ఒక సైడ్‌కి అందంగా పెట్టుకునేది. ఇది నాకు చాలా సంతోషాన్ని ఇచ్చేది.

"రోజూ నువ్వేనా ఇచ్చేది మాకు కూడా కొంచెం ఛాన్స్ ఇవ్వు" అంటూ మా ఫ్రెండ్స్ కూడా రోజుకొకళ్ళు ఇవ్వడానికని నిర్ణయించారు. తర్వాత కొన్ని రోజులకు మా లక్ష్మి మేడం వచ్చేసారు. జానకి మేడంకి అందరం ఘనంగా వీడ్కోలు పలికాము.

జానకి టీచర్ కూడా మమ్మల్ని అందరినీ అభినందిస్తూ నేను ఇంతవరకు ఒక్కరోజు కూడా ఈ స్కూల్‌కి వచ్చిన తర్వాత గులాబీ పువ్వు పెట్టుకోకుండా లేనుర్రా. మీ అభిమానం ఆ గులాబీ గుబాళింపు లాగా నా మనసులో నిలిచిపోయింది అంటూ వీడ్కోలు తీసుకున్నారు.

మా స్కూల్లో 12వ క్లాస్ వరకు చదువు ఉంది. అంటే మాది "హెచ్ ఎస్ ఎం పి" హైయర్ సెకండరీ మల్టీపర్పస్ అన్నమాట. అప్పట్లో ఇంకా ఇంటర్ మీడియేట్ రాలేదు. 12వ క్లాస్ ఎగ్జామ్స్ పాస్ అవడం, డైరెక్ట్‌గా ఇంక కాలేజీలో చేరడం.

## ప్రత్యేక తెలంగాణ ఉద్యమం

అప్పుడే 1969 లో ప్రత్యేక తెలంగాణ కోసం యాజిటేషన్ మొదలైంది. స్కూల్ పిల్లలు దాంట్లో పార్టిసిపేట్ చేయడం ఆ రోజుల్లో లేదు. మా ప్రిన్సిపల్ చాలా స్ట్రిక్ట్‌గా ఉండడం వలన మా క్లాసులు మామూలుగానే రన్ అయ్యేవి. అయితే అనుకోకుండా ఒక రోజు, ఒక అమ్మాయి మటుకు క్లాసులో నుంచి వెళ్ళిపోయి, ఈ యాజిటేషన్ గ్రూప్‌లో మగవాళ్ళతో కలిసి పోరాటం మొదలు పెట్టింది. వాళ్లతో కలిసి మా స్కూల్‌కి వచ్చి గేట్లు పగలగొట్టి క్లాసు లోపలికి వచ్చి టీచర్‌ని, ప్రిన్సిపల్‌ని, బెదిరించి క్లాసులన్నీ ఖాళీ చేయించింది.

మా ప్రిన్సిపల్ కస్తూరి ప్రసాద్ మేడం పిల్లలు చదువులు పాడవుతాయి అని ఎంత చెప్పినా, ఆ మగ పిల్లలు వినిపించుకోలేదు. ఇలాగే ప్రతిరోజు మేము స్కూల్ బస్సు ఎక్కి రావడం, మధ్యలో ఎవరో ఆకతాయి పిల్లలు బస్సులో గాలి తీసేయడం, దాంతో మళ్ళా మేము వెనక్కి ఇంటికి వెళ్ళిపోవడం.

స్కూలుకి వెళ్లకుండా ఇంట్లో కూర్చుందాము అంటే క్లాసులు అయిపోతున్నాయేమోనన్న భయం. అప్పట్లో ఇలాగా సెల్ ఫోన్లు లేవు కదా ! అందుకోసం స్కూల్‌కి వచ్చిన తర్వాతే మాకు క్లాసులు ఉన్నాయి లేవు తెలిసేది.

అలా మాకు స్కూల్ కి వెళ్లడం తమాషా ఆట లాగా, కలలాగా అయిపోయింది. తర్వాత కొన్ని రోజులు ఇంట్లోనే ఉండిపోయాం. మా ఇంటి దగ్గరలోనే వుండే, ఎవరో ఒక ఫ్రెండ్ వెళ్లి వచ్చేది. స్కూల్ లేదని చెప్పేది. అలా రోజుకు ఒకళ్ళను పెట్టుకొని మేము మేనేజ్ చేసేవాళ్లం. సంవత్సరం అంతా ఇలాగే గడిచి పోయింది.

# మసాలా దోశ

కొన్ని రోజులకి మా ఇంటి అడ్రస్‌కి ఒక ఇన్‌లాండ్ ఉత్తరం వచ్చింది నాకెవరు రాశారు అబ్బా అని అనుకుంటూ ఆ కవర్ తీసుకున్నాను. అది మా క్లాస్ టీచర్ పుష్పా టీచర్ రాశారు. ఆవిడ ఇంగ్లీష్ చెప్పే వాళ్ళు మాకు 12 క్లాసులో ఆవిడ తమిళ ఆవిడ. ఇంకా పెళ్లి కాలేదు. వాళ్ల నాన్నగారు బాంబే నుంచి ఇక్కడికి వచ్చారు ట్రాన్స్‌ఫర్ మీద. ఇంగ్లీషు పాఠం చాలా బాగా చెప్పేవారు నేను ఎప్పుడూ క్లాస్ ఫస్ట్ వచ్చేదాన్ని కదా అందుకోసమని రిజిస్టర్‌లో చూసి నా పేరు అడ్రస్సు తీసుకుని ఒక లెటర్ రాశారు. టీచర్ నాకు లెటర్ రాయడం ఏంటి అనుకుని వుబ్బితబ్బిబ్బు అయి తెరిచి చూశాను దాంట్లో డియర్ రాజ్యశ్రీ నేను బాంబే వెళ్లిపోతున్నాను వెళ్లే ముందర ఒకసారి నిన్ను చూసి వెళ్దామని అనిపించింది నీకు చెప్పి వెళితే మళ్ల స్కూల్ తెరిచిన తర్వాత పిల్లలందరికీ చెప్తావు కదా నా బదులు తప్పకుండా ఫలాన రోజున మన స్కూల్ ఎదురకుండా ఉన్న రెస్టారెంట్‌లో కలుద్దాము. స్కూల్ మూసేశారు కదా. అందుకని సరేనా తప్పకుండా రావాలి అని ఇంగ్లీషులో రాశాడు నాకు చాలా సంతోషం అనిపించింది కానీ ఒక్కదాన్నే టీచర్‌తో వెళ్లి మాట్లాడగలుగుతానా అని ఒక భయం, ఆందోళన. అందుకే నా ఫ్రెండు రాణిని తీసుకుని ఇద్దరం కలిసి ఆ రోజు స్కూల్ ఎదురుకుండా ఉన్న రెస్టారెంట్ దగ్గరికి వెళ్ళాము. అదే సమయానికి పుష్ప టీచర్ కూడా వచ్చారు. ఆవిడకి ఇంగ్లీష్ మాత్రమే వచ్చు కాబట్టి మేము కూడా ఇంగ్లీషులోనే మాట్లాడాము. అయితే టీచర్‌తో డైరెక్ట్‌గా మాట్లాడుతుంటే కొంచెం తడబాటుగా ఉంది. ఆ రోజుల్లో ఇంత ధైర్యం లేదు.

పుష్ప టీచర్ "మనం టిఫిన్ తింటూ మాట్లాడుకుందాం సరేనా" అని అన్నారు. నాకు గుండెల్లో రాయి పడింది. నేను ఏమీ డబ్బులు తెచ్చుకోలేదు. బస్ పాస్ మాత్రమే ఉంది నా దగ్గర. మా ఫ్రెండ్ సంగతి అంతే. సరే మేడం అని అన్నాము కొంచెం భయం భయంగా. నేనే అమౌంట్ పే చేస్తాను ఫర్వాలేదు రండి అంటూ రెస్టారెంట్‌లోకి తీసుకెళ్లారు. వెళ్ళగానే మీరు ఏం తింటారు అంటూ మా ఇద్దరిని అడిగారు. మీరు ఏదంటే అదే మేడం అని అన్నాను. ముగ్గురికి మూడు మసాలా దోసెలు ఆర్డర్ చేసింది. దోసెలు వచ్చేసాయి. అయితే ఆవిడేమో చకచకా స్పూన్ తోటి, ఫోర్క్ తోటి కట్ చేసుకుని తినేస్తున్నారు. మా



స్కూల్ క్లాస్‌మేట్ రాణితో

రాణికి, నాకు కూడా ఫోర్క్‌తో తినడం ఇబ్బందిగా ఉంది. ఆవిడ ఏమన్నా అనుకుంటుం దేమో అని ఒక భయము. అసలే బాంబే ఆవిడ. స్టైల్ గా ఉన్నారు. ఈ తెలుగు వాళ్ళకి తినడం రాదేమో అనుకుంటారని ఒక భయం. దాంతో నెమ్మదిగా నేను, రాణి ఒకళ్ళ మొహాలు ఒకరు చూసుకుని, ఆవిడ పక్కకు తిరిగి ఏదో మాట్లాడుతూ ఉంటే, దబుక్కున చేత్తోటి ఒక చిన్న ముక్కని తుంపి నోట్లో పెట్టేసుకునే వాళ్ళం. తర్వాత నవులుతూ ఉండేవాళ్ళము. ఆవిడ కబుర్లు చెబుతూ మల్ల అటు ఇటు చూడంగానే, మళ్ళీ ఇంకో ముక్క తీసుకుని నోట్లో పెట్టుకునేవాళ్ళం. కొంచెం సేపటికి ఆవిడ మా అవస్థ గమనించి, "నో నో యు టేక్ విత్ యువర్ హ్యాండ్. నథింగ్ రాంగ్ ఇన్ ఇట్" అని చెప్పారు. మేము సిగ్గు పడుతూనే బతుకు జీవుడా అనుకుంటూ, మొత్తం దోసె తిన్నాము. తర్వాత కాఫీలు తాగాము. చాలా ఎక్సైటింగ్‌గా అనిపించింది.

తర్వాత ఆవిడ కొంచెంసేపు కబుర్లు చెప్పారు. మేము శ్రద్ధగా వింటూ కూర్చున్నాం. పుష్ప టీచర్ రెండు పుస్తకాలు తీసుకొచ్చి దాంట్లో తన ఆటోగ్రాఫ్ చేసి అలాగే మా ఆటోగ్రాఫ్ కూడా తీసుకుని, "బై" రాజ్యశ్రీ, రాణీ అంటూ వెళ్లిపోయారు. నాకు నిజంగా అది ఒక మధురమైన అనుభూతి. ఇన్నేళ్ళయినా కూడా, ఇప్పటిదాకా నా దగ్గర ఆ ఉత్తరం అలాగే పదిలంగా ఉంది. ఆవిడ ఆ రోజు చూపించిన ప్రేమ అభిమానం, వెళుతూ వెళుతూ నన్ను కావలించుకుని నువ్వు ఇంకా బాగా చదువుకుని పైకి రావాలి. మై బెస్ట్ విషెస్. నువ్వు ఎప్పుడు క్లాస్ ఫస్ట్ వస్తావు. నెమ్మదిగా ఉంటావు. అందుకే నువ్వంటే నాకు చాలా ఇష్టం అంటూ చెప్పి కావలించుకుని వెళ్లారు.

ఇప్పటికీ నాకు ఏదైనా హోటల్‌కి వెళ్లి దోశ తింటుంటే ఆనాటి సంఘటన గుర్తుకొచ్చి నవ్వుకుంటూ ఉంటాను. మా పిల్లలకు కూడా ఈ విషయం చెప్పి వాళ్లను కూడా నవ్వించాను. నిజంగా కొన్ని సంగతులు మనకు జీవితాంతం ఎలా మధురస్మృతులుగా ఉండిపోతాయి.

# సిపాయి చిన్నయ్య సినిమా

1969లో తెలంగాణ ఉద్యమం అప్పుడు మేము స్కూల్ బస్సులో రోజు ఎక్కడం, గాలి తీసేసి బస్సు ఆపేయడం జరుగుతూ ఉండేది. అప్పుడు మా ఫ్రెండ్స్ అందరం కూడా రోజుకు ఒకళ్ల చొప్పున బస్సులో వెళ్లి ఆ రోజు క్లాసులు అయినాయి లేదో కనుక్కుని మళ్లీ వచ్చి మాకు చెప్పేవాళ్ళు. అలా ఒకరోజు నాకు డ్యూటీ పడింది. ఆరోజు నేను మా చెల్లెలు విజయశ్రీ కలిసి స్కూల్ దాకా ఎలాగోలాగా వచ్చాము. ఒక క్లాసు నడిచింది మధ్యలో బిలబిలమంటూ అబ్బాయిలు అమ్మాయిలు అంతా వచ్చి స్కూల్ మూసి వేయాలని గొడవ చేసి బయటకు పంపించేశారు.

బయటకు వచ్చిన నాకు మా చెల్లెలికి స్కూల్ బయట పోస్టర్ మీద నాగేశ్వరరావు గారి సినిమా "సిపాయి చిన్నయ్య" బోర్డు కనపడింది అది కూడా గోల్కొండ చౌరస్తాలోని బాలాజీ థియేటర్‌లో ఉన్నది అని. మాకు అక్కినేని నాగేశ్వరావు సినిమా అంటే నిజంగా అమితమైన ఆనందంతో ఒళ్ళు తెలియదు. ఆ రోజుల్లో బాలాజీ థియేటర్‌లో సినిమా 50 పైసలు ఉండేది. రోజు అయితే మా దగ్గర నిజానికి బస్సు పాస్ తప్పితే ఏమీ ఉండేది కాదు. కానీ ఆ రోజు మా అమ్మ మాకు ఒక రూపాయి డబ్బులు ఇచ్చి కోఠిలో దిగి వచ్చేటప్పుడు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కొని మిగతా డబ్బులు తెమ్మని చెప్పింది. అప్పట్లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 25 పైసలు వుండేది. చిల్లర లేక రూపాయి ఇచ్చింది. అందుకని నా దగ్గర ఒక రూపాయి ఉంది. సరే మేము ఇద్దరం కలిసి సినిమా కెళితే చెరొక 50 పైసలు కలిసి ఒక రూపాయి ఇద్దరం సినిమా చూడచ్చు అనుకున్నాము. సినిమాకి వెళ్దాము అనుకున్నాము. ఎలాగో స్కూలు లేదు కాబట్టి ఇంటికి వెళ్లేసరికి లేట్ అయినా అమ్మకి ఏమీ భయం ఉండదు స్కూల్‌లో ఉన్నాము అనుకుంటుంది అనుకుని, గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లో ఉన్న బాలాజీ సినిమా థియేటర్‌కి వెళ్లాలంటే బస్సు ఎక్కి వెళ్లడానికి మా దగ్గర ఉన్న డబ్బులు సరిపోవు. అందుకని ఇద్దరం కలిసి నారాయణగూడ నుంచి గోల్కొండ క్రాస్‌రోడ్స్‌కి నడుచుకుంటూ వెళ్ళాము. వెళ్లి అక్కడ ఇద్దరం సినిమా టికెట్లు కొనుక్కుని సినిమా చూశాము. అక్కినేని గారి యాక్షన్ చూస్తున్నంత సేపు మా ఇద్దరికీ ఒళ్ళు పులకరింత అందులో ఒక పాట "నా జన్మభూమి ఎంతో అందమైన దేశము, నా ఇల్లు అందులో చక్కని ప్రదేశము" అన్న ఒక పాట అందులో నాగేశ్వరరావు గారి నటనకి

మాలో దేశభక్తి ఉప్పొంగి మేమిద్దరం చప్పట్లు కొట్టాం. ఎంతో సంతోషంగా, హాయిగా సినిమా చూశాము. సినిమా అయ్యేసరికి సాయంత్రం 5.30 అయింది. బయటికి వచ్చి మళ్లీ ఇద్దరం కాలి నడకన నారాయణగూడ వెళ్తే, అక్కడి నుంచి మళ్లీ మా బస్సు పాసు చెల్లుతుంది అందుకోసమని నడక మొదలుపెట్టాం.

అడ్డ దారిలో వెళితే తొందరగా వెళ్ళచ్చు అని ఇరుకు సందుల్లో నడవడం మొదలు పెట్టాము. కొంచం దూరం వెళ్లేసరికి, మా ముందర కొద్ది దూరంలో మా వశిస్టు మామయ్య కనిపించారు. అమ్మో! ఈయనకు కనపడితే, స్కూల్ ఎగ్గొట్టి ఇక్కడ తిరుగుతున్నారని నాన్నతో చెబుతారు అని భయం వేసింది. నెమ్మదిగా ఆయనకు కనపడకుండా, పక్క సందులో దూరి, ఎలాగో అలాగ నారాయణగూడ దాకా నడిచి, బస్సు ఎక్కాము. అక్కడనుంచి బస్ పాస్ వుంది. నడిచి నడిచి కాళ్ళు నెప్పులు పెడుతున్నాయి అన్న విషయం అప్పుడు తెలిసి వచ్చింది.

బస్‌లో సీట్ దొరికింది. హాయిగా కూర్చున్నాము. కోఠి దగ్గర కొచ్చేసరికి, ఎవరో ఆకతాయిలు వచ్చి బస్సులో గాలి తీసేసారు. మా ఇల్లు సైదాబాద్ కాలనీలో వుంది. అక్కడకి నడుచుకుంటూ వెళ్ళాలి.

అప్పటికే సాయంత్రం 6.30 అయింది. ఇంటి దగ్గర అమ్మ కంగారు పడుతూ వుంటుంది. కాసేపట్లో నాన్న కూడా ఆఫీస్ నుంచి వచ్చేస్తారు. ఆడపిల్లలు ఇంత లేట్‌గా ఇంటికి వస్తే, మా కన్నా ముందు అమ్మని కోపం చేస్తారు. ఎలారా దేవుడా అని ఇద్దరం బిక్క మొహాలు వేసుకుని నడుస్తూ వున్నాము. నల్గొండ క్రాస్ రోడ్ దగ్గర కొచ్చేసరికి, మా కాళ్ళు ఇక నడవలేము అని మొరాయించాయి.

అక్కడ వున్న పెట్రోల్ బంక్ దగ్గర, పెట్రోల్ పోయించుకుని ఒక కారు బయల్దేరబోతోంది. నేను గబ గబ వెళ్లి, కారు ఆపి లిఫ్ట్ ప్లీజ్ అని అడిగాను. కారులో వున్న అతను "ఏడికి పోవాలా" అని అడిగాడు.

నేను "సైదాబాద్ కాలనీ అని చెప్పాను" కాలనీ లోపటికి రాం. సైదాబాద్ మే చౌడ్ తుం బైటో" అన్నాడు. బ్రతుకు జీవుడా అనుకుంటూ కారు ఎక్కాము.

మేము హైదరాబాద్‌లో పుట్టి పెరిగినా, మాడపాటి హనుమంతరావు స్కూల్‌లో అంతా స్వచ్ఛమైన తెలుగు మాట్లాడేవారు, చెప్పేవారు. అలాగే మేము కూడా మాట్లాడే

వాళ్ళం. దానివలన మేము మాట్లాడే భాష విని, వీళ్ళు ఆంధ్రావాళ్లు అని అనుకుంటే కష్టమని మేము ఇంగ్లీషులోనే మాట్లాడాము. ఎందుకంటే రెండు రోజుల క్రితం ఒక కారులో వెళ్తున్న వాళ్లు ఆంధ్రా అని తెలుసుకుని కారుని ఆపి పైన పెట్రోల్ పోసి నిప్పు అంటించేశారు. అటువంటి సంఘటన విని అందరం కూడా భయభ్రాంతులమయ్యాం. నిజానికి మాకు ఆంధ్ర, తెలంగాణ డిఫరెన్స్ కూడా తెలీదు ఆ రోజుల్లో.

రాయలసీమలో ఒక యాస, ఆంధ్రాలో ఒక యాస, ఇక్కడ తెలంగాణలో ఒక యాస అంతే కదా! చదువుకునేందుకు మామూలుగా పుస్తకంలో ఉండే భాష అని అనుకునేవాళ్లం.

ఆ భయంతో ఆ లిఫ్ట్ ఇచ్చిన అతని దగ్గర మాట్లాడకుండా కూర్చుని, సైదాబాద్ రాగానే దిగిపోయాము థాంక్స్ అంకుల్ అని చెప్పుతూ.

మేము నోరు విప్పి మాట్లాడితే ఎక్కడ మా భాషను బట్టి ఏమన్నా చేస్తాడేమోనని కూర్చునంతసేపు భయం భయంగానే కూర్చున్నాము.

అక్కడ నుంచి మళ్లీ కాళ్ళకి బుద్ధి చెబుతూ ఇంటిదాకా నడుచుకుంటూ వెళ్ళాము ఇంటికి వెళ్లేసరికి సాయంత్రం 7:00 గంటలు అయింది. ఇంకేముంది మా అమ్మ అక్కడే ఎదురు చూస్తూ కూర్చుంది. ఏమైపోయామో ఈ యాజిటేషన్ గొడవల్లో అని చెప్పి కంగారు పడుతూ ఉంది. మేమిద్దరం పిల్లుల్లాగా "అమ్మా నాన్న వచ్చేసారా" అని అడిగాను ఇంకా లేదు. మీ నాన్న కోసం కూడా ఎదురుచూస్తున్నా! ఏమిటో ఈ బస్సులు సరిగ్గా నడవడం లేదు. ఎక్కడ ఉన్నారో ఏమో! అంటూ అమ్మ కంగారు పడిపోయింది. ఇంతకీ ఆంధ్రప్రభ పుస్తకం కొన్నారా? ఏదీ అని అడిగింది.

అప్పుడు నసుగుతూ ఇద్దరం అమ్మ కొంగు పట్టుకుని , "అమ్మా ఇవాళ కూడా స్కూల్ మూయించేసారు. బయటికి రాగానే అక్కినేని సినిమా పోస్టర్ కనపడింది. రోజూ ఇంట్లో వుండి బోర్ కొడుతోంది మాకు. అందుకే నువ్విచ్చిన రూపాయితో ఇద్దరం సినిమాకి వెళ్లి వస్తున్నాము. ప్లీజ్ కోపం చెయ్యద్దు అమ్మ. నాన్నకి చెప్పొద్దమ్మా ప్లీజ్. ఇంకొకసారి ఇలా చెయ్యమమ్మా" అంటూ అమ్మ వెనకాల బతిమిలాడుతూ తిరిగాను. మీకే మీరు ఇలాగే చెప్తారు ఎంత కంగారు పడ్డానో. సరేలే! అంత దూరం నుంచి

నడుచుకుంటూ వచ్చారా ? మొహాలు చూడు ఎలా వాడి పోయినాయో! బట్టలు మార్చుకుని, కాళ్ళూ చేతులూ కడుక్కుని రండి. అన్నం తిందురుగాని అంది.

అమ్మ ఎంత కోపం చేస్తుందో, ఏమంటుందో అని బిక్కు బిక్కుమంటూన్న, నాకూ, చెల్లికి ప్రాణం లేచి వచ్చినట్టయింది. అలసట అంతా పోయి, అమ్మ పెట్టిన వేడి వేడి అన్నం తిని, సినిమా కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరం హాయిగా నిద్ర పోయాము.



**అక్కినేని నాగేశ్వరరావు గారితో అక్కాచెల్లెళ్ళం.**
**ఎడమ నుండి కుడికి పెద్దక్క జయశ్రీ, చెల్లెలు విజయశ్రీ, రాజ్యశ్రీ,**
**చిన్నక్క సులోచన, చెల్లెలు లత**

# "పానీ ఆరే భాగో"

తెలంగాణా ఉద్యమం రోజుల్లో  మా కాలనీలో ఫ్రెండ్స్ రోజుకొకళ్ళం వంతులవారీగా స్కూల్‌కి వెళ్లి క్లాసులు జరుగుతున్నాయో లేదో తెలుసుకుని వచ్చేవాళ్ళం.

అలా ఒక రోజు మా ఫ్రెండ్ స్కూల్‌కి వెళ్లి, మా ఇంటికి వచ్చి, ఇవాళ ప్రిన్సిపల్ మేడం "క్లాసులు ఎప్పుడైనా మొదలవ వచ్చు. కాబట్టి అందరూ టైమ్ వృధా చేయకుండా, పరీక్షలకి తయారవండి" అని చెప్పారు. కాబట్టి మన పాఠాలు మనమే చదువుకుని, పరీక్షలు రాయాలి. చాలా కష్టం. అయినా తప్పదు కదా! అంటూ విషయం చెప్పి వెళ్ళింది.  ఆ విషయమే అమ్మకీ, నాన్నకీ  చెప్పాము.

ఇంకేముందీ! మర్నాటి నుంచి, నాన్న ఆఫీసుకి వెళ్తూ "మీరందరూ క్లాస్ పాఠాలు చదువుకోండి. అర్థం కానివి ఏమన్నా వుంటే సాయంత్రం నేను వచ్చిన చెబుతాను. ఎలాగూ ఇంట్లోనే ఉంటున్నారు కదా! అమ్మకి పనిలో సాయం చేయండి" అంటూ రోజూ ఏమేమి పాఠాలు చదవాలో టైమ్ టేబుల్ వేసి వెళ్ళేవారు.

మేము 4 గురు అక్క చెళ్ళల్లం,  మాకు ఇద్దరు తమ్ముళ్ళు. ఆరుగురం ఇంట్లో వుండి, కాసేపు చదువు, కాసేపు కబుర్లు, క్యారమ్ బోర్డ్, అష్టా చెమ్మా ఆటలు, పోట్లాటలు, సముదాయింపులు. ఇలా ఇల్లంతా సందడిగా ఉండేది.

అప్పట్లో టీవీ లేదు. రేడియో మాత్రమే వుండేది. గోడకు ఒక చెక్క ఫ్రేమ్ వుండేది. దాని మీద రేడియో. దాని పైన దుమ్ము పడకుండా లేసుతో అల్లిన తెల్ల కవర్, వూర్లో వార్తలన్నీ చెబుతూ, అందంగా హుందాగా వుండేది ఆ రేడియో. సాయంకాలం వివిధ భారతిలో "మీరు కోరిన పాటలు" ప్రోగ్రాం వచ్చేది. ఒక రోజు సాయంత్రం పాటలు వింటూ, ఆరుగురం, ఆ పాటల గురించి చర్చించుకుంటూ బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా వున్నాము.

ఇంతకీ బయట తలుపు చప్పుడు అయింది. ఎవరా అని తలుపు తీసాము. మా కాలనీలో వుండే నాన్నగారి ఆఫీస్ ఫ్రెండ్ రామారావు గారు వచ్చారు. ఆయన మొదటినుంచీ చాలా కంగారు మనిషని నాన్న చెబుతూ వుండేవారు. ఆయన మమ్మల్ని, మా వాలకం

చూసి చాలా ఆశ్చర్యంగా “మీకేమీ తెలియదా? అని అడిగారు. “ఏ విషయం ఆండీ” అని అడిగాము. “మీ అమ్మ గారిని పిలవండి. విషయం చెబుతాను” అన్నారు. ఆయన మాటలు వినపడి అమ్మ వంటింట్లోంచి వచ్చింది.

వెంటనే రామారావు గారు “ అమ్మా మీరు రేడియోలో వార్తలు వినడం లేదా? బయట చాలా గోల గోలగా వుంది” లేదండీ. పిల్లలు ఏవో పాటలు వింటున్నారు. ఏమైంది” అని అడిగింది అమ్మ? “మరేమీ లేదండీ! నేనూ మీ వారూ ఆఫీస్ అవగానే బస్సు ఎక్కాము. చాదర్ ఘాట్ బ్రిడ్జి దగ్గరకు వచ్చేసరికి, రోడ్డు నిండా జనం వురుకులు పరుగులు పెడుతున్నారు. నేను కిందికి దిగాను. మీ వారు తరువాత నాకు కనపడలేదు అంటూ మొదలెట్టారు. ఊపిరి బిగపట్టి వింటున్నాము. నాన్నగారికి ఏమైందోనని మా అందరికీ చాలా కంగారుగా వుంది.

విషయం ఏమిటంటే మూసీ నదికి వరదలు వచ్చినాయి, ఇళ్లు మునిగిపోతాయి అంటూ జనం “పానీ ఆరే భాగో భాగో” అంటూ భయంతో జనం పరుగులు పెడుతున్నారు. నేనూ , మీ ఆయనా కిందకి దిగాము. ఆ జనంలో ఒకటే తొక్కిసలాట. దిగిన తరువాత ఆయన నాకు కనపడలేదు. నేను అడ్డ దారిన నడుచుకుంటూ వచ్చేసాను. షాపులన్నీ లూటీ చేస్తున్నారు కొందరు. చాలా మంది విలువైన వస్తువులు, వెండి బంగారం మూట కట్టుకుని, ఇంటి డాబా పైన ఎక్కి కూర్చున్నారు. ఇవన్నీ రేడియోలో చెబుతున్నారు. మీ వారు ఇంకా రాలేదని, మీరు కంగారు పడతారేమోనని, ఈ విషయం చెప్పడానికి వచ్చాను. ఆయన కూడా నెమ్మదిగా వస్తారు. కంగారు పడకండి అని గడ గడా చెప్పి సెలవు తీసుకున్నారు.

ఇంకేముందీ! అప్పటిదాకా ఆడుతూ పాడుతూ వున్న మేము కంగారు పడుతూ, రేడియోలో వార్తలు పెట్టాము. రేడియోలో చెబుతున్నారు ఎవ్వరూ కంగారు పడకండి.

గండిపేట నుంచి ప్రవాహం ఎక్కువగా వుంటుంది. మూసీ నదిలోకి నీళ్ళు వదిలారు. చాకలి వాళ్ళు బట్టలు వుతకడానికి వెళ్లకండి అని ప్రభుత్వం వారు అన్నౌన్స్ చేశారు. అది సరిగ్గా అర్థం చేసుకోక, మూసీలోకి వరదలు వస్తున్నాయని భయపడి పరుగులు పెడుతున్నారు. వరదలు రాలేదు. కానీ కొంతమంది పుకార్లు పుట్టించి, ప్రజలను

భయ భ్రాంతులు చేస్తున్నారు. ఇదే అదునుగా అసాంఘిక శక్తులు కొందరు, షాపులు లూటీ చేస్తున్నారు. కొంత మంది వ్యాపారులు బతికుంటే బలుసాకు తిని బతకచ్చు అనుకుంటూ, షాపులు అలాగే వొదిలేసి ఇంటికి పరుగులు తీస్తున్నారు. ఇళ్ళల్లో వుండే వాళ్ళు, విలువైన బంగారం, వెండి వస్తువులు మూట కట్టుకుని ఇంటి డాబా మీదకి, ఎత్తైన ప్రదేశాలకు వెళ్లి కూర్చున్నారు. రోడ్ల మీద కూరగాయలు అమ్ముకునేవాళ్ళు, అన్నీ అక్కడే వదిలేసి పరుగులు పెడుతున్నారు. దీనితో రోడ్లన్నీ జనాలతో క్రిక్కిరిసి పోయి, ట్రాఫిక్ జామ్ అయింది. బస్సులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి.

ఇవన్నీ ఒట్టి పుకార్లు. ఎవరి ఇళ్ళల్లో వాళ్ళు వుండండి అంటూ విశదంగా ప్రజలకి చెబుతున్నారు. విన్న వెంటనే మేము బయటికి వెళ్ళి చూస్తే, మా పక్కింటి వాళ్ళు, ఎదురింటి వాళ్ళు ఎవరూ లేరు. అందరూ తాళాలు వేసుకుని మా ఇంటి దగ్గరలో వున్న గుట్ట మీదకు వెళ్లిపోయారు. కాలనీ అంతా నిశ్శబ్దంగా వుంది.

కాలనీ మొత్తానికి మేము మాత్రమే ఇంట్లో వున్నాము. భలే ఆశ్చర్యం, భయం కూడా వేసింది. అదేమిటో మేము ఇలా మా ప్రపంచంలో వుండి పోయి , బయట పరిస్థితి గమనించలేదు. మళ్లీ అనుకున్నాము పోనీలే, మనకి భయం లేకుండా వున్నాము అని నవ్వుకుంటూ ఊపిరి పీల్చుకున్నాం.

రాత్రి 8 గంటలు అయింది. మా నాన్నగారు ఇంకా ఇంటికి రాలేదు. నాన్నగారి స్నేహితుడు వచ్చి చెప్పబట్టి, ఆయన గురించి కంగారు పడలేదు కానీ , కొంచం టెన్షన్‌గా నాన్న కోసం ఎదురు చూస్తూ గుమ్మంలోనే కూర్చున్నాము.

రాత్రి 9 గంటలకు అలిసిపోయి నడుచుకుంటూ ఇంటికి వచ్చారు. వస్తూనే మా గురించి ఆదుర్దాగా అడిగారు మీరేమీ కంగారు పడలేదు కదా అంటూ. లేదు కానీ మీ ఫ్రెండ్ అప్పుడే వచ్చేశారు. ఎంత నడుచుకుంటూ వస్తే మాత్రం ఇంత లేట్ గా ఇంటికి వచ్చారు అంటూ అమ్మ కంగారుగా అడిగింది. చెబుతాను. ముందర అందరం భోజనాలు చేసి, మాట్లాడుకుందాం అన్నారు.

భోజనాలు చేసిన తరువాత, నాన్న చుట్టూతా కూచుని , “చెప్పండి నాన్నా. అసలు బయట ఏమి జరిగిందో మాకు తెలియదు” అని అడిగాము.

"నేను, నా ఫ్రెండ్ రామారావు ఆఫీస్ అవగానే మన కాలనీ బస్ ఎక్కాము. చాధర్ ఘాట్ బ్రిడ్జి దగ్గర ట్రాఫిక్ జామ్ అయి, డ్రైవర్ బస్ ఇంక నడవదు అంటూ బస్ దిగేసాడు. ఏమి జరిగిందా అని అందరం బస్ దిగాము. బ్రిడ్జి కింద కోలాహలంగా వుంది. ఏమిటి అని చూస్తే, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు లౌడ్ స్పీకర్లులో, గండిపేట నుంచి మూసీ నదిలోకి, నీళ్ళు వదిలారు. ఎవరూ నదిలోకి దిగద్దు. రజకులు అందరూ, పైకి వచ్చేయండి అంటూ చెబుతున్నారు. అందులో కొందరికి ఆ విషయం సరిగ్గా అర్థం కాక, మూసీకి వరద వచ్చింది అనుకుని, "పానీ ఆరే బాగో" అని గట్టిగా అరుస్తూ పరుగెత్తడం మొదలు పెట్టారు. వాళ్ళని చూసి, అందరూ పరుగులు పెడుతూ రోడ్ల మీద వచ్చేశారు. దానితో ట్రాఫిక్ జామ్. అందరికీ కంగారు.

నేను దగ్గర వుండి ఇదంతా చూసాను కదా. అందుకని, అందరికీ భయ పడకండి, వరదలు రావట్లేదు. ఇవన్నీ పుకార్లు. నేను అక్కడ నుంచే వస్తున్నాను అని చెప్పుకుంటూ, అందరికీ ధైర్యం చెబుతూ, నడుచుకుంటూ వచ్చేసరికి ఇంత టైమ్ అయింది" అని చెప్పారు. తరువాత మమ్మల్ని చూసి "మీరేమీ కంగారు పడలేదు కదా" అంటూ అడిగారు. మేము నవ్వుకుంటూ జరిగిందంతా ఒకళ్ళ తరువాత ఒకళ్ళు పోటీలు పడుతూ చెప్పాము. నాన్న కూడా నవ్వుతూ "సరే, బాగా రాత్రి అయింది. ఇంక పడుకోండి" అంటూ మంచం మీద వాలారు. ఇప్పటికీ ఛాదర్ ఘాట్ బ్రిడ్జి మీదుగా వెళ్తుంటే ఆనాటి "పానీ ఆరే బాగో" సంఘటన గుర్తుకొస్తుంది.



**నాన్నగారు మహాకాళి వెంకటరావు, అమ్మ శ్రీమతి ప్రభావతి, పెద్దక్క జయశ్రీ, చిన్నక్క సులోచన, చెల్లెలు విజయశ్రీ, పెద్ద తమ్ముడు శేషతల్పసాయి, చిన్న తమ్ముడు రామమోహనరావులతో రచయిత్రి**

# క్లాసులు డుమ్మా కొట్టి...

మా స్కూల్‌కి దగ్గరలో నా క్లాస్‌మేట్స్ వనజా, రాజ్యలక్ష్మి వుండేవారు. వనజ వాళ్లు ఇప్పుడున్న శాంతి సినిమా హాలు దగ్గర సందులో వుండేవారు. అంటే నారాయణగూడ YMCA దగ్గర మా మాడపాటి హనుమతరావు స్కూల్‌కి చాలా దగ్గర. అలాగే రాజ్యలక్ష్మి వాళ్లు నారాయణగూడా దీపక్ సినిమా హాలు వెనక వీధిలో వుండేవాళ్లు. అలాగే మా మావయ్య కూతురు శోభాలక్ష్మి కూడా నా క్లాసుమేట్ వాళ్లు. చిక్కడపల్లిలో వుండేవాళ్లు.

ఉద్యమం రోజులో క్లాసులు మధ్యలో ఆపేసి ఇళ్లకు పంపించినప్పుడు, దగ్గరలో వున్న రాజ్యలక్ష్మి ఇంటికి ఒకసారి, వనజ ఇంటికి ఒకసారి వెళ్లి కూచుని కబుర్లు చెప్పుకునే వాళ్లం. రాజ్యలక్ష్మికి తల్లి చిన్నప్పుడే కాలం చేసింది. అందుకని వాళ్ల ఇంటికి వెళితే, తనే 'టీ' పెట్టి ఇచ్చేది. వనజ వాళ్లింటికి వెడితే వాళ్ళ అమ్మ జీడిపప్పు వేసి కమ్మగా వుప్మా చేసి పెట్టేది. వీళ్ల ఇళ్ళు స్కూల్‌కి దగ్గరగా వుండేవి, కాబట్టి ఎక్కువగా వాళ్లింటికి వెళ్లేవాళ్లం. ఒక్కొక్కసారి మేము ముగ్గురం కలిసి శోభాలక్ష్మి వాళ్లింటికి వెళ్లేవాళ్లం. అక్కడ మా సుందరత్తయ్య, మాతో చాలా ఆప్యాయంగా మాట్లాడుతూ, సరదాగా వుండేది.

ఆవిడంటే మా కుటుంబ సభ్యులందరికి చాలా ఇష్టం. మేము వివేక్‌నగర్‌లో వున్నప్పుడు మా అమ్మా, సుందరత్తయ్య, మా సుశీల పిన్ని ప్రాణ స్నేహితులా వుండేవాళ్లు, ఇప్పుడు మా అమ్మ కాలం చేసింది. కానీ, సుందరత్తయ్య, సుశీల పిన్న 90 ఏళ్ల వయసులో కూడా, ఆరోగ్యంగా వారి పనులు వారు చేసుకుంటూ, బంధువులందరితో అప్యాయంగా మాట్లాడుతూ వుంటారు.

ప్రస్తుతం స్కూల్ రోజుల్లోకెడితే ఒక రోజు బస్ దిగి స్కూల్‌కి వెడుతుంటే, రోడ్డు మీద అక్కినేని గారి అదృష్టవంతులు సినిమా బోర్డు కనిపించింది. అందులో అక్కినేనికి జంటగా జయలలిత నటించింది. ఆ పోస్టరు చూడగానే, ఇవాళ క్లాసులు లేకపోతే బాగుండు, మార్నింగ్ షో సినిమాకి వెళ్లవచ్చు అనిపించింది. ప్రార్థన అయి, క్లాస్ రూముల్లో కెళుతుండగా, అందరం గుసగుసగా ఎలాగైనా ఈ సినిమా చూడాలి అనుకుని ప్లాన్ చేసుకున్నాం. రెండు క్లాసులు అయినాయి. అప్పటికి టైమ్ ఉదయం 9.30 అయింది. 11 గంటలకు మార్నింగ్ షో శాంతి థియేటర్‌లో మా ఎవ్వరి దగ్గర తగినంత డబ్బులు

లేవు. అప్పుడు టిక్కెటు రూ. 1.30 పైసలు హాలు మధ్యలో కూర్చోపెట్టే వాళ్లు. రూ. 1.80 పైసలు హైక్లాసు, వెనక సీట్లలో కుషన్ కుర్చీలు వుండేవి. ఆ రోజు రెండు క్లాసులు అవ్వగానే వెళ్లి, నేను శోభాలక్ష్మిని తీసుకొని ఎక్కడలేని ధైర్యం తెచ్చుకుని, స్టాఫ్ రూమ్‌లో క్లాసు టీచర్ దగ్గరకెళ్లి, టీచర్ ఈ రోజు మా ఇంట్లో పూజ వుంది. స్కూల్ మొత్తానికి మానెయ్యడం ఎందుకని, మీతో చెప్పి, పర్మిషన్ తీసుకుని వెల్దామని వచ్చాను" అన్నాను. ఆవిడ నిజమే చెప్తున్నానా లేదా అన్నట్టు నా మొహాల వంక పరిశీలనగా చూసి, సరే వెళ్లు, క్లాసులో బాగా చదువుతావు కాబట్టి పర్మిషన్ ఇస్తున్నాను అన్నారు. తరువాత శోభ నాకు కూడా పర్మిషన్ కావాలి మేడమ్ అని అడిగింది. "అదేమిటి రాజ్యశ్రీకి వాళ్లింట్లో పూజ వుంది కాబట్టి వెళ్లమన్నాను. నీకెందుకు? అని అడిగారు. "మేము వాళ్లూ చుట్టాలమే మేడమ్. శోభ మా మామయ్య కూతురు. అందుకోసం పూజకి తను కూడా రావాలి కదా! మేడమ్ ప్లీజ్ మేడమ్ అంటూ ఇద్దరం కోరస్‌గా అడిగాము.

"పరీక్షలు దగ్గరకి వస్తున్నాయి. పాఠాలు మిస్ చేస్తే ర్యాంకులు రావడం కష్టం. ఈ సారి మీకు పబ్లిక్ పరీక్షలు కదా, ఇవాల్టికి వెళ్లండి. తక్కిన క్లాసుల్లో పాఠాలు, మీ ఫ్రెండ్స్‌ని అడిగి తెలుసుకోండి" అంటూ హెచ్చరిస్తూ పర్మిషన్ ఇచ్చారు. ఎక్కడ పర్మిషన్ ఇవ్వనంటారో అని బితుకుబితుకుమంటున్న మాకు గాల్లో ఎగిరినంత సంతోషం వేసింది. "సరే టీచర్. బాలా థాంక్స్ టీచర్! అంటూ క్లాసులోకి వచ్చాము. మా అదృష్టం కొద్దీ మూడో క్లాసు, 4వ క్లాసులు కుకరీ / లాండ్రీ క్లాసులు. తరువాత లంచ్ బ్రేక్. ఈ సారి మా గ్రూప్‌కి 'లాండ్రీ' వచ్చింది. అంటే ఏదో ఒకటి తుడిపించడమో, బట్టలు శుభ్రంచేసే పద్ధతులు నేర్పిస్తారు. ఈ లాండ్రీ క్లాసు అంటే అందరికీ విసుగ్గా వుండేది. అందుకని ఆ క్లాసులకి వెళ్లకపోయినా ఫరవాలేదు అన్న ధీమా మాకు.

సరే మేమిద్దరం పర్మిషన్ తీసుకున్నాము. ఇంక వనజ, రాజ్యలక్ష్మి తీసుకోవాలి. మళ్లీ క్లాసు టీచర్ దగ్గరకి వెళ్తే అనుమానం వస్తుంది కదా అనీ, నేనూ, శోభా వెళ్లి స్కూల్ దగ్గరలోనే వున్న 'శాంతి' థియేటర్‌లో రూ1.30 లైన్‌లో నుంచుట్టాము. ఈ లోపల మీరిద్దరూ లాండ్రీ క్లాసు మొదలవగానే, ఏదో ఒంక చెప్పి వచ్చేయాలి అని ప్లాన్ చేసుకున్నాము. వనజ లాండ్రీ క్లాసు మొదలవగానే టీచర్ బాగా కడుపు నొస్తుంది ఇంటికి వెళ్తాను అని, రాజ్యలక్ష్మి "మా అమ్మ అబ్దికం వుంది వెళ్లాలి" అని క్లాసు టీచర్

దగ్గర పర్మిషన్ తీసుకున్నారు. రాజ్యలక్ష్మి వాళ్ల అమ్మ తన చిన్నప్పడే చనిపోయారు. కాబట్టి అబద్ధం చెప్పినట్టు కాదని కూడబలుక్కున అనుకున్నాము.

మేము వెళ్లిన కాసేపటికి వాళ్లిద్దరూ కూడా వచ్చారు. అప్పటికి ఇంకా పది గంటలే అయింది. 10.45కి టికెట్స్ ఇవ్వడం మొదలుపెడతారు. అప్పటి దాక గుర్తుకు రాలేదు మా దగ్గర అసలు సరిపోయేంత డబ్బులు వున్నాయో లేదో అని. అందరి దగ్గర వున్న చిల్లర డబ్బులు లెక్కపెడితే రెండు రూపాయల పది పైసలు వున్నాయి. మా నలుగిరికీ టికెట్స్‌కి ఇంకా 3 రూపాయల పది పైసలు కావాలి. వనజా వాళ్ల ఇల్లు పక్కన కాబట్టి, ఇంటికి వెళ్లి వాళ్ళ అమ్మని అడిగి తీసుకువస్తాను అంది. సరే మళ్లీ తను ఇంటికి వెళ్లి వచ్చేసరికి 'క్యూ'లో రానివ్వరని, ముందే 'క్యూలో' అటు చివర వాళ్లకి, ఇటూ చివర వాళ్లకి చెప్పాము. ఈ అమ్మాయి లైన్‌లో వుంది. ఇప్పుడే టాయ్‌లెట్‌కి వెళ్లి వస్తుందని, సరేనని ఒప్పుకున్నారు వాళ్లు.

వనజ ఇంటికి వెళ్లి, వాళ్ల అమ్మకి నచ్చచెప్పి డబ్బులు తెచ్చే లోపల టిక్కెట్లు ఇవ్వడం మొదలు పెట్టారు. మేము కౌంటర్ దగ్గరకి వెళ్లేసరికి తను వస్తుందో రాదో అని కంగారు పడుతూ లైన్‌లో కొద్దికొద్దిగా ముందుకు జరుగుతున్నాము. సరిగ్గా కౌంటర్ దగ్గర చేరే టైమ్‌కి పరుగులు పెడుతూ వనజ వచ్చి క్రిక్కిరిసిన లైన్‌లో దూరుతోంది. ఇంతలో పోలీస్ వచ్చి ఇప్పుడొచ్చి లైన్‌లో ఎట్లా దూరుతావు. వెనక్కి వెళ్లి లైన్‌లో రా అని వనజని లాగేస్తున్నాడు. మేమందరం బిక్కమొహాలు వేసుకుని, విషయమంతా పోలీసుకి చెప్పి బతిమిలాడాము. మా వెనక వాళ్లచేత కూడా సాక్ష్యం చెప్పించాము. సరే అని వదిలేసాడు ఆ పోలీసు. టికెట్ కౌంటర్‌లో చెయ్యి పెట్టి ఒక్కొక్కరం టికెట్లు తీసుకునే సరికి, అప్పటిదాకా పడిన ఆరాటం తగ్గి, ఆ స్థానంలో ఏదో ఫస్ట్ ప్రైజ్ గెలుచుకున్నంత సంతోషం అందరి ముఖాల్లో. సినిమా చూస్తున్నంత సేపూ ఒళ్ళు మైమరచిన ఆనందం.

ఇప్పుడు సినిమా టికెట్స్ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని, ఏ.సి. కార్‌లో ఐమాక్స్ థియేటర్‌లో సినిమా చూసినా, లైన్‌లో నిలబడి, టెన్షన్‌తో, జనాల పోట్లాటల మధ్య, టికెట్ తీసుకుని సినిమా చూసిన ఆనాటి ఆ థ్రిల్, ఆ ఆనందం ముందు సరితూగలేవు.



మాడపాటి హనుమంతరావు హైస్కూల్ క్లాస్‌మేట్
వనజా, రాజ్యశ్రీ, రాజ్యలక్ష్మి



మాడపాటి హనుమంతరావు హైస్కూల్ క్లాస్‌మేట్
రాజ్యశ్రీ, శోభాలక్ష్మి

# హిస్టరీ పరీక్ష

కొన్ని రోజులు ఇలాగే స్కూల్‌కి రావడం, ఎవరన్నా వచ్చి గొడవ చేస్తే స్కూల్ మూసి వేయడం వేయడం నడిచింది. పిల్లలకి ఏడాది పరీక్షలు కానివ్వమని లేకపోతే ఒక సంవత్సరం వృధా అవుతుందని స్కూల్ యాజమాన్యాలు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. ప్రభుత్వం కూడా అంగీకరించి, పోలీస్ ప్రొటెక్షన్‌తో పరీక్షలు కండక్ట్ చేశారు. మాది 12వ క్లాసు, పబ్లిక్ పరీక్షలు, మాకు మొత్తం 10 పేపర్లు. ఇన్ని రోజులూ ఉద్యమం పుణ్యమా అని హాయిగా ఆడుతూ పాడుతూ గడిపాము. ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చారు. అందరు కష్టపడి చదువుకుని పరీక్షలకి రెడీ అయ్యాము. వేరే చిన్న క్లాసుల వాళ్లకి 7 పేపర్స్, తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సైన్స్, లెక్కలు, సోషల్, హిస్టరీల్లో పరీక్షలు అయిపోయాయి. మాకు ఇంకా 3 పేపర్స్, ఎకనామిక్స్-1, ఎకనామిక్స్-2 మరియు హిస్టరి పరీక్షలు మిగిలి వున్నాయి.

ఎకనామిక్స్ 1, 2 పేపర్లలో పరీక్షలు సవ్యంగా జరిగాయి. ఇంక రేపు ఒక్క రోజు హిస్టరీ పరీక్ష వుంది అనగా, మళ్ళీ అల్లర్లు మొదలయ్యాయి. పోలీసలందరినీ బందోబస్తుకి తరలించారు. దానితో స్కూల్స్ దగ్గర పోలీసు సిబ్బంది లేరు. రేపటితో పరీక్షలు అయిపోయి హాయిగా వుంటామని అనందంగా వున్నాము. మర్నాడు హిస్టరీ పరీక్ష రాద్దామని స్కూల్‌కి వచ్చాము. ఇంతలోనే వుద్యమకారులు విజృంభించి. స్కూల్ మూయించారు. ప్రిన్సిపల్ మేడమ్ పిల్లల ఫ్యూచర్ పాడావుతుంది, ఈ ఒక్క పరీక్ష రాయనివ్వండి. రేపటి నుంచి బడి మూసేస్తాము. అని ఎంత బతిమిలాడినా, వాళ్లు వూరుకోలేదు. ప్రిన్సిపల్ రూములో, కుర్చీలు టేబుళ్లు విరగ్గొట్టి, ఆవిడ కూర్చునే కుర్చీలో కూర్చుని, బయటకి పో. “మేమే స్కూల్ బంద్ చేసి పోతాం” అంటూ ఆవిడకే హుకుం జారీ చేశారు. మేమందరం ఒణికిపోయాం ఆవిడ వంకా, వాళ్ల వంక భయం భయంగా చూస్తు నిల్చున్నాము. స్కూల్ మొత్తాన్ని ఒక్క చూపుతో గడగడలాడించే ప్రిన్సిపల్ మేడమ్ మౌనంగా, నిస్సహాయంగా బయటికి నడిచారు. ఆవిడ వెనకాల మేమందరం బయటికి వచ్చి, ఆవిడ చుట్టూ చేరాము. “మేడమ్! మళ్లీ హిస్టరీ పరీక్ష ఎప్పుడు పెడతారు” అని అడిగాము. “నేనేమీ చెప్పలేనర్రా. రోజూ రేడియోలో వార్తలు వింటూ వుండండి. ఎప్పుడు వుంటుందో అప్పుడు రండి ప్రస్తుతం నేను కూడా ఏమీ చేయలేని పరిస్థితి” అన్నారు.

చేసేదేమీ లేక అందరం దిగాలు మొహాలు వేసుకుని బయటకి వచ్చేసరికి ఒక్క బస్సు కానీ రిక్షా కానీ లేవు. వుసూరుమంటూ నడుచుకుంటూ ఇళ్లకి చేరుకున్నాము.

అప్పటి నుంచీ, ఆ హిస్టరీ పరీక్ష ఎప్పుడు పెడతారో అని, రోజూ ఒకసారి పాఠాలన్నీ చదువుకోవడం, రేడియోలో వార్త కోసం చెవులు రిక్కించుకుని ఎదురుచూడటం దినచర్యగా మారిపోయింది. నెల రోజులయింది అతీగతీలేదు. మళ్లీ ఫ్రెండ్స్ ఒకళ్ల ఇంటికి ఒకళ్లం వెళ్లి, పరీక్ష పెట్టలేదు కదా! అని కన్ఫర్మ్ చేసుకోవడం, నీకు తెలిస్తే నాకు చెప్పు, నాకు తెలిస్తే నీకు చెబుతా అనుకుంటూ ప్రామిస్‌లు చేసుకుంటూ గడిపాము.

ప్రతిరోజూ కలలోకి, హిస్టరీ పరీక్ష పెట్టేసినట్టూ, నాకు తెలియక పరీక్షకి వెళ్లనట్టూ, మొత్తం ఏడారి చదువంతా వృధా అయినట్టూ వచ్చేది. ఇలా రెండు నెలలు గడిచిన తరువాత, అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీగారు తెలంగాణకు ఇచిన ప్రత్యేక రాయితీల వల్ల, వుద్యమం చల్లారింది.

అప్పుడు మళ్లీ స్కూళ్లు, కాలేజీలు తెరిచి ఆగిపోయిన పరీక్షలు పెట్టారు. అలా రెండు నెలలు ఆగిన మా 'హిస్టరీ ఎగ్జామ్' ఎట్టకేలకు నిర్వహించారు. పరీక్ష రాసి వచ్చి హమ్మయ్య పరీక్షలన్నీ అయిపోయాయి. ఇంక రిజల్ట్స్ కోసం ఎదురు చూస్తూ కూచోవాలి అనుకుంటా స్నేహితులందరం తరువాత ఏ కాలేజీలో చేరాలి అని చర్చించుకుని ఇళ్లకు చేరాము . అప్పట్లో మార్కులని బట్టీ కాలేజీలో సీట్లు వచ్చేవి. ఇప్పటిలా మళ్లీ 'ఎమ్‌సెట్' లాంటి ఎగ్జామ్స్ లేవు.

నెల రోజుల తరువాత రిజల్ట్స్ వచ్చాయి. వస్తాయని తెలిసి పొద్దున్నే, పేపర్ వేసే అబ్బాయి కోసం గుమ్మంలో పడిగాపులు కాసి, వాడు రాగానే చేతిలోంచి పేపర్ లాక్కున్నంత పని చేశాను. పరిగెత్తుకుంటూ మా చిన్నక్క చేతికిచ్చాను. చాలా టెన్షన్ పడుతూ "ఏదీ నీ హాల్ టికెట్టు" అని అడిగేసరికి, నాలిక్కరుచుకుని, గబగబా పుస్తకాల అలమరలోంచి వెతికి పట్టుకొచ్చాను. మా చిన్నక్క సులోచన నా హాల్‌టికెట్ నంబరు తీసుకుని, ముందర పాస్ క్లాస్‌లో తరువాత థర్డ్ క్లాస్‌లో, తరువాత సెకండ్ క్లాస్‌లో చూసింది. ఎక్కడా నంబరు కనపలేదు. ఇంక నా మొహం దుఃఖంతో రంగులు మారుతోంది.

ఇంతలో మా నాన్న వచ్చి, ఏదీ పేపరు ఇటు ఇవ్వండీ అంటూ చూసి "వెరీ గుడ్ నువ్వు ఫస్ట్ క్లాసులో పాస్ అయ్యావు. నా పేరు నిలబెట్టావు అంటూ వుంటే, ఇది కలా నిజమా అని ఆశ్చర్యంగా చూస్తున్నాను. మా అమ్మ వచ్చి చిన్నక్కతో, దాని నంబరు ఫస్ట్ క్లాసులో చూడకుండా, థర్డ్‌క్లాస్‌లో చూసి, దాన్ని భయపెట్టావు. అది బాగా చదువుతుందని తెలుసుగా. అంటూ అక్కని కేకలేసింది."

అందుకేగా నేను మొదటే ఫస్ట్ క్లాసులో చూశాను. నా కూతురి విషయం నాకు తెలుసు అంటూ నాన్న గొప్పగా చెబుతుంటే ఎంత సంతోషమో! నాకు.

ఫ్రెండ్స్ అందరం కలిసి స్కూల్‌కి వెళ్లాము. టీచర్స్‌ని అందరినీ కలుద్దాము, ఇదే ఆఖరిసారి కదా స్కూల్‌కి రావడం అని. ఎవరు సెకండ్ క్లాస్‌లో పాస్ అయ్యారో, ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యారో అని పలకరించుకుంటూ.

నేను, వనజ, రాజ్యలక్ష్మి, శోభాలక్ష్మి, రాణి అందరం ఒకరినొకరు కౌగిలించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నాము. మాది పబ్లిక్ పరీక్ష కదా! అందుకని ప్రిన్సిపల్ కస్తూరీప్రసాద్ మేడమ్ ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా మా స్కూల్ 12వ పబ్లిక్ పరీక్షలు వంద శాతం ఉత్తీర్ణత సాధించిందని ప్రకటించారు. అందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు. తరువాత పబ్లిక్ పరీక్షలో ఎంతమంది స్కూల్‌లో ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యారో చెప్పి అందరినీ అభినందించారు. ఆఖరుగా సైన్స్ గ్రూప్  వచ్చిన 4 పేర్లు చదివి అందరి చేత చప్పట్లు కొట్టించారు. తరువాత ఆర్ట్స్ గ్రూప్‌లో ఒక ఒకే ఫస్ట్ క్లాస్ వచ్చింది. అదే రాజ్యశ్రీకి, అంతేకాదు  రాజ్యశ్రీ ఆర్ట్స్ గ్రూప్‌లో మన స్టేట్ ఫస్ట్ వచ్చింది. మన స్కూల్‌కి గొప్ప పేరు తెచ్చి పెట్టింది. రాజ్యశ్రీని స్టేజ్ మీదకి అంతా కలిసి తీసుకురండి గట్టిగా చప్పట్లు కొడుతూ అంటూ గొప్పగా పొగుడుతూ చెప్పారు.

నిజంగానా, నేను స్టేట్ ఫస్ట్ వచ్చానా అని ఆశ్చర్యపోతూ, స్టేజీ మీదకి వెళ్లాను. అందరూ గట్టిగా చప్పట్లు కొడుతుంటే ప్రిన్సిపల్ మేడమ్, మా ఎకనామిక్స్ టీచర్ లక్ష్మి మేడమ్, హిస్టరీ టీచర్ హేమలత మేడమ్‌గార్లు అభినందించిన దృశ్యం ఇప్పటికీ నా మనసులో అందంగా, ఆహ్లాదంగా తిష్టవేసుకుని కూర్చుంది.

# టైప్ & షార్ట్‌హ్యాండ్...

తెలంగాణా ఉద్యమం సందర్భంగా చాలా రోజులు స్కూల్ నడవలేదు. ఇంట్లో కూర్చుని, కూర్చునీ విసుగ్గా వుండేది. మా కాలనీలో కొత్తగా టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ పెట్టారు. వూర్కెనే కూర్చునే బదులు టైప్ నేర్చుకుందామని వెళ్ళాను. నెలకి పది రూపాయలు కట్టాలి. ఒక గంట నేర్పిస్తాము అని చెప్పారు. ఇంట్లో కూర్చుని సోది కబుర్లతో కాలక్షేపం కన్నా ఏదో ఒకటి నేర్చుకుంటే మంచిదే కదా అని నాన్న సరే అన్నారు. అలా 10 రూపాయలు కట్టి టైప్‌లో చేరాను. ఎ,ఎస్,డి,ఎఫ్, / హెచ్.ఐ.జె.కె.ఎల్. ఇలా వుంటుంది టైప్ రైటింగ్ కీ బోర్డులో మొదట నేర్పించారు. అదేమిటి ఎ,బి,సి,డి,ఇ,ఎఫ్, ఇలా కదా ఇంగ్లీషు అక్షరాలు అని అడిగాను. కొన్ని రోజులకి బ్లైండ్ టచ్ అలవాటు అవ్వాలి. కీ బోర్డు చూడకుండా, నిముషానికి 40 అక్షరాలు టైప్ చెయ్యాలి. అందుకే ఇలా అలవాటు చేయడానికి ఈ రకంగా టైప్ చేయడం నేర్పిస్తాము అని చెప్పాడు అక్కడి ట్యూటర్ కిషన్‌గారు. ఒక నెల రోజులు అలా నోట్లో అనుకుంటూ ప్రాక్టీస్ చేసేసరికి, చూడకుండా అక్షరాలు, చిన్న చిన్న పదాలు టైప్ చేయడం వచ్చింది. నా పేరు టైప్ చేసి చూసుకొని పేపర్ తీసుకెళ్లి అమ్మకి చూపించి చాలా ఆనందపడ్డాను.

కొన్ని రోజులకి అక్కడ షార్ట్‌హ్యాండ్ కూడా నేర్పిస్తున్నారని తెలిసింది. షార్ట్‌హ్యాండ్ నేర్చుకుంటే క్లాసులో చెప్పే పాఠాలు, గబగబా రాసుకోవచ్చని, సంబరపడుతూ మరో 10 రూపాయలు కట్టి చేరాను. చాలా సరదాగా ఆసక్తిగా వుండేది క్లాస్. మొదట అక్షరాలు లాగా నేర్పించి, తరువాత పదాలు, వాక్యాలు నేర్పించారు. 'ఎ' రాయాలంటే ఒక చుక్క పెట్టడం, ఇలా చిన్న గుర్తులతో చాలా వేగంగా రాయడం అలవాటు అయింది. నిముషానికి 80 పదాలు రాయడం, లోయర్ నిముషానికి 120 పదాలు రాయడం హైయ్యర్ పరీక్ష పాస్ అవుతాము. షార్ట్‌హ్యాండ్‌కి చాలా హోమ్‌వర్క్ చేయాలి. ఒకే పదాన్ని చాలాసార్లు రాస్తేనే గానీ గుర్తు వుండదు. అక్కడ నేర్పించే దానికన్నా ఇంటివచ్చి ఆ పదాన్ని అనుకుంటూ దిద్దాలి.

నాతో పాటు దుర్గా అనే అమ్మాయి కూడా నేర్చుకోవడానికి వచ్చేది. ఇద్దరం చాలా సన్నిహితులం అయిపోయాం. వాళ్ల ఇళ్లు టైప్ ఇన్‌స్టిట్యూట్ పక్కనే ఉండేది. క్లాస్ అవ్వగానే దుర్గా వాళ్ల ఇంటికి వెళ్లి కబుర్లు చెప్పుకుంటూ వుండేవాళ్లం. అలాగే దుర్గ మా



స్నేహశీలి దుర్గ

ఇంట్లో మెంబర్‌లాగా కలిసిపోయింది. ఇప్పటికి మా స్నేహం కొనసాగుతోంది. నాకు స్టెనోగ్రాఫర్‌గా సచివాలయంలో ఉద్యోగం వచ్చినప్పుడు తనే తోడుగా వచ్చింది. ఇప్పుడు దుర్గ ఆంధ్ర మహిళాసభ కాలేజీ ప్రిన్సిపల్‌గా చేసి రిటైర్డ్ అయింది. నేను సెక్రటేరియట్‌లో డిప్యూటీ సెక్రటరీగా చేసి రిటైర్ అయ్యాను. అయినా ఈనాటికి మా స్నేహం మూడో పూవులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

అలా సెలవుల్లో టైప్ షార్ట్‌హ్యాండ్ లోయర్, హైయ్యర్ పాస్ అయ్యాను. పైగా ఈ రెండూ కూడా ఫస్ట్ ఎటెంప్ట్‌లో పాస్ అయినవాళ్లలో నేను బోర్డు ఫస్ట్ వచ్చాను. మా ఇన్స్టిట్యూట్ వాళ్లు కూడా చాలా గర్వపడ్డారు. నేను ఫస్ట్ వచ్చానని మా షార్ట్‌హ్యాండ్ నరేష్‌గారు నాకు ఒక బహుమానం కూడా ఇచ్చారు.

ఉద్యమం వలన విద్యార్థులందరూ ఒక విద్యా సంవత్సరం కోల్పోయారు. దానితో గ్రాడ్యుయేషన్ కోసం కాలేజ్‌లో చేరడం ఆలస్యం అయింది.

ఆ సమయంలో పేపర్లో టెలిఫోన్ ఆపరేటర్స్ ఉద్యోగాల కోసం ప్రకటన వచ్చింది. దానికి 10వ క్లాస్ పాస్ అయితే చాలు. చిన్న రాతపరీక్ష, వాయిస్ టెస్ట్ వుంటాయి. అని వుంది. నాకు చాలా సరదాగా అప్లై చేద్దామనిపించి, ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రాత పరీక్ష – అది చిన్న జనరల్ నాలెడ్జ్‌లో వుంది. అక్కడకక్కడే ఒక గంటలో పేపర్ దిద్ది, వాయిస్ టెస్ట్ వుంది, మీరు రాత పరీక్షలో పాస్ అయ్యారు. కొంచం సేపు వేచి వుండమని చెప్పారు. వాయిస్ టెస్ట్ అంటే ఏమిటో తెలియలేదు. నన్ను ఒక గదిలో కూర్చోమన్నారు. అక్కడ ఒక ల్యాండ్‌లైన్ టెలిఫోన్ వుంది. అది మోగుతోంది. అది తీసి మాట్లాడమని, ఒకతను వచ్చి చెప్పి వెళ్లాడు. అప్పటిదాకా ఎప్పుడూ ఫోన్‌లో మాట్లాడలేదు. అవతల మాట్లాడేది ఎవరో, నాకు తెలీదూ, గాభరాగా రిసీవర్ తీసి పట్టుకున్నాను. 'హలో' అనమన్నాడు అక్కడ వున్నతను. "హలో" అన్నాను. అవతల నుంచి "వాటీజ్ యువర్ నేమ్" అని అడిగారు ఎవరో "మై నేమ్ ఈజ్ రాజ్యశ్రీ" అని బుద్ధిగా చెప్పాను. వెంటనే లైన్ కట్ అయిపోయింది. బయటకి వచ్చి కూర్చోమన్నారు.

కాసేపటికి, ఫోన్‌లో మాట్లాడిన అజ్ఞాతవ్యక్తి వచ్చి, ఇక్కడ కూర్చున్న వాళ్లలో రాజ్యశ్రీ ఎవరు అని అడిగారు. “నేనే” అని నుంచున్నాను. “మీ గొంతు ఫోన్‌కి బాగా సరిపోయింది. సెలెక్ట్ అయ్యారు. ఇంటికి అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ పంపిస్తాము వెళ్లండి అని చెప్పారు.

ఇంక ఎంత సంతోషం వేసిందో నాకు. లెటర్ వచ్చేంతవరకూ ఎవ్వరికీ చెప్పద్దని అనుకున్నా. ఒక వారం రోజులకు రిజిష్టర్ పోస్ట్‌లో అప్పాయింట్‌మెంట్ లెటర్ వచ్చింది. అప్పుడు సంతోషంతో అమ్మకి చూపించి అమ్మా, నాన్నగారికి సాయంగా వుంటుంది నేను ఈ ఉద్యోగంలో చేరతాను అని అన్నాను. అమ్మకి కూడా సంతోషంగానే వుంది. చూద్దాం. మీ నాన్న ఏమంటారో అని అంది.

నాన్న ఆఫీసు నుండి వచ్చిన తరువాత చాలా సంతోషంగా ఉత్తరం చూపించాను. నాన్న మొత్తం అంత చదివి, దానిలో నైట్ డ్యూటీ చెయ్యాలనీ వుంది. ఆడపిల్లలు రాత్రిపూట అక్కడే వుండాలంటే కష్టం. పగలు డ్యూటీ ఇస్తారేమో, ఒక ఉత్తరం రాసి కనుక్కో అని ఉత్తరం ఆయనే డిక్టేట్ చేశారు. అలాగే రాసి పంపాను. దానికి వారి దగ్గర నుంచి వెంటనే జవాబు వచ్చింది. కొత్త చేరినవాళ్లకి రాత్రి డ్యూటీలు వుంటాయి. ఇక్కడ సెక్యూరిటీ వుంటుంది. మీతోపాటు వేరే అమ్మాయిలు కూడా వుంటారు. భయమేమీ వుండదు. పగలు ఇవ్వడానికి కుదరదు. వెంటనే వచ్చి చేరమంటూ దానిలోని సారాంశం.

అది చూపించి, నేను చేరతాను ఈ వుద్యోగంలో అంటూ గట్టిగా గొడవపెట్టాను ఇంట్లో. ఇంతలో మా నాయనమ్మ వచ్చి “ఇలా రాత్రిపూట ఆడపిల్లలు వుద్యోగాలు చేస్తే, రేపు పెళ్లి ఎలా అవుతుంది” ససేమిరా వద్దు అంటూ ఆర్డర్ వేసింది.

“పెళ్లిళ్లు కావంటే, మరి అంతమంది అమ్మాయిలు అక్కడ రాత్రి పూట డ్యూటీ ఎలా చేస్తున్నారు. వాళ్ల అమ్మానాన్నలకి లేని అభ్యంతరం మనింట్లో ఎందుకు అంటూ” ఆవిడతో గొడవ పెట్టుకున్నాను.

వాళ్ల సంగతి వాళ్లది. “మన ఇంట్లో కుదరదు” అని నాయనమ్మ. నాన్న ఎవరినీ సమర్థించకుండా, “అయినా ఇంత చిన్న వయసులోనే ఉద్యోగంలో చేరడం ఎందుకు నా

పిల్లలందరినీ పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయిద్దామనుకుంటున్నా. ఎలాగో అలాగ కష్టపడి ఫీజులు కడతా కానీ, ఇలా చదువు మానేసి ఇప్పుడే వుద్యోగం వద్దు. కాలేజ్ లైఫ్ కూడా చూడాలి కదా నువ్వు అంటూ నచ్చ చెప్పారు.

ఈ తర్జన భర్జనల్లో ఒక నెల గడిచిపోయింది. అదేమిటో, మళ్ళీ టెలిఫోన్ డిపార్టుమెంట్ నుంచి తొందరగా ఉద్యోగంలో చేరమంటూ లెటర్ వచ్చింది. అప్పటికే మళ్ళీ విద్యాసంస్థలు తెరుచుకోవడంతో, నా మొదటి టెలిఫోన్ ఆపరేటర్ ఉద్యోగం అటకెక్కింది. కానీ ఆ అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ నా దగ్గరి ఇప్పటికీ భద్రంగా వుంది. షార్ట్‌హ్యాండ్, టైప్ పాస్ అవడం వలన, డిగ్రీ లేకపోయినా ఎన్నో ఉద్యోగాలు వెతుక్కుంటూ వచ్చాయి నాకు.

చాలా రోజుల తరువాత, నా స్కూల్, కాలేజ్‌మేట్ రాజ్యలక్ష్మి, పెళ్లి అయిన తరువాత కలిసింది. ఏం చేస్తున్నావు అని అడిగా. మా మామగారు, తన పరపతి ఉపయోగించి నాకు టెలిఫోన్ ఆపరేటర్ ఉద్యోగం వేయించారు అని చెప్పింది. మరి రాత్రి డ్యూటీలు వుంటాయి కదా! అని అడిగాను. అవును. కానీ సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం కదా! మంచి జీతం వస్తుంది. పెన్షన్ వుంటుంది. కొంతకాలం రాత్రి డ్యూటీ చేసిన తరువాత లేదా పిల్లలు పుట్టిన తరువాత డిపార్టుమెంట్ వాళ్లే పగటి డ్యూటీకి మారుస్తారుట. అందుకని చేరాను. నువ్వు అప్పుడు, ఏ రికమెండేషన్ లేకుండా వచ్చిన వుద్యోగం వదలుకున్నావు. అప్పుడే చేరి వుంటే, ఈ పాటికి, ఏ డ్యూటీ డైరెక్టరో అయి వుండేదానివి" అంది.

అవును కదా! అని కుమలుతున్న మనసును ఓదార్చే పనిలో పడ్డా.

# చెప్పాలని ఉంది

70 ఏళ్ల జీవన ప్రస్థానంలో ఎన్నో మలుపులు, ఎన్నో మధురస్మృతులు. చిన్నతనంలో వివేక్‌నగర్‌లోని తాతగారింట్లో గడిపిన బాల్య స్మృతులు, వివేకనగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రాధమిక విద్య, నారాయణగూడలోని మాడపాటి హనుమంతరావు ఉన్నత పాఠశాలలో HSMP వరకు ఉన్నత చదువు, కోఠి వుమెన్స్ కాలేజీలో 1st Batch B.Com డిగ్రీ చదువు, వివాహం తరువాత ఆనందనగర్ కాలనీలో నివాసం, సచివాలయంలో వుద్యోగ పర్వం, పంజాగుట్ట గవర్నమెంటు క్వార్టర్స్‌లో 16 ఏళ్లు, పదవీ విరమణ తరువాత ఇందిరాపార్కు దగ్గర అశోక్‌నగర్, గోకుల్ అపార్టుమెంట్స్‌లో స్థిర నివాసం.

మా అపార్టుమెంట్ వాచ్‌మెన్ తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరిపిస్తాను, మీరు కొంచం స్కూల్ హెడ్ మాస్టారు గారితో మాట్లాడి ఇస్కూల్‌లో చేర్పించండి మేడమ్ అని అడిగింది. చిన్నప్పుడు నేను చదువుకున్న వివేక్‌నగర్ పాఠశాలలో అశోక్‌నగర్‌కి చాలా దగ్గర, మళ్లీ ఒకసారి చూసే అవకాశం ఈ రకంగా వచ్చినందుకు సంతోషంగా వుండి, వెంటనే సరే "పిల్లల్ని శుభ్రమైన బట్టలు వేసి, తయారుగా వుండు, 10 గంటలకి వెళ్దాము అని చెప్పాను. స్కూల్ ఆ రోజుల్లో ఎలా వుండేదో వూహించుకుంటూ వెళ్లిన నాకు, అప్పటికీ ఇప్పటికీ చాలా తేడా కనిపించింది. అప్పుడు స్కూలో ముందు చాలా విశాలమైన స్థలం వుండేది. పిల్లలు ఆడుకోవడానికి, ప్రార్థన చేయడానికి. కానీ ఇప్పుడు, అక్కడంతా తరగతి గదులు కట్టేశారు. హెడ్‌మాస్టరు గది ఎక్కడ అని ఆయాలను అడిగి వెళ్లాను. అడ్మిషన్స్ టైమ్ కదా! ఆయన దగ్గర చాలామంది వున్నారు. ఆ స్కూల్‌లోకి అడుగుపెట్టగానే, అదేదో నా పుట్టిల్లు అన్నంత స్వతంత్రంగా లోపలికి వెళ్లి, నన్ను నేను సెక్రటేరియట్‌లో డెప్యూటీ సెక్రటరీగా చేసి, రిటైర్ అయ్యానని పరిచయం చేసుకున్నాను. నమస్కారం అమ్మా, చాలా సంతోషం, కూర్చొండి. ఏ పని మీద వచ్చారు అని అడిగారు.

నేను ఆయన అడిగిన ప్రశ్నకు బదులివ్వకుండా, సంబరంగా, నేను ఒకటో తరగతి నుంచి, ఏడో తరగతి వరకూ ఇక్కడే చదువుకున్నానండి మాకు చదువు చెప్పిన టీచర్లందరూ ఇప్పుడు రిటైర్ అయిపోయి వుంటారు. కానీ ఇక్కడకు రాగానే, మా సూర్యనారాయణ మూర్తి సారూ, సుశీలాబాయి టీచర్, హనుమంతరావు సారూ అందరూ గుర్తుకొస్తున్నారు అని చెప్పాను.

అలాగా! చాలా సంతోషం మేడమ్. చిన్నప్పటి టీచర్లని గుర్తు పెట్టుకుని, స్కూల్‌ని చూడడానికి రావడం అని అన్నారు. నాకు కూడా సంతోషంగా వుందండీ. ఇప్పుడు నేను వచ్చిన పని ఏంటంటే, మా వాచ్‌మెన్ పిల్లల్ని ఈ స్కూల్‌లో వేద్దామని అంటూ లక్ష్మి అని పిలిచాను. పిల్లలకి స్కూల్‌డ్రెస్, పుస్తకాలు ఇస్తాము, మధ్యాహ్నం సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడతాము. అని చెప్పి రెండు ఫారెమ్స్ ఇచ్చి మీరు నింపండి అమ్మా. దీనితో బాటు, ఒక్కసారికీ వంద రూపాయలు కట్టాలి అని చెప్పారు.

ఆ ప్రక్రియ పూర్తి చేసి, పిల్లలకి ఒకటి, రెండు క్లాసులో చేర్పించాను. తరువాత స్కూల్ అంతా కలియ తిరిగి, స్టాఫ్ రూమ్‌కి వెళ్లి, టీచర్లందరినీ పలకరించి, ఇలా నేను స్కూల్‌లోనే చదువుకున్నాను. అంటూ అప్పుడున్న టీచర్ల గురించి వారిని అడిగాను. అవునండీ వాళ్లందరూ ఇప్పుడు రిటైర్ అయిపోయారు. మేము చేరిన కొత్తలో వాళ్లు వుండేవాళ్లు. వాళ్లే మాకు ఇప్పుడు ఆదర్శం అంటూ చెప్పారు. అలా చిన్ననాటి స్కూల్ చూసిన ఆనందంతో, మనసంతా సంతోషంతో నిండిపోయింది.

మా మనవడు అక్షర్‌ని బడిలో వేసినపుడు, ఏడుస్తుంటే, వాడికి సముదాయిస్తూ వున్నప్పుడు, మళ్లీ ఒకసారి నా స్కూల్ రోజులు గుర్తుకొచ్చి “ఇస్కూల్ యాదిలో” అని “మహిళా విజయం “ మాసపత్రికలో నాటి మధురస్మృతులు సీరియల్‌గా రాశాను.



**శ్రీవారు మాధవరావు, రాజ్యశ్రీ, కుమారుడు ఫణీంద్ర, కోడలు వత్సల, కుమార్తె ప్రియాంక, అల్లుడు శ్రీకాంత్, మనవడు అక్షర్**